

సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ



భారతదేశ ఆర్థిక వృద్ధి.. ప్రపంచ విశ్వాసానికి మూలం 07
వరద భయం వేళ... టిబెట్‌లో భూకంపం
బర్త్ టూరిజంపై ట్రంప్‌నకు మళ్ళీ కోర్టు షాక్! 08



సంపుటి 29, సంచిక: 76 | శుక్రవారం | 04-09-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## 6న కేబినేట్ విస్తరణ ?

మంత్రులుగా మహేష్ కుమార్ గౌడ్, గడ్డం ప్రసాద్ కుమార్, రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్ !



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చింది. ఈ నెల 6వ తేదీన మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలిసింది. కాంగ్రెస్ అధిష్టానం గురువారం పలు అంశాలకు ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు కూడా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. లోక్‌భవన్ వేదికగా ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలవడం అందుకు బలం చేకుర్చుతున్నది. మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలని సిఫార్సు లేఖను సిఎం గురువారం మధ్యాహ్నం గవర్నర్‌కు పంపారు. సాయంత్రం సిఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ బర్తరఫ్ లేఖను గవర్నర్ ఆమోదించారు. సిఎం రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగిస్తున్నట్లు, ఈ నిర్ణయం వెంటనే తరువాయి 8లో



## ఓల్డ్ సిటీ కాదు.. 'ఒరిజినల్ సిటీ'

చంచల్‌గూడ-సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులివ్వలేదని విమర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్

గత సర్కార్ చంచల్‌గూడ–సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి సకాలంలో నిధులు ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వేగంగా వంతెన నిర్మాణం పూర్తి చేసిందని తెలిపారు. ఈ ప్రాంతమంతా ఓల్ సిటీ కాదని... ఇది ఒరిజినల్ సిటీ అని కొనియాడారు. ఒకప్పుడు హైదరాబాద్ నగర ప్రజలు ఇసి, మూసీ నది నీళ్లు తాగేవారని, హైదరాబాద్‌కు విదేశీయులు ఎవరు వచ్చినా తరువాయి 8లో

మంత్రివర్గం నుంచి

# కొండా సురేఖ బర్తరఫ్



ముఖ్యమంత్రి సిఫారసును ఆమోదించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా



## రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి డాక్టర్ చిన్నారెడ్డి తొలగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనలపై కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలిగించేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఆమోదముద్ర వేయడంతో సురేఖను బర్తరఫ్ చేస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సురేఖ స్వచ్ఛందంగా రాజీనామా చేసేందుకు నిరాకరించిన నేపథ్యంలో, ఆమెను కేబినెట్ నుంచి తొలిగించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు తరువాయి 12లో

## రాష్ట్ర ప్రణాళికా సంఘం కొత్త ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, 'కుడా' చైర్‌పర్సన్‌గా సుధారాణి



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద, కాకతీయ అర్బన్ డేవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా జి.సుధారాణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ తరువాయి 12లో

## బర్తరఫ్ ఖండిస్తున్నా..

- నా వివరణ తీసుకోకుండానే నిర్ణయం తీసుకున్నారు
- నేను ఏ తప్పు చేయలేదు... అవమానంగా భావించను
- ప్లాన్ 'బి' ఏమీ లేదు – కాంగ్రెస్‌లోనే కొనసాగుతా
- మీడియా సమావేశంలో కొండా సురేఖ

తనను మంత్రివర్గం నుంచి తొలగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని బ్లాక్ మెయిల్ చేశారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు ముఖ్యమంత్రి లేఖ పంపిన నేపథ్యంలో గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆమె అధికారిక నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. ''నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరి శిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏమిటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా తరువాయి 8లో



'శుద్ధీకరణ'కోట్లాది మంది

## మనోభావాలతో ముడిపడి ఉంది

- బాధ్యులపై ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యేలా చర్యలు తీసుకోండి
- జెపి నడ్డాకు మల్లికార్జున ఖర్గే లేఖ

**న్యూఢిల్లీ :** హల్ద్వానిలో గత నెలలో తాను నిర్వహించిన ర్యాలీ స్థలంలో చేపట్టిన 'శుద్ధి' కార్యక్రమం అంటరానితనం చర్య వంటిదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామిని ఆదేశించాలని రాజ్యసభ సభ నాయకుడు జె.పి. నడ్డాను కోరారు. రాజ్యసభలో తాను ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు, విచారణ అనంతరం దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఖర్గే తన లేఖలో నడ్డాకు గుర్తు చేశారు. 'ఆగస్టు 8, 2026న హల్ద్వానిలో జరిగిన నా బహిరంగ సభ తర్వాత, అంటరానితనానికి సంబంధించిన 'శుద్ధి' వ్యవహారంపై ఆగస్టు 13, 2026న రాజ్యసభలో నేను ఎంతో బాధతో, ఆవేదనతో ప్రస్తావించిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది' తరువాయి 12లో

## వెయ్యోంతుల ఉత్సాహం

- కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి
- గాంధీభవన్‌లో ఘనంగా సంబరాలు




ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. టిపిసిసి తెలంగాణ మత్స్య సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాసులు కాల్చి, బ్యాండ్ బాజాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు మాట్లాడుతూ గత పదేళ్ల పాలనకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు.రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి కార్యక్రమాలతో ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నమన్నారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్‌యూనివర్సిటీతో పాటు మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, ఆర్ఆర్ఆర్, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తీవ్ర వాతావరణ ప్రమాదంలోకి ప్రపంచ దేశాలు

- ఐక్యరాజ్యసమితి హెచ్చరిక
- 70 ఏళ్ళలో లేనంత ఎల్‌నినో ప్రభావం
- చైనాకు ఒక్క ఏడాదిలో ఏడు తుఫానులు
- కొన్ని ప్రాంతాల్లో కరువు, మరికొన్నిచోట్ల కార్చిచ్చు, తుఫానులు
- ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తుంది : డబ్ల్యుఎంఓ
- పనామా కాలువలో నౌకల రవాణా తగ్గింపు




**న్యూయార్క్ :** ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రపంచ దేశాలు తీవ్ర వాతావరణ ప్రమాద దశలోకి ప్రవేశించాయని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ గురువారం హెచ్చరిక జారీ చేశారు.ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఓ)తాజా సమాచారాన్ని విడుదల చేసింది. గడచిన 70 సంవత్సరాలలో ఎన్నడూలేనంత తీవ్ర ఎల్‌నినో దశ 2027 ఫిబ్రవరి వరకూ అంతకుమించి కొద్ది నెలలపాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని డబ్ల్యుఎంఓ తన అంచనాలను ప్రకటించింది. గత ఏడాది డిసెంబరు నుండి 2026 జులై నాటికి సముద్ర ఉష్ణోగ్రతల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఈ ఎల్‌నినోవల్ల కొన్ని ప్రాంతాలు బలమైన కరువులోకి జారుకుంటాయని, మరికొన్ని ప్రాంతాలు బలమైన తుఫానులు,వరదలను ఎదుర్కొంటాయని, కొన్ని ప్రాంతాలలోని అడవుల్లో కార్చిచ్చు చెలరేగుతుందని పేర్కొంది. మానవ సమాజం తప్పిదాలవల్ల వాతావరణంలో వేడితోపాటు ఎల్‌నినోవల్ల అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రత గణనీయంగా పెరుగుతుందని తాజా సమాచారం తెలియజేసింది. ''మన కళ్ళముందే ఎల్‌నినో ప్రమాదం ముంచుకువస్తోంది,శాస్త్రీయ పరిశోధనలు అన్నీ కళ్ళెదురుగా కనిపిస్తున్నాయి,మన భూగ్రహంమీద ఎన్నడూచూడని విధంగా సముద్ర జలాలు లోతుల్లో కూడా వేడెక్కుతున్నాయి'' అని ఆంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నారు.ముందస్తు హెచ్చరిక వ్యవస్థను అన్నివిధాలుగా,అన్ని రంగాలలోనూ అప్రమత్తం చేసినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా బలహీన వర్గాలపై ఈ ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపించే అవకాశాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తరువాయి 8లో

## శాసనసభ సమావేశాలకు అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు 03



## నీతూబాయి ఇంటిపై ఇడి పంజా

నివాసంతో పాటు ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

నగరంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలతో భారీగా సొమ్ము కూడబెట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నీతూబాయి వ్యవహారంపై తరువాయి 12లో

## టౌన్ ప్లానింగ్ అధికారి ఆస్తులు రూ.3.54 కోట్లు

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సోమయ్యపై ఎసిబి కేసు నమోదు

ఆయన నివాసం, కార్యాలయం, బంధువులకు చెందిన ఏడు ప్రాంతాల్లో సోదాలు

వ్యవసాయ భూములు, ఇల్లు, ప్లాట్లు బంగారం స్వాధీనం

సోదాల్లో బయటపడిన రూ.4.63లక్షల నగదు, 709 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి



ప్రజాపక్షం/సూర్యాపేట

ఆదాయానికి మించిన ఆస్తుల కూడబెట్టారన్న ఆరోపణలపై సూర్యాపేట మున్సిపాలిటి టౌన్ ప్లానింగ్ అధికారి వి. సోమయ్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసిబి) కేసు నమోదు చేసింది. నల్లగొండ రేంజ్ ఏసిబి అధికారులు గురువారం సోమయ్య నివాసం, కార్యాలయంతోపాటు ఆయన బంధువులు, సహచరులకు సంబంధించిన మరో ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ మేరకు ఏసిబి అధికారికంగా వివరాలు వెల్లడించింది. సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను ఏసిబి అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఇందులో సూర్యాపేట జిల్లాలో 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో 5 నివాస ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో ఒక జి+1 భవనం, ఒక జి+2 భవనం, ఒక జి+4 భవనం ఒక పెంట్‌హౌస్, రెండు గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు ఉన్నాయి. సూర్యాపేట పరిధిలో 8 ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గుర్తించిన ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక విలువ కంటే చాలా ఎక్కువగా తరువాయి 12లో

'నల్సార్' విద్యార్థులపై చర్యలు

## ఆ అధికారం మీకెక్కడిది ?




- 'బిసిఐ'పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- విద్యాసంస్థలదే నిర్ణయాధికారమని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** న్యాయశాస్త్ర విద్యార్థుల ప్రవర్తనను నియంత్రించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ), రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు ఎలాంటి చట్టబద్ధమైన అధికారం లేదని, విద్యార్థులపై వారి సొంత నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారం విద్యాసంస్థలదేనని గురువారం సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ (నల్సార్) యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులు 2026 మందిలో ఎవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు తీవ్రస్థాయిలో వివాదాస్పదమైంది. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) పాల్గొనడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరువాయి 12లో

# కాంగ్రెస్‌లో క్రమశిక్షణకు అంకురార్పణ

మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్, రాష్ట్ర ప్రణాళికా కమిషన్ ఉపాధ్యక్ష పదవినుంచి వనపర్తికి చెందిన సీనియర్ నాయకుడు జి.చిన్నారెడ్డి ఉద్వాసనతో 15–20 రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్‌లో పొడచూపిన అసంతృప్తి, అసమ్మతి గణాలపై గురువారం క్రమశిక్షణ కొరడా ఝుళిపించింది కాంగ్రెస్ అధిష్టానవర్గం. వారిరువురూ ఎఐసిసి సభ్యులు కావటంవల్ల రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం నివేదిక అందిన తదుపరి అధిష్టానవర్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ తదితరులతో చర్చించి నిర్ణయం తీసుకుంది. తన వాదనను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు వినిపించేందుకు తనకుతానుగా ఢిల్లీ వెళ్లిన సురేఖ ఖర్గేతోపాటు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌నేగాక కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్మన్ సోనియాగాంధీని కూడా కలుసుకున్నారు. రాహుల్‌గాంధి, కె.సి. వేణుగోపాల్‌ను కలుసుకునే అవకాశం లభించలేదు. ఆగస్టు 19న కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల సందర్భంగా గీసుకొండలో ఆమె కూతురు సుశ్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలు చేయటం వివాదానికి అగ్గి రాజేసింది. మంత్రిగా ఉన్న సురేఖ తల్లిగా స్పందించారేగాని మంత్రివర్గ సహచరిగా తమ ముఖ్యమంత్రిపై కూతురు దూషణలను, దుర్భాషలను ఖండించలేదు. దాదాపు పాతికమంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సురేఖ కుమార్తె నోటిదురుసును తల్లి ఖండించకపోవటాన్ని తప్పు పట్టారు. ఆమెపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మల్లు రవి నేతృత్వంలోని క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేశారు. కొండా సురేఖ వాదన ఆరోజు నుంచి బుధవారం ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టివరకు ఒకటే – 'నా కుమార్తె స్వతంత్రురాలు. ఆమె అభిప్రాయాలు ఆమె సొంతం. మాకు సంబంధం లేదు. ఆమె వ్యాఖ్యలకు నన్నెలా శిక్షిస్తారు' అనేదే. తన బిడ్డ 'రేవంత్‌రెడ్డికి కళ్లు నెత్తికెక్కాయి...ఆయన అయ్య, తాత ఎవడైనా రానీ...లాంటి బజారు మాటలతోపాటు, అవినీతి ఆరోపణలు చేయటం ఆమెకు తప్పుగా అనిపించలేదు. అందుకే వాటిని ఆమె ఖండించలేదు. బుధవారం ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేతో చర్చల అనంతరం ఆమె తనకు పదవీ గండం తప్పదని గ్రహించినట్లున్నారు – అందుకే బెదిరింపు ప్రకటన చేశారు. తన తొలగింపునకు కుట్ర జరుగుతోందని అంటూ 'నేను బిసి మహిళను, నేను పద్మశాలీ – తెలంగాణలో 16శాతం ఉన్నారు. నా భర్త మున్నూరు కాపు' అంటూ మహిళ, బిసి, కులం కార్డులు తీశారు. అధిష్టానవర్గం గురువారం ఆమె బర్తరఫ్‌కు సిఎంకు అనుమతించాక మరీ చిత్రంగా మాట్లాడారు. 'కాంగ్రెస్ అధిష్టానవర్గం నా పట్ల సానుభూతితోనే ఉంది. అయితే రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిల్ చేశారు – సురేఖను తొలగించకపోతే నేను తొలగుతా' అని అన్నారట! ఆమె పాతికేళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఆయన అభిమానురాలిగా మండలాధ్యక్షపదవితో రాజకీయ జీవితం ప్రారంభించిన సురేఖ ఆయన మరణానంతరం కొంతకాలం జగన్మోహన్‌రెడ్డితో ప్రయాణించారు. తర్వాత బిఆర్‌ఎస్‌లో చేరారు. మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారు. రేవంత్‌రెడ్డితో ఘర్షణ పడటానికి ఆమె తన మనసులోని బాధను బయటపెట్టారు. 'నా బిడ్డ 10 ఏళ్లుగా ఎన్నికల్లో పోటీకి టిక్కెట్ కోసం ప్రయత్నిస్తోంది. కడియం శ్రీహరి తన బిడ్డను ఎంపిని చేసుకున్నారు. డి.ఎస్. ఇంట్లో రెండు పార్టీలున్నాయి, అరవింద్ బిజెపిలో ఉన్నారు' అన్నారు. తన బిడ్డ పోటీ చేయాలనుకుంటున్న పరకాల నుంచి వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని గెలిపించాలని ఆ నియోజకవర్గ పర్యటనలో ముఖ్యమంత్రి ఓటర్లకు విజ్ఞప్తి చేయటం సురేఖ కూతురు సుశ్మిత ఆగ్రహానికి హేతువైంది. అందుకే పచ్చ కాంగ్రెస్ (టిడిపిలో నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులను ఉద్దేశించి) అని ఆమె దూషించారు. టిడిపి రక్తం ప్రవహించేవారే అటువంటి నిర్ణయా లు తీసుకోగలరని సురేఖ తాజాగా వ్యాఖ్యానించారు. పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ప్రకటిస్తుండటం, అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించటం క్రమశిక్షణ ఉల్లంఘన కాదా అని ఆమె ఫిర్యాదు చేశారు.

కొండా సురేఖ అంచనా రెండు విషయాల్లో తప్పింది. బిడ్డపై ప్రేమతో ముఖ్యమంత్రితో ఢీ కొనటం మొదటి తప్పు. రెండు, కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం ఎక్కువ కాబట్టి ముఖ్యమంత్రినే కాదు, అధిష్టానవర్గం నేతలను దూషించినా పెద్దగా పట్టించుకోరన్న ధీమా. రాహుల్‌గాంధీ జమానాలో కాంగ్రెస్‌లో కనీస క్రమశిక్షణ పాటించేటట్లు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని ఆమే కాదు, చిన్నారెడ్డి కూడా గ్రహించలేదు. కర్నాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న వ్యక్తి డి.కె.శివకుమార్ మంత్రివర్గంలో ఉండగా అతనిపై గత కాలపు పనులకు అవినీతి ఆరోపణలు రాగా, పార్టీ అధిష్టానవర్గం ఆయన చేత రాజీనామా చేయించింది. ఇదంతా నెలరోజులలోపే జరిగింది. చిన్నారెడ్డికి స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డితో వైరం ఉంది. అతడు డబ్బిచ్చి పార్టీ టిక్కెట్ తెచ్చుకున్నాడని ఆరోపించారు. అది అధిష్టానానికి పరోక్షంగా తగిలింది. ఆ ఎమ్మెల్యే ఢిల్లీ దాకా వెళ్లి ఫిర్యాదు చేశాడు. ముఖ్యమంత్రిపై పరోక్ష విమర్శలు, ఆరోపణలతో పదవులకోసం ఒత్తిడి చేసేవారు మరికొందరున్నారు. సురేఖ, చిన్నారెడ్డిపై అధిష్టానవర్గం చర్య, క్రమశిక్షణ హద్దులు దాటి పార్టీ ప్రతిష్టకు హానిచేసేవారు ఎంతటివారైనా చర్య తప్పదని హెచ్చరిస్తున్నది. కొండా సురేఖ ప్రయోగించిన బి.సి. మహిళ, తమ భార్యాభర్తల కులం కార్డులకు ముఖ్యమంత్రి దీటైన సమాధానం ఇచ్చారు. బిసి మహిళ గుండు సుధారాణి (మాజీ ఎంపి)ని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, హైదరాబాద్ మాజీ మేయర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు కుమార్తె గద్వాల విజయలక్ష్మిని (మున్నూరుకాపు) ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా, గౌడ మహిళ నేరెళ్ల శారదను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా నియమించారు. ఈ మొత్తం ఉదంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థానాన్ని పటిష్టం చేసుకున్నారు.



## శాంతి స్థాపనకు భారత్ సిద్ధం

**అంతులేకుండా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని నివారించేందుకు, రెండు దేశాల మధ్య శాంతి స్థాపనకు భారత్ సిద్ధంగా ఉంది. శాంతి స్థాపనలో ఏ రకమైన సహాయం చేయడానికైనా భారత్ సిద్ధంగా ఉంది. అయితే, ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది రెండు దేశాలే. ఈ విషయంపై ఉక్రెయిన్ మంత్రితో జరిగిన చర్చల్లో ఇదే ప్రధానమైన అంశం. యుద్ధం కొనసాగేకొద్దీ ప్రతి రోజూ ప్రాణాలు పోతూనే ఉంటాయి. విధ్వంసం జరుగుతూనే ఉంటుంది.**

– కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్




## అడవులు, వన్యప్రాణుల రక్షణ మన బాధ్యత

నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో వన్యప్రాణుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష, జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను కొనసాగించని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సమతుల్యత:** మన పిల్లలకు అపార సంపదలను సంపాదించిపెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ జలం, పీల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషి వద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకోవాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. ప్రముఖ వన్యప్రాణి పక్షపాతి 'స్టీవ్ ఇర్విన్' సేవలకు గుర్తుగా నిర్వహించుకోవాలని 'కెల్లీన్ పైజ్' ప్రతిపాదించడంతో ఈ దినోత్సవం కొనసాగుతున్నది.

**జాతీయ వన్యప్రాణుల దినోత్సవం:** నేటి జీవజాతుల్లో దాదాపు ఒక మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయనే భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. జీవవైవిధ్య పరిరక్షణకు లేదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస పేర్కొనడం విశేషం. 2005 నుంచి పాటిస్తున్న జాతీయ వన్యప్రాణుల దినోత్సవం–2026 సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణ, జీవజాతులను అంతరించిపోకుండా చూడడం లాంటి అంశాలను తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది.

**జాతీయ వన్యప్రాణుల దినోత్సవ వేదికగా చేయదగిన కార్యక్రమాలు:** జాతీయ వన్యప్రాణుల దినోత్సవం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటివి నిర్వహిస్తూనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్లైన్ లేదా ఆఫ్‌లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు, పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ ప్రధాన విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాల్పడితే రేపటితరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. జీవవైవిధ్య దీపాన్ని కాపాడుకుంటూ మన గృహమైన భూగ్రహాన్ని చక్కదిద్దుకుందాం.

*(04 సెప్టెంబర్ జాతీయ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా)*

# ఆరేండ్ల ఆదిత్యపై ప్రభుత్వానికి కోపం దేనికి?



మేరుగు రాజయ్య
9441440791

నేటి యువతను, పిల్లలను 'జన్ జడ్, 'జెన్ ఆల్ఫా'తో పోల్చుతున్నారు. వీరిని భవిష్యత్తుకు మార్గదర్శకులుగా పేర్కొంటున్నారు. జన్ జడ్ అంటే? 1997 నుండి 2012 మధ్య కాలంలో పుట్టినవారు. దాదాపు 12 నుండి 16 ఏండ్ల వయస్సులో ఉన్నవారు. వీరు చిన్న నాటి నుండి ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్‌లు, సోషల్ మీడియాలో మొదటి సామాజిక తరంగాలను ఉపయోగించుచున్నారు. ఇక జన్ ఆల్ఫా అంటే? 2010 నుండి 2025 మధ్య జన్మించారు. వీరి జీవితంలో స్క్రీన్‌లు, స్మార్ట్ డివైస్, ఇంటర్నెట్ సహజ భాగమైనవి. కాని ఆరేండ్ల పిల్లవాడిగా మీడియాలో వైరల్ అయిన బీహార్ రాష్ట్రానికి చెందిన 'ఆదిత్య కుమార్' ఇంటర్నెట్ ను వినియోగించుకునే ఆర్థిక స్థితిలో లేదు. తండ్రి రంజిత్ కుమార్ దినసరి కూలి. తల్లి మున్నీ కుమారి ఇంటి పనుల కార్మికురాలు. ఒక్క గది ఇంటిలో నివసిస్తారు. ఆదిత్య కుమార్ నాలుగవ తరగతి చదువుతున్నాడని, లెక్కలు, ఇంగ్లీష్, హిందీ పాఠ్యాంశాలతో పాటు ఇతర పుస్తకాలను, భారత రాజ్యాంగాన్ని బాగా చదువుతాడని తెలిసింది. 2026 ఆగస్ట్ 25న డాక్ బంగ్లా చౌక్ దగ్గర జరుగుచున్న నిరసనల్లో పాల్గొనేందుకు వెళతానని అమ్మానాన్నతో చెప్పాడు. దానితో కుమారుడిని తీసుకుని కవాతులో పాల్గొన్నారు.

కవాతులో పాల్గొన్న ఆదిత్య కుమార్ పై మీడియా దృష్టి పడింది. న్యూస్ కవరేజీలో భాగంగా ఆదిత్య కుమార్ నిరసనను కూడా ప్రదర్శించారు. ''అవినీతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతాను. లాఠీ ఛార్జ్ జరిగితే దెబ్బలు తినే మొదటి వ్యక్తిని నేనే అవుతాను. మా తరం ఉన్నత చదువులకు చేరుకునే నాటికి పేపర్ లీకులు, అవినీతి వ్యవహారాలు సమసి పోవాలి. విద్యార్థులపై లాఠీ ఛార్జీకి అనుమతించిన వారిపై చర్యలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి రాజీనామా చేయాలని'' చెప్పాడు. మీడియాలో ప్రసారం అయిన ఆదిత్య కుమార్ నిరసనకు దేశవ్యాప్తంగా మద్దతు వచ్చింది. అభినవ భగత్ సింగ్ అని పొగడ్తలు వచ్చినవి. బీహార్ యువత, విద్యార్థుల పోరాటానికి కూడా మద్దతు పెరిగింది. పోలీసులు భద్రత దృష్ట్యా ఆదిత్య కుమార్‌ను తమ అధీనంలోకి తీసుకుని 6 గంటల అనంతరం విడిచిపెట్టారని తెలిసింది. కాని తండ్రి రంజిత్ కుమార్, తల్లి మున్నీ కుమారిని పోలీస్ స్టేషన్ కు తీసుకుపోయి లాఠీలతో కొట్టిన సంఘటనలపై చర్యలు తీసుకోవాలని ఆదిత్య కుమార్ గార్డెనిబాగ్ లో ధర్నా చేశాడు.

సహజ వనరుల రీత్యా బీహార్ సుసంపన్న రాష్ట్రం. దక్షిణ భాగమైన రాంచీ, జంషెడ్ పూర్, బొకారో, ధన్ బాద్ పారిశ్రామిక ప్రాంతాలతో 2000 నవంబర్ 15 న జార్ఖండ్ రాష్ట్రంగా విడిపోయింది. అయినప్పటికీ విభక్త బీహార్ భూభాగంలో 7.84శాతం అడవుల నుండి సాల్, శీషమ్, ఖైర, వెదురు లాంటి ఉత్పత్తులకు అవకాశం ఉంది. సిమెంటు పరిశ్రమకు కీలకమైన సున్నపురాయి రోహతాస్, కైమూర్ జిల్లాలలో ఉంది. దేశంలోనే అత్యధిక పైరైట్స్, మైకా నిక్షేపాలు రోహతాస్ జిల్లా అమోజూర్‌లో ఉన్నవి. జముయి జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లుగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ)గుర్తించింది. క్వార్జైట్, స్టీయటైట్, చైనాక్లే (కలిమట్టి)ఇసుక పుష్కలంగా ఉన్నవి. బంగారం కంటే విలువైన 14 రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ బ్లాక్‌లు గుర్తించబడినవి. పల్లాడియం, టైటానియం, గ్లాకొనైట్, కోబాల్ట్ ఖనిజాలు ఉన్నవి. బంకా జిల్లాలో కోబాల్ట్ నిక్షేపాలు ఉన్నవి. భాగల్పూర్ జిల్లాలోని బటేశ్వర్ స్థాన్‌లో 17 రకాల రసాయన మూలకాలు ఉన్నవి. ఇవి ప్రకృతిలో తక్కువ పరిమాణంలో లభిస్తాయి. ఆధునిక రక్షణరంగంలో క్షిపణులు, రాడార్ వ్యవస్థలు, యుద్ధ విమానాలు, డ్రోన్లు, ల్యాప్ ట్యాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, టివి స్క్రీన్ లు, కెమెరా లెన్స్, స్పీకర్ తయారుకు ఉపయోగిస్తారు. ఇప్పుడు చైనా అగ్రస్థానంలో ఉంది. ఇక వ్యవసాయ పంటలకు సారవంతమైన ఒండ్రు నేలలు ఉన్నవి. గంగా, కోసి, గండక్, సోన్, భాగమతి, ఘాగ్రా లాంటి జీవనదులు, నిండుగా ఉన్న భూగర్భ జలాలతో వరి, గోధుమ, చెరకు, జనపనార, పప్పు ధాన్యాలు పండుతాయి.

బీహార్ లో గత 15 సంవత్సరాల నుండి ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు లేవని తెలుస్తుంది. 2006 నుండి 2021 వరకు రాష్ట్ర నిధులను ఆదా చేయడానికి ఉపాధ్యాయులను, ఆరోగ్య కార్యకర్తలను, జూనియర్ ఇంజనీర్ నియామకాల భర్తీలను కాంట్రాక్ట్(నియోజన్)పద్ధతులలో కొనసాగిస్తున్నారు. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ కంబైన్డ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్(బి పిఎస్సి సిసిఇ)నోటిఫికేషన్ ను 2024 సెప్టెంబర్ 23న విడుదల చేశారు. అభ్యర్థుల ఎంపికకై ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశలను ఎన్నుకున్నారు. ఇందులో సహాయక పట్టణ సంక్షేమ, రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జ్యూడీషియల్ సర్వీసెస్, సివిల్ కోర్టు ప్యూన్ & అటెండెంట్స్, సహాయక ప్రజా పారిశుద్ధ్య& వ్యర్థాల నిర్వహణ అధికారి, సహాయ విద్య అభివృద్ధి అధికారి పోస్టుల ఖాళీలను ప్రకటించారు. సంబంధించిన పరీక్షలు 2024 ఏప్రిల్ 25 నుండి 30 వరకు జరిగినవి. అలాగే డిసెంబర్ 13,14 తేదీలలో కూడా జరిగినవి. 2026 మే 3, 4 తేదీలలో పాట్నాలో 12 పరీక్ష కేంద్రాలలో జరిగిన పరీక్షలలో భారీ అవకతకలు జరిగాయని ఆరోపణలు రాగా పోలీసులు పరీక్షా కేంద్రాలపై దాడులు చేసి నిందితులను అరెస్ట్ చేశారు. దానితో ఉద్యోగ నియామకాల పరీక్షలను కొన్నింటిని వాయిదా వేశారు. కొన్నింటిని రద్దు చేశారు. బిపిఎస్సిసిఇ పరీక్షలను రాసిన దాదాపు 11 లక్షల మంది యువత తీవ్ర ఆందోళనలకు గురై నిరసనలకు దిగారు. ఆగస్టు 25న జరిగిన నిరసనలో బారికేడ్లను తొలగించారు. వాటర్ కెనాన్లకు ఎదురొడ్డి ముందుకు సాగారు. ఈ నిరసనలో కూడా ఆరేండ్ల ఆదిత్య కుమార్ పాల్గొని దేశ ప్రజల ఆసక్తికి, ప్రభుత్వ కోపానికి కారణమైనాడు.



ప్రజాస్వామిక సంస్థలను, ప్రజల భావ వ్యక్తీకరణలను ప్రభుత్వం గౌరవించినప్పుడే ప్రజాస్వామిక సౌధం పరిఢవిల్లుతుంది. బ్యాలెట్ మెజారిటీ తీర్పునే ప్రజల ఆమోదంగా పరిగణించడం సరికాదు. ప్రతి ఎన్నికల ఫలితాలలో గెలిచిన పార్టీ ఓట్ల కంటే ఓడిన పార్టీల ఓట్లే అధికంగా ఉంటున్నవి. ప్రతి పక్షాలకు పోలైన ఓట్లకు జవాబుదారీగా అధికార పార్టీ పాలన సాగాలి. కాని ప్రభుత్వ తప్పిదాలను వ్యతిరేకించిన ప్రతివారినీ పలురకాల యిబ్బందులకు గురిచేయడం పరిపాటిగా జరుగుతుంది. బిజెపి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన 2014 నుండి కొత్త కొత్త ప్రయోగాలతో కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. వివేక్ అగ్నిహోత్రి అనే దర్శకుడు తీసిన 'కాశ్మీర్ ఫైల్స్' సినిమా 2022 మార్చి 9న విడుదల అయింది.

మార్చి 15న ప్రధాని నరేంద్ర మోదీ సినిమాను చూచినట్లుగా,బిజెపి ఎమ్మెల్యేలను కాశ్మీర్ ఫైల్స్ చూడాలని సిఫార్సు చేసిన వార్త పత్రికలలో కూడా వచ్చింది. ఆ సినిమాలోనే 'అర్బన్ నక్సల్స్' అనే పద ప్రయోగం మొదటగా వచ్చింది. ఇది ఉత్తమ చిత్రంగా కూడా ఎన్నికైంది. 2018లో జరిగిన బీమకోరేగావ్ కేసుతో ప్రాచుర్యంలోకి వచ్చి రాహుల్ గాంధీ కూడా అర్బన్ నక్సల్ అనే దాకా ఎదిగింది.

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా ఎర్రకోటపై జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం దేశ ప్రజల ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ వ్యతిరేక స్వరాలను 'దిమాగీ నక్సల్ గా సంబోధించాడు.

2022–2023 నాటికి జాతీయ సగటు 3.2శాతంతో పోలిస్తే బీహార్ రాష్ట్ర నిరుద్యోగ రేటు 3.9 శాతంగా ఉంది. జాతీయ బహుముఖ పేదరిక సూచిక ప్రకారం రాష్ట్ర జనాభాలో దాదాపు 34 శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారు. బతుకుదెరువు కోసం ప్రతి మూడు కుటుంబాలలో రెండింటిలో కనీసం ఒక సభ్యుడు వలసపోయాడు. ప్రతి ఉదయం బీహార్‌లో ఒక కుటుంబం పెట్టె తాళంతీసి అందులోంచి ప్రయాణ సంచిని బయటకుతీసి వెళ్లే రైలు ఎక్కుతున్న మరో యువకుడిని చూస్తుంది బీహార్ రాష్ట్రం.

1981లో 10 నుండి 15 శాతం కుటుంబాలలో వలస కార్మికులు ఉండేవారు. కాని 2020 నాటికి 65 శాతం పెరిగిందన్న అంచనాలు ఉన్నవి. ఇక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు దాదాపు 15 సంవత్సరాలుగా లేవు. గత రెండు సంవత్సరాల నుండి ఉద్యోగ నియామకాల ప్రక్రియలో అనేక అవకతవకలు జరిగి రద్దు చేసే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ అసమర్థతను ఎత్తి చూపిన వారిని కక్ష్య సాధింపు చర్యలకు గురి చేస్తున్నారు. బ్రహ్మను నమ్మేవారు ఉన్నారు. అలాగే నమ్మని వారు కూడా ఉన్నారు. కాని ''బ్రహ్మ రాతను చెరపలేరన్న'' నానుడైతే ఉంది. మేజర్ చంద్రకాంత్ సినిమాలో ప్రాణాంతక జబ్బుతో బాధపడుతున్న నానమ్మను ఉద్దేశించి మనుమడు మనుమరాలు పాట పాడుతారు.

'సుఖీభవ సుమంగళీ సుఖీభవా, ఆ,ఆ..
సుశీలవై చిరాయువై సుఖీభవా, ఆ, ఆ, చరణం విన్న
తాత 'ఈ బాల వాక్కు బ్రహ్మ వాక్కు ఒక్కటేననీ,
నిండుగా, నూరేళ్లుగా ఉండి పొమ్మనీ వంతపాడతారు.

సామాన్యంగా సమాజం వినపడని, కనిపించని బ్రహ్మ వాక్కు కంటే బాల వాక్కును విశ్వసిస్తుంది. పిల్లలు చల్లని వారని, కల్లాకపటం ఎరుగరని, సత్యమే మాట్లాడతారని సమాజం నమ్ముతూ వస్తోంది. బీహార్ రాష్ట్రం పాట్నాలోని ఆదిత్య కుమార్ బాలవాక్కును కూడా సమాజం విశ్వసిస్తుంది.

అందుకే దేశవ్యాప్తంగా వైరల్ అయినాడు. కాబట్టి ప్రభుత్వం అక్కసును వీడి, తల్లిదండ్రులపై కక్ష్య సాధింపు చర్యలకు స్వస్తిచెప్పి ఆ కుటుంబానికి ఉపాధిని చూపి ఆదిత్య కుమార్‌కు మెరుగైన విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పించాలి. అలాగే పాలకులు, ప్రభుత్వ యంత్రాంగం నిర్వహణపరమైన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజలకు మేలుచేసే పాలనను సాగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# రోహిణి కమిషన్ నివేదికపై మూడేళ్లుగా మౌనం ఎందుకు?



డా.ముచ్చుకోట సురేష్ బాబు
9989988912

భారతదేశంలో రిజర్వేషన్లు కేవలం శాతాల లెక్క కాదు. చారిత్రకంగా విద్య, ఉద్యోగాలు, సామాజిక అవకాశాలకు దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం వాటి ప్రధాన ఉద్దేశం. అయితే, రిజర్వేషన్ ప్రయోజనాలు రిజర్వేషన్ పొందుతున్న అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా అన్న ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రశ్నకు సమాధానం వెతికేందుకే కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 కింద రోహిణి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, ఇతర వెనుకబడిన తరగతులు – OBCల– రిజర్వేషన్‌లో ఉపవర్గీకరణను పరిశీలించింది. అసలు ప్రశ్న సూటిగా ఉంది: ఒబిసిలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో లభిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా? లేక కొన్ని బలమైన, రాజకీయంగా ప్రభావవంతమైన వర్గాలకే అధిక ప్రయోజనం దక్కుతోందా?

**రిజర్వేషన్‌లోనే అసమానత?**

మండల్ కమిషన్ సిఫారసుల అమలు, 1992లో సుప్రీం కోర్టు ఇంద్రా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు నేపథ్యంలో ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది. కానీ ఒబిసిలు ఒకే సామాజిక వర్గం కాదు. వేలాది కులాలు, ఉపకులాలు ఇందులో ఉన్నాయి. వాటి విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితి, సామాజిక వెనుకబాటుతనం, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వాటా ఒకేలా లేవు.

కొన్ని వర్గా లు రిజర్వేషన్ ప్రయోజనాలను పదేపదే పొందుతుంటే, మరికొన్ని వర్గాలకు తక్కువ లేదా అసలు ప్రాతినిధ్యం లేకపోతే, ఆ వ్యవస్థను నిజమైన సామాజిక న్యాయంగా ఎలా పరిగణించాలి? ఇదే రోహిణి కమిషన్ ముందున్న ప్రధాన ప్రశ్న. కమిషన్ లక్ష్యం మొత్తం 27 శాతం కోటాను పెంచడం లేదా తగ్గించడం కాదు. ఆ కోటాను ఒబిసిల్లోని వివిధ ఉపవర్గాలకు మరింత సమానంగా పంపిణీ చేయాలా అన్నదే దాని పరిశీలన. అంటే ఇది రిజర్వేషన్‌కు వ్యతిరేకమైన ఆలోచన కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు నిజంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరుతున్నాయా? అన్నదే అసలు పరీక్ష.

కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఒబిసి వర్గాల ప్రాతినిధ్యాన్ని కమిషన్ పరిశీలించింది. కమిషన్ అధ్యయనంలో రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీలో గణనీయమైన అసమానతలు ఉన్నట్లు వెల్లడైనట్లు నివేదికలు సూచించాయి. కొద్దిమంది ఒబిసి వర్గాలు అధిక ప్రయోజనం పొందగా, పెద్ద సంఖ్యలోని ఇతర వర్గాలకు తక్కువ లేదా దాదాపు ఎలాంటి ప్రాతినిధ్యం లభించలేదనే అంశం చర్చకు వచ్చింది. ఇది నిజమైతే, ప్రశ్న రిజర్వేషన్ అవసరమా కాదా అనేది కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయి? అన్నదే అసలు ప్రశ్న.

అయితే ఇక్కడ ఒక తీవ్రమైన సమస్య ఉంది – కులాల వారీ నమ్మదగిన గణాంకాల కొరత. భారతదేశంలో చివరిసారిగా సమగ్ర కులగణన 1931లో జరిగింది. 2011 సామాజిక, ఆర్థిక, కుల గణనలో కుల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఒబిసిలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విధాన రూపకల్పనకు అనువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. అందువల్ల ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది: వ్యక్తిగత ఒబిసి వర్గాల జనాభా, విద్య, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం ఎంత అనేది స్పష్టంగా తెలియకుండా రిజర్వేషన్‌ను ఎలా న్యాయంగా పునర్విభజించాలి? అదే సమయంలో మరో ప్రశ్న కూడా ఉంది: పూర్తి స్థాయి గణాంకాలు లేవనే కారణంతో, ఇప్పటికే కనిపిస్తున్న అసమానతలను సరిచేయడానికి చర్యలను నిరవధికంగా వాయిదా వేయాలా? డేటా విధాన నిర్ణయాలను మెరుగుపరచాలి. విధాన నిర్ణయాలను స్తంభింపజేయకూడదు.

**14 సార్లు గడువు పొడిగింపు**

రోహిణి కమిషన్ ప్రయాణమే ఈ అంశం ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తుంది. మొదట స్వల్ప వ్యవధిలో నివేదిక ఇవ్వాల్సిన కమిషన్ గడువు పదేపదే పొడిగించబడింది. మొత్తం 14సార్లు గడువు పొడిగించినట్లు సమాచారం. చివరకు దాదాపు ఆరేళ్ల అనంతరం, 2023 జులై 31న జస్టిస్ రోహిణి తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు. కానీ నివేదిక సమర్పణతో సమస్య పరిష్కారం కాలేదు. ఇక్కడే అసలు ప్రశ్న:కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, నివేదిక వచ్చిన తర్వాత దానిపై స్పష్టమైన నిర్ణయం ఎందుకు ప్రకటించడం లేదు? కమిషన్ పరిశీలించగలదు. గణాంకాలను సేకరించగలదు. సిఫారసులు చేయగలదు. కానీ వాటిని విధానంగా మార్చేది మాత్రం రాజకీయ సంకల్పమే కదా!

**క్రీమీ లేయర్ వేరు.. ఉపవర్గీకరణ వేరు**

ఒబిసి చర్చలో తరచూ రెండు వేర్వేరు అంశాలు కలిసిపోతాయి – క్రీమీ లేయర్, ఉపవర్గీకరణ. క్రీమీ లేయర్ విధానం ద్వారా ఒబిసిల్లో సామాజికంగా, ఆర్థికంగా ముందున్న వ్యక్తులు, కుటుంబాలను రిజర్వేషన్ నుంచి మినహాయిస్తారు. ఉపవర్గీకరణ మాత్రం ఒబిసిలకు కేటాయించిన 27 శాతం కోటాను వివిధ సమాజాల మధ్య ఎలా సమానంగా పంపిణీ చేయాలన్నది. ఒకటి వ్యక్తి లేదా కుటుంబ స్థాయిలో పనిచేస్తే, మరొకటి సామాజిక వర్గాల స్థాయిలో పనిచేస్తుంది.

2024 ఆగస్టు 1న స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పు నేరుగా ఒబిసిలకు సంబంధించినది కాదు. అయినప్పటికీ, రిజర్వేషన్ కేటగిరీలలో అంతర్గత అసమానతలను గుర్తించి, వాస్తవ సమానత్వం కోసం ఉపవర్గీకరణ చేయవచ్చా అన్న చర్చకు ఇది కొత్త బలం ఇచ్చింది. అయితే అసలు అడ్డంకి చట్టం మాత్రమే కాదు – రాజకీయాలు కూడా. 27 శాతం కోటాను పునర్విభజిస్తే కొందరు వర్గాలకు ప్రయోజనం, మరికొందరికి నష్టం కలగవచ్చు. ఇప్పటికే అధిక ప్రయోజనాలు పొందుతున్న వర్గాలు తమ వాటాను తగ్గించడానికి వ్యతిరేకించవచ్చు. అత్యంత వెనుకబడిన వర్గాలు మాత్రం తమకు ప్రత్యేక వాటా కోరవచ్చు. కానీ సామాజిక న్యాయాన్ని కేవలం ఎన్నికల గణితంగా మార్చకూడదు.

**ఇక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం**

రోహిణి కమిషన్ ఒక కీలక ప్రశ్నను మన ముందుంచింది: ఒకే కేటగిరీలో ఉన్న ప్రతి వర్గానికి ఒకే కోటా ఇవ్వడం సమానత్వమా? లేక వాస్తవ అసమానతలను గుర్తించి, అవసరమైన చోట భిన్నమైన అవకాశాలు కల్పించడమే నిజమైన సమానత్వమా? కేంద్ర ప్రభుత్వం రోహిణి కమిషన్ నివేదికపై తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. నివేదికను ప్రజా చర్చకు అందుబాటులోకి తీసుకురావాలి. అవసరమైన గణాంకాలను పారదర్శకంగా వెల్లడించాలి.

రాష్ట్రాలు, ఒబిసి సంఘాలు, రాజ్యాంగ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. 2023లో నివేదిక సమర్పించబడింది. 2026 లో కూడా ప్రశ్న అలాగే ఉంది. ఒబిసిల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు నిజంగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నాయా? లేక రిజర్వేషన్ అనే తలుపు తెరిచి ఉన్నప్పటికీ, దాని తాళం కొద్దిమంది చేతుల్లోనే ఉందా? రిజర్వేషన్ ఉద్దేశం తలుపులు తెరవడం. ఆ తలుపులు అందరికీ సమానం గా తెరుచుకునేలా చేయడం – అదే రోహిణి కమిషన్‌కు అసలు అర్థం.

# కృష్ణావతరణం - ధర్మాచరణం

శ్రీకృష్ణుడు భువిపై అవతరించినట్లు విశ్వసించేవారు పుణ్యరోజును శ్రీకృష్ణ జన్మాష్టమిగా ప్రతియేటా జరుపుకుంటారు. నేటి ఉత్తరప్రదేశ్‌లోని మధురలో వసుదేవుడు, దేవకీల అష్టమ సంతానంగా భోజవంశ రాజు కంసుని కారాగృహంలో భగవానుని ఆవిర్భావం జరిగింది. కృష్ణ ఆవిర్భావానికి సంబంధించిన కథ శ్రీమద్ భాగవతంలో ఉంది. అలాగే ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులు శ్రీల ప్రభుపాదుల వారి దేవాది దేవుడు శ్రీకృష్ణ భగవానుడు అనే గ్రంథంలో కూడా సవివరంగా ఉంది. 2026 సెప్టెంబర్ 4 న శ్రీకృష్ణ జన్మాష్టమి. దేవకీ వసుదేవుల వివాహానంతరం కంసుడు తన సోదరి, బావను వెంట బెట్టుకుని స్వయంగా రథాన్ని నడుపుతూ ఆనందంతో ముందుకు వెళ్ళసాగారు. అంతలో ఆకాశం నుండి అశరీరవాణి కంసుని ఉద్దేశించి ఇలా వినిపించింది. త్వరలో నీ సోదరి కలిగే అష్టమ పుత్రుడు నిన్ను వధిస్తాడని పేర్కొంది. అ శరీరవాణి మాటలకు భీతిల్లిన కంసుడు సోదరి అనే విచక్షణ మరిచి దేవికిని చంపబోయాడు. అతని ప్రవర్తనకు విస్తుపోయిన వసుదేవుడు తన భార్య ప్రాణాలు కాపాడాలనే ఆలోచనతో తనకు పుట్టబోయే పుత్రులను నీకు ఇస్తానని వాగ్దానం చేస్తాడు. వసుదేవుని మాటలు నచ్చి కంసుడు దేవికిని చంపే ప్రయత్నం విరమించుకున్నాడు. ఇచ్చిన మాట ప్రకారం వసుదేవుడు తనకు కలిగిన మొదటి పుత్రున్ని కంసునికి ఇస్తాడు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ శిశువుతో నాకు ప్రమాదం లేదు కనుక ఇవ్వనవసరం లేదని కంసుడు ప్రకటిస్తాడు.

కృష్ణుని ఆవిర్భావాన్ని త్వరితం చేయాలనే సంకల్పంతో నారద ముని ఉంటారు. అందుకే, ఆ సమయం తగినదిగా భావించి, అక్కడ నారదముని ప్రత్యక్షమై దేవతలు వివిధ వంశాలలో జన్మతీసుకున్న ఉదంతాలను, కంసుని పూర్వ వృత్తాంతాలను వివరించడంతో కంసుడు భయంతో కంపించిపోతాడు. దేవతలు ఇదివరకే జన్మ తీసుకున్నారని, త్వరలోనే విష్ణువు అవతరిస్తాడని భావిస్తాడు. కఠిన నిర్ణయంతో దేవకీ, వసుదేవులను కారాగార గృహంలో బంధిస్తాడు. కారగార గృహంలో నున్న దేవకీ, వసుదేవులకు జన్మించిన ఆరుగురు పుత్రులను వరుసగా కంసుడు చంపాడు. ఈ దురాగతాలు తెలిసిన బంధువులు, మిత్రులు కంసుని వద్దకు వెళ్లి అన్యం పుణ్యం ఎరుగని శిశువులను చంపవద్దని వేడుకున్ననూ, ఆ శిశు హత్యలను నివారించలేకపోయారు. దేవకి ఏడవసారి గర్భం దాల్చగానే దేవాదిదేవుని ముఖ్య అంశ అయిన అనంతుడు దేవకి గర్భంలో ప్రవేశించాడు. యోగ మాయ భగవంతుని నిర్దేశం మేరకు దేవకి గర్భంలోని ఆదిశేషుడిని బృందావనంలోని యశోద నందుల ఇంట్లో నున్న వసుదేవుని మరో పత్ని రోహిణి గర్భంలోకి మార్చుతుంది. కాగా దేవకి సప్తమ గర్భం విచ్ఛిన్నం అయిందని ప్రజలు భావించారు. ఇక మిగిలింది భగవానుడి జన్మావతారం. సమస్త జగత్తు ఆశించిన ఆ శుభ గడియలు వచ్చాయి.


నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి

శంకు చక్ర గదా పద్మములతో చతుర్భుజములతో తేజోవంతం అయిన, అద్భుతమైన బాలుడిని వసుదేవుడు చూసాడు. ఆ బాలుడి అసాధారణ రూపం చూసి, అతడు విష్ణుభగవానుడని తెలుసుకుని వసుదేవుడు స్తుతించాడు, ప్రార్థించాడు. తర్వాత దేవకి కూడా కీర్తించింది. భగవానుడి దివ్యరూపం దర్శించిన వారి జన్మ ధన్యమైంది. శ్రీకృష్ణుడు కూడా వారి పూర్వ జన్మవృత్తాంతం తెలిపి తానేందుకు అవతారం తీసుకోవలసి వచ్చిందనేది తెలియజేశారు. అలాగే కంసుని బరినుండి వారిని విముక్తులను చేసేందుకు, తాను నిర్వర్తించాల్సిన కర్తవ్యాన్ని తెలిపి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. పిమ్మట భగవానుడు సాధారణ శిశువుగా మారిపోయారు. శ్రీకృష్ణుడి సూచనమేరకు వసుదేవుడు వెంటనే గోకులానికి ఆ శిశువును తీసుకునివెళ్ళి నంద మహారాజు ఇంట్లో అప్పుడే యశోదకు జన్మించిన పుత్రిక స్థానంలో ఉంచాడు. ఆ పుత్రికను తీసుకుని తిరిగి మధురకు వచ్చి దేవకి ఒడిలో ఆమె బిడ్డగా ఉంచాడు. అరుపులకు మెలకువ వచ్చిన సేవకులు కంసుడికి శిశువు జననం గురించి తెలియజేశారు. వెంటనే కారాగార గృహం చేరిన కంసుడితో జన్మించినది పుత్రిక అని, ఆ పుత్రిక వలన కంసుడికి ప్రమాదం లేదు కనుక చంప వలదని దేవకి వేడుకుంటుంది. అయిననూ కంసుడు నిర్దయగా ఆ ఆడ శిశువును రాతిపై విసిరి కొట్టడంతో ఆ బాలిక అతని నుండి చేజారి ఆకాశంలో ప్రత్యక్షమై అష్టభుజాలతో దుర్గాదేవిగా నిలిచి, దుర్మార్గుడా... నిన్ను చంపేవాడు ఇంతకుముందే వేరేచోట జన్మించాడని, అతని చేతిలో నీకు చావు తప్పదని హెచ్చరిస్తూ అంతర్ధానం అవుతుంది. దుర్గాదేవి పలుకులకు భయపడిన కంసుడు, దేవకి, వాసుదేవులను కారాగార బంధ విముక్తి చేశాడు. ఇక గోకులంలో నందుని ఇంట కొలహాలం నెలకొంది. యశోదకు పుత్రుడు కలిగాడనే సంతోషంతో గోపులు, గోపవనితలు నందుని ఇంటికి చేరుకొని అక్కడ జరిగిన కృష్ణ జననోత్సవంలో పాల్గొన్నారు. అలా శ్రీకృష్ణుడి అవతార జన్మ ఉద్భవం జరిగింది.

## ధర్మాచరణం

ధర్మ స్థాపన కొరకు దేవాది దేవుడి శ్రీకృష్ణ అవతారం చాలా ప్రముఖమైనది. క్రూరుడు అయిన కంసుడిని వధించి యదువంశాన్ని రక్షించారు. బాల్యలీలల ద్వారా పూతనను సంహారించారు. గోవర్ధనగిరి పర్వతాన్ని చిటికన వేలితో ఏడురోజులపాటు ఎత్తి యాదవులందరిని కాపాడారు. కాలియుడనే విష సర్పం గర్వాన్ని అణిచివేసి పడగలపై నృత్యం చేశారు. జరాసంధుడు, శిశుపాలుడు వంటి ఎందరో దానవులను మట్టుబెట్టారు. కుచేలుడు, కుంతి మహారాణి, ద్రౌపది వంటి వారెందరికో తన కృపను ఇచ్చారు. మహాభారత యుద్ధంలో పాండవులకు ఎల్లవేళలా రక్షణ ఇచ్చి చివరకు అర్జునుడికి రథ సారథి అయ్యాడు. యుద్ధభూమిలో కర్తవ్య నిర్వహణకు సందేహించిన అర్జునుడికి జీవితసత్యాలతో భగవద్గీత భోదించారు. ఈ గ్రంథం సర్వమానవాళికి గొప్ప మార్గదర్శం. గోపులు, గోపికలను ముఖ్యంగా రాధారాణి పైన అవ్యాజ్యమైన ప్రేమను ప్రకటించారు. జన్మాష్టమి రోజు కృష్ణుడి విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తారు, అటుకులు, వెన్న, మిఠాయిలు నైవేద్యంగా సమర్పిస్తారు. ఉట్టి కొట్టడం, సాంస్కృతిక ప్రదర్శనలు, కృష్ణ అలంకరణ వంటివి కన్నుల పండుగగా నిర్వహిస్తారు. ఇలా ఆయన జన్మదినం సర్వ మానవాళికి శుభం కలిగించే మహోత్సవంగా జరుపుతారు.

– డి. శ్రీనివాస్

# కమ్యూనిస్టుగా కొనసాగడానికి నన్ను ప్రేరేపించేది ఎవరు?



చాలామంది నన్ను అడుగుతుంటారు :
మీరు కమ్యూనిస్టు ఉద్యమం లోకి, సిపిఐలోకి రావడానికి మిమ్మల్ని ఎవరు ప్రేరేపించారు?
సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగిన సిపిఐ బహిరంగ సభలో నాకు ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది.
అక్కడ మహారాష్ట్రకు చెందిన 85 ఏళ్ల కామ్రేడ్ అమిర్ కె.ను కలిశాను. ఆయన 1960 నుంచి సిపిఐతో అనుబంధం కొనసాగిస్తున్నారు.
నేను ఆయనను అడిగాను
కామ్రేడ్ ఇంత వయసు వచ్చినా ఇంకా సిపిఐతోనే ఎందుకు ఉన్నారు?
ఈ సభ కోసం ఇంత దూరం ఎందుకు వచ్చారు?
ఆయన సమాధానం:
నేను ఒక పేద కార్మికుడిని, రాజకీయ కార్యకర్తను. మా గురించి మాట్లాడే పార్టీ సిపిఐ ఒక్కటే. ఇలాంటి సభకు వచ్చినప్పుడు నాకు కొత్త ఉత్సాహం వస్తుంది.
మళ్లీ నేను అడిగాను
మిమ్మల్ని ఎవరైనా తీసుకొచ్చారా? లేక మీరే స్వయంగా వచ్చారా?
ఆయన చెప్పిన సమాధానం మరింత స్ఫూర్తిదాయకంగా ఉంది
మేము పేద కార్మికులం. మా వల్ల అయ్యేది పార్టీకి విరాళంగా ఇస్తాం.
ఇక్కడికి కూడా నా సొంత డబ్బులతో నేనే వచ్చాను.
85 ఏళ్ల వయసులో మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి వచ్చారు.
పదవి కోసం కాదు... అధికారం కోసం కాదు...
స్వప్రయోజనం కోసం కాదు.
కార్మికులు, పేదల కోసం జరుగుతున్న పోరాటంపై ఉన్న నమ్మకంతో వచ్చారు.
ఇదే కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్న అసలైన బలం.
నన్ను సిపిఐలో కొనసాగడానికి ఎవరు ప్రేరేపిస్తున్నారు అని ఎవరైనా అడిగితే నా సమాధానం స్పష్టం:
అమిర్ కె.లాంటి కామ్రేడ్లే!
జీవితాంతం ఉద్యమానికి అంకితమైన కామ్రేడ్లు.
తమకు చేతనైనంత పార్టీకి అందించే కామ్రేడ్లు.
వయసు మీద పడినా పోరాటాన్ని కొనసాగించే కామ్రేడ్లు.
అధికారం, డబ్బు, ప్రచారం ఏదీ తమ నమ్మకాన్ని కదిలించలేని కామ్రేడ్లు.
వారి అంకితభావం మనకు స్ఫూర్తి.
వారి త్యాగం మన బలం.
వారి పోరాటం మన బాధ్యత.
కమ్యూనిస్టు ఉద్యమం కేవలం నాయకులతో నిర్మించబడలేదు.
న్యాయమైన, సమానత్వంతో కూడిన సమాజం కోసం తమ జీవితాలను అంకితం చేసిన వేలాది సాధారణ కార్మికులు, కార్యకర్తలు, కామ్రేడ్ల త్యాగాల మీద ఈ ఉద్యమం నిర్మించబడింది.
లాల్ సలామ్, కామ్రేడ్ అమిర్

– డా॥ కె.నారాయణ,
సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్

# డిఎస్‌పి భీమ్‌రెడ్డికి ఇడి షాక్!

**ఎసిబి కేసు ఆధారంగా ఆయన ఆస్తులపై ఇడి దృష్టి.. రూ.150 కోట్ల ఆస్తుల లెక్కలపై ఆరా?**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎసిబి కేసులో అరెస్టై ఇటీవలే బెయిల్‌పై విడుదలైన డిఎస్‌పి భీమ్‌రెడ్డికి మరో చిక్కు ఎదురైనట్లు సమాచారం. అవినీతి ఆరోపణల కేసులో ఎసిబి గుర్తించిన ఆస్తుల వివరాల ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా దర్యాప్తు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భీమ్‌రెడ్డి ఆస్తుల చిట్టా భారీగా ఉండటంతో దర్యాప్తు సంస్థల దృష్టి ఇప్పుడు ఆయన ఆస్తుల మూలాలు, ఆదాయ మార్గాలపై కేంద్రీకృతమైనట్లు సమాచారం. ఎసిబి దర్యాప్తులో గుర్తించిన ఆస్తులు, వాటి కొనుగోళ్లకు సంబంధించిన పత్రాలు, ఆస్తుల విలువ, ఆదాయ వనరులకు మధ్య ఉన్న వ్యత్యాసాలపై ఈడి అధికారులు ప్రాథమికంగా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా దాదాపు రూ.150 కోట్ల మేర డాక్యుమెంట్ విలువ కలిగిన ఆస్తులకు సంబంధించి సరైన ఆధారాలు, ఆదాయ వనరుల వివరాలు లేవన్న కోణంలో అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఎసిబి కేసులో వెలుగులోకి వచ్చిన ఆస్తుల వివరాలను ఈడి అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆస్తుల కొనుగోళ్లకు ఉపయోగించిన నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? వాటికి చట్టబద్ధమైన ఆదాయ వనరులు ఉన్నాయా? ఆస్తుల విలువకు, అధికారికంగా చూపిన ఆదాయానికి మధ్య ఎంత వ్యత్యాసం ఉంది? అనే అంశాలపై దర్యాప్తు సాగనున్నట్లు తెలుస్తోంది. ఎసిబి కేసులో అరెస్టైన భీమ్‌రెడ్డి నాలుగు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలైనట్లు సమాచారం.

అయితే అంతలోనే ఆయన ఆస్తుల వ్యవహారం ఈడి దృష్టికి వెళ్లడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎసిబి దర్యాప్తులో సేకరించిన పత్రాలు, ఆస్తుల వివరాలు, బ్యాంకు లావాదేవీలు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం ఈడి తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆస్తుల వ్యవహారంపై మరింత స్పష్టత కోసం భీమ్‌రెడ్డిని ఈడి అధికారులు త్వరలోనే విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రాష్ట్రంలో వారం రోజులు మోస్తరు వర్షాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశముందన్నారు. గురువారం, శుక్రవారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. సెప్టెంబర్ 4 నుంచి 10 వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. శుక్ర, శనివారాల్లో గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ ఏడు రోజుల కాలానికి సంబంధించి రాష్ట్రంలో ఎలాంటి వాతావరణ హెచ్చరికలు జారీ చేయలేదని స్పష్టం చేశారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ శాఖ
జిల్లా కలెక్టర్ కార్యాలయము
ఆదిలాబాద్

(ఫారం -సి)
(ప్రాథమిక నోటిఫికేషన్)
(చట్టములోని సెక్షన్ 11 అనుసరించి 10-A రూల్ మినహాఇంపు ఇవ్వ బడినది ( రూల్ 6/12 చూడుము))

కలెక్టర్ ఫైల్ నెం. జి1/664/2026 తేదీ: 29.08.2026
ఆర్డీఓ ఫైల్ నెం. B/927/2026 తేదీ: 29.08.2026
గజిట్ నంబర్ నెం. P.N U/S-11(1)/08-L/2026 తేదీ: 29.08.2026

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలము లోని పిప్పల్ కోటి గ్రామములోని మొత్తము విస్తీర్ణము **ఎ.2.19 గుంటలు** భూమి ప్రజా ప్రయోజనార్థం ఇంటర్ స్టేట్ లోయర్ పెన్ గంగా ప్రాజెక్టు పిప్పల్ కోటి బ్యాలన్సింగ్ (ప్రధాన / నీటి సరఫరా) కాలువ నిర్మాణము నిమిత్తం దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సెక్షన్ 6(2) క్రింద (చట్టం 30/2013)లో పేర్కొనిన ప్రకారం నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక అవసరం లేనందున అనుబందంలో పెర్కొనిన భూములకై నోటిఫికేషన్ జారీ చేయనైనది.

ఇట్టి ఇంటర్ స్టేట్ లోయర్ పెన్ గంగ ప్రాజెక్టు ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఎంఎస్ . నెం.58 ఐ.అండ్ సి ఎ డి (ఎల్.ఏ.ఆర్ & ఆర్ /ఏ2)ఇట్టి లోవర్ పెన్ గంగా ప్రాజెక్టునకు ప్రభుత్వం ఉత్తర్వుల శాఖ తేదీ:25.07.2017 ననుసరించి భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్ II మరియు -III పరిధి నుండి మినహాయింపు ఇవ్వ బడినది.

ఈ ప్రాజెక్టు కు సంబదించిన భూసేకర్ణ పనులను చేపట్టుటకు చట్టము లోని సెక్షన్ 43 నిభందనల ప్రకారము G.O. Ms. .No.139 Revenue (JA & LA) Dept Date: 20.08.2015 మరియు జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్ గారి ఉత్తర్వులు No.61/664/2026 తేదీ: 7.03.2026 ప్రకారము భూ సేకర్ణ అధికారి గా రాజస్వ మండల అధికారి ఆదిలాబాద్ గారిని, మరియు G.O.Ms No.6 అనుసరించి ప్రాజెక్టు పాలన అధికారి గా అదనపు కలెక్టరు (రెవెన్యూ) మరియు కలెక్టర్. ఆదిలాబాద్ గారి ఉత్తరువులు నెం 61/664/2026 తేదీ: 27.03.2026 ప్రకారము నియమించడము జరిగినది.

కావున ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలములోని పిప్పల్ కోటి గ్రామములోని మొత్తము విస్తీర్ణము **ఎ.2.19 గుంటలు** భూమి యొక్క వివరములు ఈ క్రింది చూపిన వానిని భూసేకరణ పనులు ప్రారంభ నిమిత్యం ప్రథమిక నోటిఫికేషన్ జారీచేయనైనది.

షెడ్యూలు
గ్రామము: పిప్పల్ కోటి మండలము: భీంపూర్ జిల్లా : ఆదిలాబాద్

| క్ర. సం. | సర్వే నెం. | బీట్ నెం. | సర్వే నెం. | పట్టా/ మెట్ట/ తరి | [illegible] | పట్టేదార్ పేరు | కాస్తుదారు / హక్కుదారు | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| పిప్పల్ కోటి గ్రామము - భీంపూర్ మండలము | | | | | | | | |
| 1 | 43 | 43/ఇ | 0.27 | పట్టా మెట్ట | 027 | గట్టు సంతోష్ తండ్రి కాశినాథ్ | స్వంతం | లేవు |
| 2 | 50 | 50 | 1.28 | పట్టా మెట్ట | 0.30 | ఉల్వాల పద్మ భర్త హన్మండ్లు | స్వంతం | లేవు |
| 3 | 50 | 50/అ/1/1/1 | | పట్టా మెట్ట | 0.38 | ఉల్వాల పద్మ భర్త హన్మండ్లు | బింగి వెంకన్న తండ్రి కిష్టన్న | లేవు |
| 4 | 51 | 51/ఆ | 0.04 | పట్టా మెట్ట | 0.04 | బింగి వెంకన్న తండ్రి కిష్టన్న | లేవు | లేవు |
| మొత్తం విస్తీర్ణం | | | 2.19 | | 2.19 | | | |

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరింపబడిన భూములకు సంబందించిన ఎవరూ ఎటువంటి లావాదేవీలు / తకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూమి యొక్క ప్లాన్, ఏదైన పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టరు, ఆదిలాబాద్, రాజస్వమండల అధికారి, ఆదిలాబాద్ గారి కార్యాలయములలో తనిఖీ చేసుకోవచ్చును. తదుపరి తెలంగాణా ప్రభుత్వం /కలెక్టర్ మరియు సంబంధిత ప్రభుత్వం ఎంత భూమిని స్వాదినము చేసుకోవాలో నిర్ణయించుకొనే క్రమములో సెక్షన్ 12 ప్రకారం అధికారులు, ఉద్యోగులు వారి వద్ద పని చేసే కార్మికులకు పైన చూపిన భూములలో గల ఏదైన ప్రదేశంలోకి ప్రవేశించి, సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూస్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ (15) ప్రకారం,ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపిన భూములలో ఎలాంటి సంబం-దమున్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యతరములున్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60-అరవై రోజులు) దినములలోపు భూసేకరణ అదికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

భూ యజమానులు, ఆసక్తి గల వ్యక్తులు వారి నష్టపరిహారాన్ని సంప్రదింపుల ద్వారా పరిష్కారం చేయదలుచుకుంటే వారు తమ అభ్యంతరములను ఫారం E-1 & G-I, G-III, ద్వారా నోటిఫికేషన్ వెలువడిన తదుపరి G.O.Ms.No. 120 Revenue (JA&LA) Dept Date: 30.06.2017 అనుసరించి సమర్పించవచ్చును.

సం/- రాజస్వ మండలాధికారి మరియు భూ సేకరణ అధికారి ఆదిలాబాద్
సం/- అదనపు కలెక్టర్ ఆదిలాబాద్
సం/- జిల్లా కలెక్టర్ ఆదిలాబాద్
DIPR RO NO. 811/LA/PP/Advt/Pub/2026-27


# తెలంగాణ బిజెపి నేతలు మోదీని నిలదీయాలి

రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై కేంద్రాన్ని ప్రశ్నించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ బిజెపి నేతలు తమ పార్టీలోని అంతర్గత పోరులో ఉనికి కాపాడుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. నిజంగా తెలంగాణ ప్రయోజనాలపై చిత్తశుద్ధి ఉంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం మానేసి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని నిలదీయాలని ఆయన సూచించారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులు, అనుమతులపై బిజెపి నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తరహాలో తెలంగాణకు ఎందుకు న్యాయం జరగడం లేదో వారు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో పెద్ద మొత్తంలో ఆదాయం కేంద్రానికి వెళ్తున్నప్పటికీ, తిరిగి రావాల్సిన నిధుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. మెట్రో, నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్రం వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం బకాయిలు పెట్టినప్పుడు బిజెపి నేతలు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ''రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాదు.. తెలంగాణ కోసం ఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని ప్రశ్నించండి. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై ప్రధాని మోదీ నుంచి స్పష్టమైన హామీ తీసుకు రండి'' అని బిజెపి నేతలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు.

### హుస్నాబాద్ రోడ్ల పనులు వేగవంతం చేయాలి మంత్రి కోమటిరెడ్డిని కోరిన పొన్నం

హుస్నాబాద్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్‌బి రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ మేరకు సచివాలయంలో ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఆయన సమావేశమై పలు అంశాలపై చర్చించారు. సిద్దిపేట ఎల్కతుర్తి జాతీ య రహదారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న కల్వర్టుల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు మిట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనులను వేగవంతం చేయాలని కోరారు. అలాగే కరీంనగర్ ఎల్కతుర్తి, ఎల్కతుర్తి హనుమకొండ రహదారుల పనులను త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్కతుర్తి జంక్షన్ వద్ద బాటిల్‌నెక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి కోరారు. కరీంనగర్, హనుమకొండ, సిద్దిపేట వైపు వెళ్లే రహదారులు కలిసే ఈ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. జంక్షన్‌ను విస్తరించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రతిపాదించిన పలు ఆర్‌అండ్‌బి రోడ్లకు మంజూర్లు ఇవ్వడంతో పాటు, ఇప్పటికే మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని పొన్నం ప్రభాకర్ కోరారు. రహదారి మౌలిక వసతులు మెరుగుపడితే ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీని దళిత వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు బిజెపి కుట్ర

టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని బిజెపి దళిత వ్యతిరేకిగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తోందని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జయప్రకాశ్‌రెడ్డి ( జగ్గారెడ్డి ) ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌లో జరిగిన ఓ సభలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న అనంతరం సభా ప్రాంగణాన్ని బిజెపి అనుబంధ నాయకులు శుభ్రం చేయడంపై రాహుల్‌గాంధీ ప్రశ్నించారని తెలిపారు. ఖర్గే రాజ్యసభలో ప్రతిపక్ష నేతతో పాటు దళిత నాయకుడని, ఆయనను అవమానించడం సరికాదని జగ్గారెడ్డి అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బిజెపి, దాని అనుబంధ సంస్థలు జాగ్రత్తగా వ్యవహరించాలని రాహుల్‌గాంధీ సూచించారని పేర్కొన్నారు. అయితే రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను బిజెపి కావాలనే వక్రీకరించి ప్రచారం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాహుల్‌గాంధీ నాయకత్వం వహిస్తున్నప్పటికీ ఆయనలో ఎలాంటి అహంకారం లేదని జగ్గారెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీ కుటుంబానికి ఎస్‌సి,ఎస్‌టి,అనే వివక్ష భావన లేదని పేర్కొన్నారు. ఖర్గేతో కలిసి నడవాల్సిన సందర్భంలో రాహుల్‌గాంధీ ఆయన చేయి పట్టుకుని నడుస్తారని చెప్పారు.బిజెపి గాడ్సే సిద్ధాంతాలను అనుసరిస్తోందని జగ్గారెడ్డి విమర్శించారు. బిజెపి జాతీయ అధ్యక్షుడిగా బంగారు లక్ష్మణ్‌ను నియమించినప్పటికీ, అనంతరం ఆయనను పదవి నుంచి ఎలా దించాలనే ఆలోచనతో వ్యవహరించారని ఆరోపించారు. ఇలాంటి రాజకీయ ధోరణి కాంగ్రెస్‌లో లేదని స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ సామాజిక సమానత్వానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు.



# శాసనసభ సమావేశాలకు అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్ జాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ సమావేశాలకు అన్ని శాఖలు ముందస్తు సమాచారంతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఈ నెల 7న ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల నేపథ్యంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు తగిన సమాధానాలను త్వరితగతిన అందించేందుకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అసెంబ్లీ సమేశాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సంజయ్‌జాజు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖ తరపున అసెంబ్లీలో ఒక నోడల్ అధికారిని నియమించి, సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలను రాసిఇవ్వడంతో పాటు, సమాచార సేకరణ, సమన్వయం తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, విభాగాధిపతులు అవసరమైన సమాచారంతో ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, శాసనసభలో ఏదైనా ప్రశ్నకు సంబంధించి అ దనపు సమాచారం అవసరమైన సందర్భంలో వెంటనే సంబంధిత శాఖల నుంచి వివరాలను సేకరించి, నిర్ణీత సమయంలో సమాధానం అందించే లా సమన్వయ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నోత్తరాలకు సంబంధించిన సమాచారాన్నిఅసెంబ్లీ అధికారులకు వెంటనే అందజేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, బిఎండి ఎక్కా, వాణి ప్రసాద్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగి తా రాణా తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ హయాంలో రైతు వినాశనం.. కాంగ్రెస్ పాలనలో రైతు వికాసం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రైతుల బతుకు వినాశనం కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో రైతుల జీవితాలు వికాసంతో నిండాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. అసలు బిఆర్‌ఎస్‌కు రైతులకు గురించే మాట్లాడే నైతిక హక్కు లేనే లేదని ఆయన స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ చార్జ్‌షీట్ వేయడం కాదని, ముందుగా వారి 10 ఏళ్ల పాలనపై ప్రజల చార్జ్‌షీట్‌కు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. రుణమాఫీ, రైతుభరోసా, పంటల కొనుగోళ్లు, పంట నష్టపరిహారం వంటి ప్రతి అంశంలో తమ ప్రభుత్వం ముందంజలో ఉందని తుమ్మల పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో వరి ఉత్పత్తితో పాటు సాగు విస్తీర్ణం కూడా పెరిగిందన్నారు. కేంద్రం పంటలు కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లను ఆపలేదని, సుమారు రూ.6 వేల కోట్లతో మొక్కజొన్న, రూ.2 వేల కోట్లతో జొన్నలు కొనుగోలు చేసినట్లు తెలిపారు.రైతులకు ఎరువుల సరఫరాను పారదర్శకంగా నిర్వహించేందుకు రూపొందించిన తెలంగాణ యూరియా యాప్ దేశానికే మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి అన్నారు. తెలంగాణ యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్రం ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌ను రూపొందించిందని పేర్కొన్నారు. రుణమాఫీపై బిఆర్‌ఎస్ చేస్తున్న ఆరోపణలకు ఇప్పటికే గణాంకాలతో సమాధానం ఇచ్చామని తుమ్మల తెలిపారు. బ్యాంకులు అందించిన సమాచారాన్ని ఆధారంగానే రుణమాఫీ అమలు చేశామని స్పష్టం చేశారు. దేశంలో రైతుల పంట రుణాలు తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందుందని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం వెల్లడించిన విషయాన్ని బిఆర్‌ఎస్ నేతలు గుర్తుంచుకోవాలని అన్నారు.


**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 9154172331
NIT No. 48/SE/SLPZ/CMC/2026-27 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేదీ: 03.09.2026
**NIT No.** 48/SE/SLPZ/CMC/2026-27, తేదీ: 03.09.2026, **పని పేరు:** సిఎంసి, ఎస్‌ఎల్‌పిజెడ్, శేరిలింగంపల్లి సర్కిల్-49లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ (జి+1) నిర్మాణం, **అంచనా విలువ / ఇసివి:** రూ.250.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ:** 05.09.2026 మ.1.00గం.ల నుండి 19.09.2026 మ.1.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. **సెల్ నెం.** 7331186858.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి
DIPR R.O. No. : 9232-PP/CL/ADVT/2026-27, Date: 03-09-2026

**వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయము,**
కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.
బహిరంగ వేలం ప్రకటన
లేఖ.నెం.వ్య.మా.క/కొత్తగూడెం/షాపులు/06/2026-27/166 తేదీ: 03.09.2026
వ్యవసాయ మార్కెట్ కమిటి, కొత్తగూడెం కార్యాలయం ముందు భాగమున నిర్మించిన వాటిలో గల (ఆరు) దుకాణములు అనగా **(షాప్ నెం. 03, 05, 23, 24, 28, 36)** నెలసరి అద్దె పై వాణిజ్యపరంగా కేటాయించుటకు శ్రీయుత ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, వరంగల్ గారి సమక్షంలో
- **తేది: 11.09.2026 న ఉ.11.00 గం.లకు** బహిరంగవేలము నిర్వహించబడును.
- 1/70 పిసా చట్టం ప్రకారం షాపుల కేటాయింపు యస్.టి. ధృవీకరణ పత్రం పొందిన వారు మాత్రమే పాల్గొనగలరు. ఆసక్తి గలవారు దరకాస్తు ఫారం పొందుటకు **తేది: 04.09.2026 ఉ.10.30 గం.లకు** నుండి **07.09.2026 సోమవారం సా.5.00 గం.లకు** వరకు వ్యవసాయ మార్కెట్ కమిటి, కార్యాలయము, కొత్తగూడెం నందు పొందగలరు.
- ఒరిజినల్ యస్.టి కుల ధృవీకరణ పత్రమును, (3) పాస్పోర్ట్ సైజు ఫోటోలు మరియు ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డును చూపి కార్యాలయము పని చేయు వేళలో **రూ.1000/-** నగదు చెల్లించి దరకాస్తు ఫారం పొందగలరు.
- దరకాస్తు ఫారం స్వీకరించుటకు **తేది: 07.09.2026 నుండి 10.09.2026 సాయంత్రం 05.00 గం.ల** వరకు ధరావతు సొమ్ము (Deposit), **రూ.50,000/-** (Secretary Agril. Market Committee, Kothagudem) గారి పేరున డి.డి.తో పాటు స్వీకరించబడును.

సం/- కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటి, కొత్తగూడెం
సం/- చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటి, కొత్తగూడెం.
DIPR R.O. No. : 9211-PP/CL/ADVT/2026-27, Date: 03-09-2026

## కెసిఆర్ అసెంబ్లీకి రావాలని కాంగ్రెస్ ర్యాలీ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ప్రతిపక్షనేత కెసిఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సైనిక్‌పురి జ్యోతిరావు పూలే జంక్షన్ నుండి ఇసిఐఎల్ చౌరస్తాలో అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బాధ్యతను విస్మరించిన కెసిఆర్ రాజీనామా చేయాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి పిలుపు మేర కు మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ పర్యవేక్షణలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త అంజిరెడ్డి, తన్నీర్ శ్రీహరి, కెశెట్టి ప్రసాద్, మురళీ, పాకాల రాజు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ పూర్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.





## యూటర్న్ ఓపెన్ చేయాలని వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** యూటర్న్‌ను తిరిగి ఓపెన్ చేయాలని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ డిసిపికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. డిసిపి రాహుల్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి నాగారం డివిజన్ పరిధిలోని సెరినిటీ స్కూల్ వద్ద మూసివేసిన యూటర్న్‌ను తిరిగి ఓపెన్ చేయాలని నాగారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, యువ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. డిసిపి సానుకూలంగా స్పందిస్తూ యూటర్న్‌ను స్వయంగా వచ్చి పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెరినిటీ స్కూల్ కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, ఘనపురం కొండల్‌రెడ్డి, గూడురు కృష్ణ గౌడ్, చిన్న, రాంరెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షిత్‌రెడ్డి తల్లిపై దాడికి ఖండన

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేసిన దాడిని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగం శ్రీదేవిని వారు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ శ్రీదేవి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి ఆమె త్వరగా కోలుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అనంతరం నాగం వర్షిత్‌రెడ్డిని కలిసి దాడికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలని, కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలకు చోటు లేదని పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులతో బిజెపి నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే కాంగ్రెస్‌కు తగిన సమాధానం చెబుతామని అన్నారు. వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ నాగం వర్షిత్ రెడ్డి కుటుంబంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో వ్యక్తిగత దాడులకు తావు ఉండకూడదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని అన్నారు.





## కాంగ్రెస్ హామీలు బూటకం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** వంద రోజుల్లో 420 హామీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజులు దాటినా హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మండిపడ్డారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.4వేల పింఛన్, ఒంటరి మహిళకు రూ.2,500, ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు, తులం బంగారం వంటి హామీలు విస్మయ్యారని ప్రశ్నించారు. బోయిన్‌పల్లి అభివృద్ధికి తమ హయాంలో రూ.150కోట్లు, తాగునీటి వ్యవస్థకు రూ.100 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 44లక్షలతో అంబులెన్సులు సమకూర్చిన తన ఫోటోలను తొలగించడం కాంగ్రెస్ చిల్లర రాజకీయాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. బోయిన్‌పల్లి మెజార్టీ స్థలాలను 22ఏ పరిధిలోకి తెచ్చి స్థానిక ప్రజలను, పేదలను కబ్జాదారులుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్, హరినాథ్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ చర్చకు వచ్చే దమ్ముందా?

### డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సవాల్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై తప్పుడు ప్రచారాలు కాకుండా బహిరంగ చర్చకు వచ్చే దమ్ముందా అంటూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సవాల్ చేశారు. గత పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ పార్టీ కుటుంబ పాలన, గడీల పాలన, ప్రజా వంచన తప్ప ఏ ఒక్క అభివృద్ధి అయినా ప్రజారంజకంగా జరిగిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విజయోత్సవం సందర్భంగా బోడుప్పల్ సర్కిల్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన భారీ బైక్ ర్యాలీలో మాజీ మేయర్ అజయ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ గత పదేళ్ల ప్రజావ్యతిరేక పాలనలో బిఆర్ఎస్ కుమారుడు, కూతురు, అల్లుడితో పాటు కుటుంబ సభ్యులకే పదవులను కట్టబెట్టి నిలువునా దోచుకున్నారన్నారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చేస్తున్న విమర్శలపై ఆయన మాట్లాడుతూ జోకర్‌లాగా డాన్స్‌లు చేయటం కాదని, ప్రజల ముందు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చర్చల ద్వారా ముందుంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, బొమ్మకు కళ్యాణ్, తంగెళ్ళపల్లి రవి, బండి శ్రీరాములు, దిలీప్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కరంకుమార్ రెడ్డి, చందర్‌గౌడ్, సుమన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా 'సర్ హియరింగ్' ప్రక్రియ

### రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఖచ్చితమైన ఓటరును గుర్తించేందుకు నిర్ధారించే ప్రక్రియను వేగవంతంగా నిర్దిష్ట గడువులోగా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవిఎం), ఓటర్ వెరిఫయిబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిపాట్)లు భద్రపరచిన గోదామును అదనపు ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, వివిధ రాజకీయ ప్రతినిధులతో కల్సి గురువారం తనిఖీ చేసారు.అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నోటీసుల ప్రక్రియలో భాగంగా నర్సంపల్లి, కీసర, మేడ్చల్, మునిరాబాద్, దొమ్మర పోచంపల్లి, దుండిగల్ ప్రాంతాల్లో హియరింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటును నిర్ధారించే ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం,రికార్డుల పరిశీలనలను ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బిఎల్ఓలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో మ్యాపింగ్ జరుగకుండా ఉన్న ఓటర్లు, ఓటర్ కార్డులో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించి రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను సరిగా చూడాలన్నారు. హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను సమగ్రంగా ధృవీకరించిన మేరకే తదుపరి చర్య లు చేపట్టాలన్నారు. అర్హత కల్గిన ఓట ర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రోజువారీ లక్ష్యాలు చేరుకోవటంలో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.

## వినాయక ఉత్సవాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

### అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వినాయక మండప నిర్వాహకులు ఉత్సవాలు ప్రారంభమైన నాటినుండి నిమజ్జనాలు పూర్తయ్యే వరకు భక్తి శ్రద్ధలతో సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా ప్రమాణాలు పాటించాల్సి ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా డిసిపిలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 వినయకచవితి పండుగ రోజున ఉత్సవాలు ప్రారంభమై 25న నిమజ్జనంతో పూర్తవుతాయని, ఈ విషయంలో నిర్వాహకులు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలన్నారు. తమ మండపాల వద్ద సిసిటివి కెమెరాలు, బ్యారికేడ్లు, పార్కింగ్ సదుపాయం, మౌలిక సదుపాయాలు, వాలంటీర్లు, ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవటం, తదితర విషయాల్లో అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేసుకొంటూ ముందుగా పోలీసు విభాగంతో అనుమతులు తీసుకొని సంబంధిత అధికార్లతో సమన్వయం పాటిస్తూ ప్రశాంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. రహదార్ల మరమ్మత్తులు, విద్యుత్, వైద్య, పారిశుద్ధ్య, తదితర పనుల్లో ఆయా ప్రభుత్వ విభాగ అధికారులు తమకు సంబంధించిన పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం కనపరచకుండా చూడాలని ఆదేశించారు. నిమజ్జనాలు జరిగే చెరువుల వద్ద గజ ఈతగాళ్లు, క్రేన్లు, అంబులెన్సులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మండపాల ప్రాంతాలతో నిమజ్జనం జరిగే మార్గాల్లో అవసరమైన భద్రత విషయంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. భాగ్యనగర్ గణేష్ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ కోరిన విధంగా క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆరు గ్యారంటీలు, 420 హామీలతో మోసం

**ప్రజాపక్షం/కీసర :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని మేడ్చల్ శాసనసభ్యులు, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తీవ్రస్థాయి లో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనా వైఫల్యాల ను నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి డౌన్ డౌన్, వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నాను ఉద్దేశించి మల్లారెడ్డి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందంజలో నిలిపి ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది. **హామీల అమలులో వైఫల్యం:** ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయలేకపోయింది. **ఢిల్లీ పర్యటనలు 22ఏ అంశం :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు 77 సార్లు ఢిల్లీ పర్యటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. అలాగే 22ఏ నిబంధనల పేరుతో రాష్ట్రంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేష్, మాజీ ఛైర్‌పర్సన్ ప్రణిత శ్రీకాంత్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సాయినాథ్, ప్రభాకర్ రెడ్డిలతో పాటు మండలం, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కెపిఆర్ఐటిలో ఐఇటిఇ జోష్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పరిశోధన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఐఇటిఇ న్యూఢిల్లీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ ఎ. సర్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని వేదికను ప్రారంభించారు. ఐఇటిఇ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ బి. బ్రహ్మారెడ్డి, గౌరవ కార్యదర్శి డాక్టర్ కెవిఎన్ఎస్‌విపిఎల్ నరసింహం పాల్గొన్నారు. విద్యార్థులు నూతన సాంకేతికతలు, పరిశోధన ప్రాజెక్టులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. వేదిక ద్వారా సాంకేతిక సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు, నిపుణుల ప్రసంగాలు ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశాలు అభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యూహాత్మక వ్యవహారాల సంచాలకురాలు కొమ్మూరి దివ్యశ్రీ, ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సి.డి నాయుడు, సంచాలకులు ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శ్రీనాథ్ కశ్యప్, ఉప ప్రిన్సిపాల్ వై విశ్వశ్రీ విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అవినీతి పాలనపై కదంతొక్కిన గులాబీ సైన్యం




**ప్రజాపక్షం/దుండిగల్:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపుమేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గార్ల ఆధ్వర్యంలో ఈనెల 7 రోజుల పాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి రెవెన్యూ కార్యాలయాల వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ అవినీతిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయాలకతీతంగా, పార్టీల కతీతంగా, నిష్పక్షపాతంగా అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించిన ఘనత కెసిఆర్ ఆధ్వర్యంలోని బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. పెండింగ్ లో ఉన్న జీవో 59 దరఖాస్తులను వెంటనే పూర్తిచేసి పేద ప్రజల ఇళ్లను క్రమబద్ధీకరించాలి. క్రింద అర్హులకు ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పి దరఖాస్తుదారుడు నుంచి పదివేల రూపాయలు కట్టించుకు న్న ప్రభుత్వం, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం కుత్బుల్లాపూర్‌లో ఎక్కడ ప్రభుత్వ భూమి కేటాయించారు, ఏ విధమైన నిర్మాణాలు చేపడుతున్నారు, ఎప్పటిలోగా ఇండ్ల నిర్మాణం చేపట్టి పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తారనే దానిపై దరఖాస్తుదారులకు, నిరుపేదలకు స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## హామీల అమలుకు ధర్నా

**ప్రజాపక్షం/నిజాంపేట్:** బాచుపల్లి మండల కార్యాలయం వద్ద గురువా రం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం తమ డిమాండ్లపై ఎంఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ 420 హామీల మోసాన్ని ప్రశ్నిద్దాం. 1000 రోజుల దగా పాలనను నిలదీద్దాం అంటూ బిఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు. కెటిఆర్, ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కక్షిదారులందరూ తమ తమ కేసుల పరిష్కారం కోసం జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జిఎస్ఎల్ ప్రియాంక అన్నారు. గురువారం కుషాయిగూడ జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి, ఆదేశానుసారం ప్రియాంక ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి 12వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా ఆమోదయోగ్యమైన క్రిమినల్, సివిల్, పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులు రాజీపడుటకు ఈ జాతీయ లోక్‌అదాలత్ గొప్ప అవకాశమని, రాజీ పడదగిన కేసులు సులభంగా, వేగంగా పరిష్కరించుకోవాలని ఆమె తెలిపారు.

**డాష్ బోర్డు పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి**

హైకోర్టు న్యాయమూర్తి శ్యామ్‌కోషి సెప్టెంబర్ 02 బుధవారం డాష్‌బోర్డు పోర్టల్‌ను ప్రారంభించారు. యాక్సిడెంట్ ప్రమాదాలలో పరిహారం కోసం, వర్క్‌మెన్ కంపెన్సేషన్ బాధితులు, వారి కుటుంబ సభ్యుల కోసం వారి కేసు వివరాలు తెలుసుకోవడానికి ఈ పోర్టల్‌ను ప్రారంభించారని, బాధితులు, కుటుంబ సభ్యులు న్యాయవాదులు నేరుగా ఆన్‌లైన్‌లో వివరాలు తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జిఎస్ఎల్ ప్రియాంక తెలిపారు.

## శిశు మందిర్‌లో శ్రీకృష్ణాష్టమివేడుకలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడ శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో మన దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేల శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు చూడముచ్చటైన చిన్ని కృష్ణుడు, గోపిక వేషధారణ పాల్గొని గోపికాలోలుడు శ్రీకృష్ణుడికి ఇష్టమైన ఉట్టి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధిక, ఆచార్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు

### పెట్రోల్ మొబైల్స్ సిబ్బందికి ట్రాఫిక్ డిసిపి రాహుల్‌రెడ్డి సూచన

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఒఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని మొబైల్ పెట్రోలింగ్ సిబ్బందికి మల్కాజ్‌గిరి ట్రాఫిక్ 1 డిసిపి రాహుల్ రెడ్డి సూచించారు. గురువారం శామీర్‌పేట ఒఆర్ఆర్‌పై రహదారి భద్రత, అత్యవసర ప్రతిస్పందనను బలోపేతం చేయడంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒఆర్ఆర్‌పై సురక్షితమైన, నిరంతరాయమైన ట్రాఫిక్ కదలికలను నిర్ధారించడానికి వారి విధులు, బాధ్యతలను వివరించారు. ఒఆర్ఆర్‌లో తమకు కేటాయించిన మార్గాలలో నిరంతరం గస్తీ కాస్తూ తమ ఉనికిని స్పష్టంగా కనబడేలా చూసుకోవాలని చెప్పారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులలో ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్దేశించిన విధానం ప్రకారం తగిన ప్రదేశాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. ఒఆర్ఆర్‌పై విధులు నిర్వహించే సమయాల్లో ముఖ్యంగా రాత్రి వేళల్లో రిఫ్లెక్టివ్ జాకెట్లు ధరించి ఎల్ఇడి లాఠీలను వెంట ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు, అల్వాల్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ట్రాఫిక్ అడ్మినిస్ట్రేషన్ ఇన్స్‌పెక్టర్ రాజు, రోడ్డు సెఫ్టీ వింగ్ ఇన్స్‌పెక్టర్ ప్రదీప్‌గౌడ్, ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్వజిత్‌సింగ్, (కిట్టు), సిబ్బంది పాల్గొన్నారు.



## కబడ్డి పోటీల్లో జగ్గంగూడ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని విజేత టెక్నో స్కూల్లో నిర్వహిస్తున్న ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీల్లో కబడ్డిలో తెలంగాణ గురుకుల మైనార్టి రెసిడెన్షియల్ మేడ్చల్ బాలుర 1 జగ్గంగూడ విద్యార్థులు సత్తా చాటారు. అండర్ 17 కబడ్డి విభాగంలో టిజిఎంఆర్ఎస్ మేడ్చల్ బాలుర 1 జట్టు విజేతగా నిలిచి అద్భుత విజయాన్ని సాధించారని ప్రిన్సిపల్ కృష్ణ గురువారం తెలిపారు. విద్యార్థులు సమన్వయంతో, క్రమశిక్షణతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించారని అభినందించారు. విద్యార్థుల ఫిజికల్ డైరక్టర్ సురేందర్, పిఇటి వెంకటేష్‌ల ఆధ్వర్యంలో కబడ్డిలో శిక్షణ అందించారని వారి మార్గదర్శకత్వంలో విద్యార్థులు కబడ్డి పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి జోనల్ స్థాయిలో విజయం సాధించారని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రేషన్ కార్డుల్లో మోదీ ఫొటో ముద్రించాలి

**ప్రజాపక్షం/పరిగి :** పేదల సంక్షేమాన్ని విస్మరించి, కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని సైతం తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై భారతీ జనతాపార్టీ పరిగి పట్టణ, మండల శాఖ తీవ్రస్థాయిలో మండిపడింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోది ఫోటోను చేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం పరిగి డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడూతూ దేశంలోని పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా కిలోల కొద్దీ బియ్యాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తుంటే, క్షేత్రస్థాయిలో ఆ వాస్తవాలను కప్పిపుచ్చి కేవలం తమ నాయకుల ఫోటోలతోనే కాలం వెళ్లదీయడం దారుణమని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న స్మార్ట్ కార్డుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫోటోలు మాత్రమే ముద్రించడం సరైనది కాదన్నారు. కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యం పథకానికి పిఎంజికేఏవై తగిన గుర్తింపు ఇవ్వకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు అనసూయ, హరికృష్ణ యాదవ్, నరసింహ, కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి ముఖ్య నాయకుల సమావేశం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం గురువారం గాయత్రి నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్ హాజరై ఎస్ఐఆర్2లో మొదటి విడతలో సరైన ధృవపత్రాలు సమర్పించని ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం నోటీస్‌లకు మరో అవకాశం కల్పిస్తూ ఓటర్లు సరైన ధృవ పత్రాలు బిఎల్‌ఓలకు అందించడానికి నాయకులు ఇంటింటికి తిరిగి ఓటర్లకు సరైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు సమర్పించాల్సిన డాక్యుమెంట్లను వారికి తెలియజేసి వారి ఓటును తీసివేయకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గొట్టుముక్కల జస్వత్‌రావు, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు కావేటి నాగార్జున ప్రశాంత్ నగర్ డివిజన్ అధ్యక్షులు చందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.




## ఉరేసుకుని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/బొంరాస్‌పేట్:** కొడంగల్ నియోజకరవ్గంలోని బోంరాస్‌పేట్ మండల పరిధిలోని వడిచర్ల గ్రామ శివారులో గొల్ల కిష్టప్పకు చెందిన పొలం లో పాడుపడిన పశువుల కొట్టంలో నాగభుషణం చీరతో ఉరివేసికుని మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరల ప్రకారం వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ మండల పరిధిలోని నాగసమందర్ గ్రామానికి చెందిన నాగభూషణం 15సంవత్సరాల క్రితం బొంరాస్‌పేట్ మండల వడిచర్ల గ్రామానికి చెందిన లలితతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు జరుగుతుండగా రెండు నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. భర్త తీసుకురావడానికి వెళ్లినప్పుడు మళ్లీ గొడవ జరిగి ఉరి వేసుకొని మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రజాప్రభుత్వంలో పేదలకు ప్రాధాన్యం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజా ప్రభుత్వంలో పేదలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు మాజీ కార్పొరేటర్, జిహెచ్ఎంసి ఫ్లోర్ లీడర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎల్‌బి నగర్ చౌరస్తాలో ప్రజా ప్రభుత్వం వేయి రోజుల సందర్భంగా కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్, శ్రీనాథ్, కొండోజు శ్రీనివాస్, పోచ నబోయిన సురేష్ యాదవ్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తాం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన పేదలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ అశోక్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నాగయ్య, సింగిల్ విండో చైర్మెన్ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్ సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ పాల్గొన్నారు.

**కొందుర్గు:** మండల కేంద్రంలోని రైతు వేదికలో డిజిటల్ స్మార్ట్ రేషర్ కార్డులను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందుర్గు మండలానికి 8654రేషన్ కార్డులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, తహసీల్దార్ అజమలి, ఎంపిడిఓ శ్రీరాములు, సర్పంచులు కమ్మదనం జ్యోతి, జర్పుల గోపాల్‌నాయక్, రాజ్‌కుమార్, శ్వేతా, నేతలు గోవర్ధన్ గౌడ్, మల్లేష్ గౌడ్, రామయ్య గౌడ్, నరేందర్, జిబి కృష్ణ, మీరపురం వెంకటయ్య, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ప్రజల సొమ్మును దోచుకున్న బిఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:**తెలంగాణ ప్రజల సొమ్మును బిఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లు అందినకాడికి దోచుకున్నారని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. గురువారం పట్టణంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ వెయ్యి రోజుల పరిపాలనలో అనేక మార్పులు తీసుకురావడమే కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖార్, మాజీ జడ్పిటిసిలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, నేతలు శివశంకర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, అంబటి ప్రభాకర్, చందునాయక్, కత్తి చంద్రశేఖర్ అప్ప, చందులాల్, శ్రీధర్ పాల్గొన్నారు

## విద్యార్థి అశ్విని మృతిపై దర్యాప్తు

ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థి అశ్విని మృతిపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలను ఎఐఎస్‌ఎఫ్, ఎబివిపి, ఎస్‌ఎఫ్‌ఐ,బిఆర్‌ఎస్, జనసేన సంఘాల నేతలు ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంబల్ నాయక్ మాట్లాడుతూ అశ్విని మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, భోదన సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్ పాత్రలపై పోలీసులు దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వాలీయా నాయక్, విద్యార్థి సంఘాల నేతలు పుట్నాల సాయికుమార్, వడ్ల శ్రీకాంత్, యువసత్తా లక్ష్మణ్‌కుమార్, రాజునాయక్ ఉన్నారు.

## నిషేధిత భూముల జాబితా పేరుతో పేదల భూములు లాక్కోవద్దు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** 22ఎ నిబంధనల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల భూములను లాక్కోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. గురువారం బి.ఎన్.రెడ్డి డివిజన్‌లోని 22ఎ రిజిస్ట్రేషన్ల నిషేధిత భూముల జాబితాల విషయంలో కాలనీవాసులతో కలిసి మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఎంపికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీ రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో సామాన్య ప్రజలు, రైతులు తమ హక్కులను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు.

# గణేశ్ నిమజ్జనానికి హైడ్రా సన్నాహాలు

### విధుల్లో 51 డిఆర్‌ఎఫ్ బృందాలు

### 394 మంది గజ ఈతగాళ్లు సిద్ధం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు హైడ్రా విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. ఇప్పటికే వివిధ శాఖలతో కలిసి గణపతి విగ్రహాలు సులభంగా నిమజ్జన మండపాలకు చేరేందుకు వీలుగా అన్ని మార్గాల్లో చెట్ల కొమ్మలను తొలగించే పనులను హైడ్రా చేపట్టింది. ఈ నెల 25, 26 తేదీల్లో జరగనున్న నిమజ్జనోత్సవాలకు సైతం ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. జిహెచ్‌ఎంసి, సిఎంసిల పరిధుల్లో చెరో 47 చొప్పున మొత్తం 94 చెరువుల్లో, ఎంఎంసి పరిధిలో 9 చెరువుల్లో నిమజ్జనోత్సవాలు జరగనున్నాయి. మొత్తంగా మూడు కార్పొరేషన్‌ల పరిధిలోని 103 చెరువుల్లో నిమజ్జన ఏర్పాట్లను మున్సిపల్ కార్పొరేషన్లు చేపట్టగా, అక్కడ ఇతర శాఖలతో సమన్వయంతో పనిచేసేందుకు 51 డిఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగనున్నాయి. వీటికి తోడుగా 21 బైక్ బృందాలు కూడా క్షేత్రస్థాయిలో మోహరించి నిమజ్జనోత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపడతాయి. ఏర్పాట్లపై హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ గురువారం సమీక్ష నిర్వహించారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంతరం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని , ముఖ్యంగా ఈనెల 25, 26 తేదీల్లో భారీగా నిమజ్జన కార్యక్రమాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, శిక్షణ పొందిన స్విమ్మర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని రంగనాథ్ స్పష్టం చేశారు.



### భక్తుల భద్రతే ప్రధానం

నిమజ్జనోత్సవాల నిర్వహణకు సంబంధించి హైడ్రా సన్నాహక చర్యలను అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య వివరించారు. మొత్తం 394మంది గజ ఈతగాళ్లను సిద్ధంచేసినట్టు తెలిపారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా వీరు నీటిలో, పరిసర ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి నిమజ్జన కేంద్రంలో పరిస్థితులకు అనుగుణంగా డిఆర్‌ఎఫ్ బృందాలు, రక్షణ పరికరాలు, స్విమ్మర్లు అందుబాటులో ఉండేలా హైడ్రా సమన్వయం చేస్తోందని వివరించారు. హుస్సేన్‌సాగర్‌లో ప్రతి షిఫ్టుకు 50 మంది గజ ఈతగాళ్లు విధులు నిర్వహించనున్నారని, పర్యాటకశాఖకు చెందిన బోట్లతో పాటు హైడ్రాకు చెందిన 6 బోట్లను కూడా వినియోగిస్తామని పాపయ్య తెలిపారు. దుర్గం చెరువు, ఐడిఎల్ చెరువు, మల్కం చెరువు, గంగారం చెరువు, లింగం చెరువు, దుండిగల్ పెద్దచెరువు వంటి ప్రాంతాల్లోనూ అవసరమైన మేర గజ ఈతగాళ్లను మోహరిస్తున్నట్టు చెప్పారు. జిహెచ్‌ఎంసి, సిఎంసి, ఎంఎంసిలతో కలిసి హైడ్రా సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తారని ఆయన వివరించారు.

## వార్డుల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యం



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామ పంచాయతీ వార్డుల్లో వెలుగులు నింపాలన్నదే లక్ష్యంగా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని లింగంధన గ్రామంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిళ్ళ వెంకట్, కేశంపేట సర్పంచ్ బుజ్జం సంతోష శ్రీశైలం యాదవ్, పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, సుందరపూర్ సర్పంచ్ భారతి రవీందర్, తూర్పుగడ్డ సర్పంచ్ థౌర్యనాయక్ పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

జెఎసి చైర్మన్ ఊటు యశ్వంత్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెఎసి చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా.రామారావు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ పోస్టర్‌ను తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (టిజి జాక్), రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ జెఎసి కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన 6 మాసాలలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీను, కో చైర్మన్లు గోపాల్, రమేష్, డేవిడ్, గోపాల్, జి.శాంతిశ్రీ, నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, జమ కుశాల్, మల్లారెడ్డి, రంగయ్య, గోపాల్, వెంకటస్వామి, పరమేష్, మహేష్, సంతోష్, ప్రమీల, రాణి, అరుణ పాల్గొన్నారు.

## వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ స్వర్ణ కుమారితో కలిసి సరూర్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, రోగుల హాజరు, ఒపి రిజిస్టర్లు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ల్యాబొరేటరీ సేవలు, ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందేలా సిబ్బంది సమయపాలన పాటిస్తూ, అందుబాటులో ఉన్న అన్ని సేవలను ప్రజలకు తెలియజేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను నిరంతరం పాటించాలని, మందుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్మయి సరూర్‌నగర్‌లో క్షేత్రస్థాయి తనిఖీలను చేపట్టారు. బహదూర్‌గూడ, సరూర్‌నగర్ ప్రాంతాల్లో పలు ప్రభుత్వ సంస్థలను సందర్శించి, అక్కడ కొనసాగుతున్న సేవలు, విద్యా కార్యక్రమాలు, వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపిఎస్ బహదూర్‌గూడ, అంగన్‌వాడీ కేంద్రం, ప్రీప్రైమరీ పాఠశాల, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం (డిడిఆర్‌సి) సందర్శించారు. దివ్యాంగులకు నాణ్యమైన సేవలు సమర్థవంతంగా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



## కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం/యాచారం :** మోస పూరిత వాగ్ధానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని బిఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలను అమలు చేయడంలో విఫలం అయినందున రైతు పక్షాన ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో యాచారం మండల బిఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రమేశ్‌గౌడ్, పాశ్చభాషా, రాజునాయక్, సత్తు వెంకటరమణారెడ్డి, లక్ష్మారెడ్డి, భూడిద రాంరెడ్డి, అంజిరెడ్డి, టి,రాజేంధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, యాదయ్య గౌడ్, కల్లూరి శివ, ఖాజు, బోల్లంపల్లి వెంకటేశ్, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సొంతనిధులతో మట్టిరోడ్డు పనులు



**ప్రజాపక్షం/కేశంపేట:** సొంత నిధులతో మట్టిరోడ్డు నిర్మాణ పనులకు మాజీ ఎంపిపి వై.రవీందర్ యాదవ్ శ్రీకారం చుట్టారు. గురువారం మండల పరిధిలోని చౌలపల్లి గ్రామంలో సొంత నిధులతో మట్టి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో కోట మైసమ్మ దేవాలయానికి వెళ్ళే భక్తులతోపాటు గ్రామస్తులు రాకపోకల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు రవీందర్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్‌రావు, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, గోగు వెంకట నారాయణరెడ్డి, సర్పంచ్‌లు హరి శేఖర్, వేణుగోపాల్‌చారి, భాస్కర్‌నాయక్, రమేష్ యాదవ్, ధనలక్ష్మీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యాయులకు ఉచిత వైద్యశిబిరం

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో సిఆర్ పాలీక్లినిక్, రోటరీ క్లబ్ హైద్రాబాద్ మావెరిక్స్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డా.కె. రజనీ, సిఆర్ పాలీక్లినిక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి. శ్రీనివాస్‌రావు, పాలీక్లినిక్ సిఒఒ శ్రీమతి కుభంపాటి విజయలక్ష్మి విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిఆర్ పాలీక్లినిక్ , రోటరీ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ మావెరిక్స్‌ల ఆధ్వర్యంలో జుబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ భస్తీల నుండి, సమీప ప్రాంతాల నుండి విచ్చేసిన ఉపాధ్యాయులకు ఉచితంగా వైద్య సేవలు అందించారని తెలిపారు. ఉచిత వైద్య సేవలలో షుగర్, బిపి, డెంటల్, ఐ చెకప్, బాడీ చెకప్, జనరల్ సర్జన్ చెకప్‌లతో పాటు ఇతర సేవలు దయాగ్నస్టిక్స్, ఇసిజి, ఎక్స్‌రే, పాథ్ల్యాబ్ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అందరికి ఉచితంగా ఇతర వైద్య సేవలలో పేషేంట్స్‌లకు బిపి, షుగర్‌లను పరీక్షించి ఉచితంగా మందులను అందించారని తెలిపారు. క్యాంపు నిర్వహణకు సహకరించిన డాక్టర్లకు, నర్సులకు, వాలంటీర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




కార్యక్రమంలో సిఆర్ పాలీక్లినిక్ చైర్మేన్, ప్రముఖ వైద్యులు, వైద్యబృందంతో పాటు సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కుంభంపాటి అజయ్ కుమార్, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టర్ చెన్నకేశవరరావు, నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్ సభ్యులు, వృద్ధాశ్రమవాసులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఘనంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టితో కలిసి డిసిపిలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై, 24న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. గణేష్ శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడింగ్, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీఓలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రతి ఉత్సవ కేంద్రాన్ని పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఉత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపాల వద్ద పరిశుభ్రత, ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సూచించారు. విగ్రహాల నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు తదితర ప్రమాదకర అంశాలను తొలగించాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్టేట్ ఎగ్జిక్యూటివ్ రవీందర్‌రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి చైర్మన్ కె.నిరంజన్, సెక్రటరీ సాయికిరణ్‌చారి, వైస్‌ప్రెసిడెంట్ టి.ఆనంద్‌గౌడ్, ఆర్‌డిఒలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

**ప్రజాపక్షం/కొందుర్గు:** వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని..పంటలకు గిట్టుబాటు ధర, బోనస్ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆరోపించారు. గురువారం కొందుర్గు మండల కేంద్రంలోని జిఎం పటేల్ గార్డెన్‌లో కాంగ్రెస్ 1000రోజుల విధ్వంస పాలనపై బిఆర్‌ఎస్ చార్జీషీట్‌పై నియోజకవర్గ స్థాయి వ్యవసాయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, వై.రవీందర్ యాదవ్, రాజేష్ పటేల్, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
04-09-2026
www.prajapaksham.in
మహానగరి
GREATER HYDERABAD

# టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ప్రజాబాట

### క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు
### విద్యుత్ పోల్స్ ఎక్కి పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** క్షేత్రస్థాయిలో జరగాల్సిన పనులకు సంబంధించి ఆదేశాలు జారీ చేసి హాయిగా ఏసిలో కూర్చోవడం కాదని.. పనులు ఎలా జరుగుతున్నాయి? పనుల్లో నెలకొంటున్న ఆటంకాలు ఏమిటి? అని తెలుసుకుని అక్కడిక్కడే సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ రంగంలోకి దిగారు. ప్రజాబాట బస్తీబాటలో భాగంగా ఆయన ఏకంగా విద్యుత్ పోల్స్ ఎక్కి విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటున్నారు. గతంలో ఏ అధికారి కూడా ఇటువంటి చొరవతో అధికారులు, సిబ్బందిలో కదలిక తీసుకురాలేదని సిబ్బంది చర్చించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. గు రువారం ప్రజాబాట బస్తీబాటలో భాగంగా ఉదయం చేవెళ్ల సెక్షన్ పరిధిలోని మల్కారం గ్రామంలో విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిఎండి జితేష్ పాటిల్ మాట్లాడుతూ.. భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ పరికరాలు వినియోగించాలని, సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఉద్యోగుల ప్రాణ భద్రతే సంస్థకు అ త్యంత ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ సర్వే నిర్వహించి నెట్వర్క్ మ్యాపింగ్ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్.నరసింహులు, చీఫ్ ఇంజనీర్ రంగారెడ్డి జోన్ గోపయ్య, చీఫ్ ఇంజనీర్ సైబర్ సిటీ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి ఆడబిడ్డలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట

### సామాజిక ఉద్యమకారుడు డా.సి.హెచ్. భద్ర



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముగ్గురు బిసి ఆడబిడ్డలకు రాజకీయ అవకాశాలు కల్పించడం హర్షణీయమని సామాజిక ఉద్యమకారుడు డా.సి.హెచ్. భద్ర అన్నారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం సామాజిక న్యాయం పాటిస్తూ గద్వాల్ విజయలక్ష్మి కి, నేరెళ్ల శారదకు, గుండు సుధారాణికి కీలక పదవులు అప్పజెప్పడం పట్ల బిసి మహిళలకు ప్రజాప్రభుత్వం పెద్ద పీట వేస్తుందనడానికి నిదర్శనమన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకులకు మంత్రివర్గంలో చోటివ్వాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఫిరోజ్ ఖాన్‌లను రాష్ట్ర కేబినెట్‌లోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మంత్రి వివేక్‌కు స్వాగతం



**ప్రజాపక్షం/బేగంపేట్:** విదేశీ పర్యటన ముగించుకుని శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న మంత్రి వివేక్‌కు వివిధ సంఘాలు, శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆల్ ఇండియా షెడ్యూల్ కాస్ట్స్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు రాజు ఉస్తాద్ కేంద్ర నాయకత్వంలో స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

## సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలతో గణేష్ ఉత్సవ నిర్వాహకుల సమన్వయ సమావేశం గురువారం వెంగళరావునగర్ డివిజన్‌లోని సిద్ధార్థనగర్ కమ్యూనిటీ హాల్లో జరిగింది. సమావేశానికి డీసీపీ రమణారెడ్డి హాజరై ప్రసంగించారు. సమన్వయ సమావేశంలో ఖైరతాబాద్ జెడ్‌సి సంతోష్ రాథోడ్, అదనపు డిసిపిలు శ్రీకాంత్, వేణుగోపాల్, యూసుఫ్‌గూడ డిసి సురేష్, జూబ్లీహిల్స్ డిసి ఎన్.శంకర్, అమీర్‌పేట్ డీసీ సుజాత, ట్రాఫిక్ ఎసిపి హరిప్రసాద్, మధురానగర్ ఎస్‌హెచ్ఒహెచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. బోలక్‌పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమం అందరినీ ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల వరలక్ష్మి , కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, విజయభాస్కర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## హామీల అమలులో విఫలం



**ప్రజాపక్షం/గోషామహల్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బిఆర్‌ఎస్ ఆరోపించింది. గోషామహల్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం గోషామహల్ డివిజన్ పరిధిలోని ఘోడే కి ఖబర్, తెలుగు తల్లి విగ్రహం వద్ద పార్టీ శ్రేణులు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో గోషామహల్ ఇన్‌చార్జ్ ఆర్‌వి మహేందర్‌కుమార్ పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు తెలంగాణ వాటర్ పోలో జట్టు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టు 52వ జూనియర్ జాతీయ జల క్రీడల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా వాటర్ పోలో జట్టుకు, మేనేజర్ అండ్ కోచ్‌లకు గురువారం హైదరాబాద్ గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియంలో టీషర్ట్స్, కిట్ అందజేశారు. ఈ నెల 7 నుంచి 12 వరకు ఇండోర్‌లోని పిప్లియహానా స్క్వేర్‌లోని అంతర్జాతీయ స్విమ్మింగ్ పూల్‌లో పోటీలు నిర్వహిస్తారు. తెలంగాణ జట్టుకు లింగమనేని అనిరుధ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.ఉమేశ్, కోశాధికారి టి.కృష్ణమూర్తి, సెవెన్ సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ ఎండి ఎల్.ఎం.శంకర్, టీం మేనేజర్ కిరణ్ కుమార్, కోచ్ సయ్యద్ ముఖ్తర్ అహ్మద్, బాబు పాల్గొన్నారు.

## అపోలో ఫార్మసి ఆధ్వర్యంలో జాబ్ మేళా

**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనాధికార్యాలయంలో 8న తేదీన అపోలో ఫార్మసి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎ.వందన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వందకు పైగా ఉద్యోగాలకు ఎంపిక ఉంటుందన్నారు.అర్హతను బట్టి ప్రతి నెల రూ.12,500 నుంచి రూ.25వేల వరకు ఉంటుందని ఆమె తెలిపారు. ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, అప్రంటిషిప్ వంటివి ఉన్నాయన్నారు. అర్హత గల వారు ఈ నెల ఎనిమిదిన ఉదయం 11గంటలకు జాబ్ మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

## యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల కోసం యశోద హాస్పిటల్స్‌హైటెక్ సిటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పల్మనాలజీ, వాస్క్యులర్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సిఎస్‌సి) సహకారంతో జరిగిన ఈ శిబిరంలో వెయ్యి మందికి పైగా ట్రాఫిక్ పోలీసులు పాల్గొని వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు పొందారు. కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ఎస్‌సిఎస్‌సి చైర్మన్ డాక్టర్ ఎం. రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందవచ్చన్నారు. యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. రావు మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు ప్రతికూల వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నందున వారి ఊపిరితిత్తులు, రక్తనాళాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు.

## కమీషన్ల కోసం భూదందా



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం భూదందా చేస్తోందని బిఆర్‌ఎస్ కంటోన్మెంట్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ క్రిషాంక్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కంటోన్మెంట్‌లోని 7వ వార్డు బీఆర్‌ఎస్ నేతలు పారసాని శ్యాంకు మార్, కెవి శంకర్‌రావు అధ్యక్షతన కంటోన్మెంట్ ప్రజలకు సర్వే నెం:157/1లోని 8 ఎకరాల భూమిలో 6000 ఇందిరమ్మ ఇళ్లు తక్షణమే నిర్మించాలనే డిమాండ్‌తో చేపట్టిన నిరసనలో క్రిషాంక్ పాల్గొని ప్రసంగించారు. నిరసన కార్యక్రమంలో గజ్జెల నగేష్, నివేదిత, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, అనిత, నళిని, పాండు యాదవ్, శ్యామ్ కుమార్, లోకనాథం, కేబీ శంకర్ రావు, టిఎన్ శ్రీనివాస్, సత్యనారాయణ గౌడ్, మాధురి, కిరణ్ కుమార్, కుమార్ ముదిరాజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అవస్థలు



**ప్రజాపక్షం/అమీర్‌పేట్:** కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి బల్కంపేట్‌లోని సన్‌రైజ్, ఈడెన్, అమరావతి, ఇంపీరియల్ అపార్ట్‌మెంట్ ప్రాంతాలలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఎస్‌ఆర్‌నగర్ సిఐ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ జిఎం ఆశిష్, ఎఇ వెంకట్, ఎలక్ట్రికల్ ఎఇ మౌనిక, హార్టికల్చర్ అధికారి రోహిత్, ట్రాఫిక్ ఎస్‌ఐ నాగరాజు, బిఆర్‌ఎస్ నేతలు డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, కాలనీ వాసులు మల్లిఖార్జున్ గౌడ్, నాయకులు కూతురు నర్సింహా, కట్టా బలరాం, కుమార్, వనం శ్రీనివాస్, ఉత్తమ్ సింగ్, నారాయణ రాజు, పప్పు సింగ్ పాల్గొన్నారు.

## 10న చలో హైదరాబాద్

### తెలంగాణ ఉద్యోగుల జెఎసి పిలుపు



**ప్రజాపక్షం/నాంపల్లి:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ మిత్రులు నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. 10న తలపెట్టిన చారిత్రాత్మక చలో హైదరాబాద్ కార్యక్రమానికి అన్ని కేడర్ల ఉద్యోగులను సమాయత్తం చేసే ఉద్దేశంతో గురువారం తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ ఎస్.విక్రమ్‌కుమార్, కన్వీనర్ ఎంబి కృష్ణయాదవ్, హైదరాబాద్ సిటీ చైర్మన్ కె.శ్రీకాంత్, కన్వీనర్ జి.వెంకట్‌లతో పాటు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు లక్ష్మణ్, టిఎన్‌జిఒస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కురాడి శ్రీనివాస్, హైదరాబాద్ సిటీ కార్యదర్శి హరికృష్ణ పంతులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కెఆర్ రాజ్ కుమార్, ఖాలేద్ అహ్మద్, బి.శంకర్, వైదిక్ శ్రేష్ఠ, శ్రీధర్, నాగిరెడ్డి, గెజిటెడ్ అధికారుల ప్రతినిధులు డాక్టర్ కె.విద్యా సాగర్, బుష్రా సుల్తానా, వివిధ జిల్లా యూనిట్ల ప్రతినిధులు రాజు, సత్యనారాయణ, మహేందర్, శివ తదితర ప్రముఖ నాయకులు పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. పర్యటనలో భాగంగా పబ్లిక్ గార్డెన్స్‌లోని హార్టికల్చర్ శాఖ, రెడ్ హిల్స్‌లోని ఇరిగేషన్ సర్కిల్, జిల్లా ట్రెజరీ కార్యాలయం, పింఛన్ చెల్లింపుల సంయుక్త సంచాలకుల కార్యాలయం, దివ్యాంగుల సంక్షేమ శాఖ, వాటర్‌బోర్డు, ఇర్రం మంజిల్‌లోని ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయం, ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయం,సర్కిల్ 5, సర్కిల్ 7 పరిధిలోని సహాయ పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లోని ఉద్యోగులను కలిసి ప్రతినిధులు మాట్లాడారు. పెండింగ్ డిమాండ్ల సాధనకై సెప్టెంబర్ 10న జరగబోయే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగులందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

## ల్యాప్‌టాప్‌ల చోరీ నిందితుడు అరెస్టు

### రూ.7.6 లక్షల విలువైన 19 ల్యాప్‌టాప్‌ల స్వాధీనం



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** స్టడీ హాళ్లలో విద్యార్థుల ల్యాప్‌టాప్‌ల వరుస చోరీలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.7.6 లక్షల విలువైన 19 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకొన్నారు. గురువారం పోలీసుల వివరాల ప్రకారం... స్టడీ హాళ్లలోని విద్యార్థులు భోజనానికి వెళ్లడాన్ని చూసి నిందితుడు సంగిశెట్టి వినీత్ (29) ల్యాప్‌టాప్‌లను చోరీకి పాల్పడేవాడు. తర్వాత కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీస్ నిర్వహిస్తున్న వేమునూరి శ్రీనివాస్ (29)కు విక్రయించేవాడు. నారాయణగూడలోని బ్రైట్ మైండ్స్ స్టడీ హాల్‌లో జరిగిన ల్యాప్‌టాప్ చోరీపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సిసి టీవీ ఫుటేజీల సాయంతో నిందితుడి కదలికలను గుర్తించి, పార్శిగుట్ట వద్ద అదుపులోకి తీసుకొన్నారు. నిందితుడు గడిచిన నెల రోజుల్లో హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్ కమిషనరేట్లలోని పలు పోలీస్‌స్టేషన్ పరిధిల్లో ల్యాప్‌టాప్‌ల చోరీకి పాల్పడ్డాడు. కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని డిసిపి కె.శిల్పవల్లి అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న ప్రజా ప్రభుత్వం

### కాంగ్రెస్ సీనియర్ నేత దేవని సతీశ్



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం దూసుకుపోతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి దేవని సతీశ్ మాదిగ అన్నారు. వెయ్యిరోజుల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బిఆర్‌ఎస్ నేతలు హరీశ్ రావు, కెటిఆర్ విమర్శించడం సరికాదన్నారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకుండా ఫెయిలయ్యారని విమర్శించారు. పైగా బిఆర్‌ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిలైందనడం ఏమాత్రం సమంజసమని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఉచిత విద్యుత్తు, కొత్త రేషన్‌కార్డుల మంజూరు, సన్నబియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తూ ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఎస్‌సి సర్పంచ్‌లను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఈ నెల చివరి వారంలో వెయ్యి మంది ఎస్‌సి సర్పంచ్‌లతో కార్యక్రమం ఏర్పాటు చేస్తామని తెలిపారు

## కనీస వేతనాలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** వివిధ ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ఇతర సంస్థలలో పనిచేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్, హౌస్ కీపింగ్ సిబ్బందికి న్యాయం జరిగేలా కనీస వేతన చట్టాన్ని పకడ్బందీగా అమలు అయ్యేలా చూడాలని సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ జాదవ్, వైస్ చైర్మన్ మురహరిగౌడ్ మాట్లాడారు. తెలంగాణలో కార్మిక చట్టం 1948 సక్రమంగా అమలు కాకపోవడంతో రూ.5 లక్షలకు పైగా ఉన్న సెక్యూరిటీ, మూడు లక్షల మంది ఉన్న హౌస్ కీపింగ్ శానిటేషన్ కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టల ప్రకారం రూ.25 వేల వరకు వేతనం చెల్లించాల్సి ఉన్నా... అది ఎక్కడ అమలు కావడం లేదని వాపోయారు. మీడియా సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దినేష్, ట్రెజరర్ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని నిలదీయాలి



**ప్రజాపక్షం/సీతాఫల్‌మండి:** వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని బిఆర్‌ఎస్ నేతలు విమర్శించారు. బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆంజనేయులు గౌడ్ అధ్వర్యంలో ఇంటి ఇంటికి తిరుగుతూ జాబ్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కంది నారాయణ, కంది శైలజ, బిఆర్‌ఎస్ నేతలు కొండ కిషోర్, ఉండింటి సచిన్, వినోద్, గంగపుత్ర సాయి, బీబీ చారి, యాద క్రాంతి, సుమలత సుజాత, అనసూయ గౌడ్, మానస, రేణుక, మంజుల, లత, సులోచన, సుమతి, నందిత, భవిత, సుమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రగతికి కొత్త దిశ



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** ప్రజా పాలనతో తెలంగాణ ప్రగతికి కొత్త దిశ వచ్చిందని ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్, ఏఐసీసీ ఆంధ్రప్రదేశ్ కేకేసీ ఇంచార్జ్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి అన్నారు. మధురానగర్ కాలనీలో యువజన కాంగ్రెస్ కా ర్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో వెంగళరావునగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ సన్నీ గౌడ్, సెక్రటరీ ఉదయ్ కుమార్, కో ఆర్డినేటర్ సాయి మౌనిష్ గౌడ్ పాల్గొన్నారు.

## ఉచితంగా సహాయ పరికరాలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :** దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచితంగా సహాయ పరికరాలు అందించేందుకు ప్రధానమంత్రి దివ్యాశవయోశ్రీ కేంద్రం ద్వారా ఉచితంగా సేవలు అందుబాటులో ఉన్నాయని వికలాంగుల,వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత అధికారి ఎ.రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. బోయిన్‌పల్లి సికింద్రాబాద్‌లోని మనోవికాస్ నగర్‌లో ఏర్పాటుచేసిన పిఎండివికె కేంద్రంలో ఈ సేవలు ఉన్నాయన్నారు. అర్హులైన దివ్యాంగులు, వయోవృద్ధులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## హక్కుల పరిరక్షణకు కృషి

### రాష్ట్ర అంబేద్కర్ సంఘం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణతో పాటు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయా సాధనకు కృషి చేయాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు నిచ్చింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు వెల్మకంటి దయాకర్, గౌరవ అధ్యక్షుడు లాలయ్య, నరసయ్యలతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆక్రమణలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెల్లంకంటి దయాకర్, గౌరవ సలహాదారు ఇసంపల్లి నీలమ్మ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మల సుదర్శన్, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఇసంపల్లి రమేష్, దుప్ప నరేష్, రాష్ట్ర కార్యదర్శులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ నెల 10న నిర్వహించనున్న ‘చలో హైదరాబాద్’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిజిఇజెఎసి కన్వీనర్ గందూరి వెంకట్, టిజిఓ సెక్రటరీ నిరంజన్ రెడ్డి, కోశాధికారి భీమ్‌సింగ్ పిలుపునిచ్చారు. జెఎసి పిలుపు మేరకు గురువారం నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు మెరుగైన ఫిట్‌మెంట్, రెండో పిఆర్‌సి అమలు, ఆర్‌డిఎలు, పెన్షన్ బకాయిల చెల్లింపుతో పాటు ఇతర హక్కులను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ నెల 10న జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ధర్నాలో ఎక్సైజ్ ఫోరం అధ్యక్షుడు ఎం.జ్ఞానేశ్వర్, ఎక్సైజ్ హెచ్‌ఓడి అధ్యక్షుడు టి.తిరుపతినాయక్, నగర శాఖ కార్యదర్శి విజయ్‌కుమార్, ఎం.రాజేంద్రస్వామి, శ్రీకాంత్‌గౌడ్ , కె.విజయ, సరిత, మహేందర్‌రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## సురేఖ బర్తరఫ్‌ను ఖండిస్తున్నాం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** మంత్రి కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య అన్నారు. ఈ మేరకు ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఒక మహిళ బీసీ మంత్రిని తొందరపాటు చర్యలతో పదవి నుంచి తప్పించడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ చర్య కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలపై చేస్తున్న కుట్రగా బీసీ సమాజం భావిస్తుందని అన్నారు. వెంటనే బర్తరఫ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని తప్పును చక్కదిద్దుకోవాలని.. లేనిపక్షంలో బీసీ సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

## గెలుపు లక్ష్యంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/బోరబండ/జూబ్లీహిల్స్:** గెలుపు లక్ష్యంగా పనిచేయాలని బిజెపి నేతలుపిలుపునిచ్చారు. రాజీవ్‌నగర్ డివిజన్ బిజెపి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా రాగి సత్యనారాయణ, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యురాలు బంగారు శృతిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలాఉండగా.. శ్రీకృష్ణానగర్ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఫణిల్ కుమార్ ఆధ్వర్యంలో తొలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుంభాల గంగరాజు, పులి రామ్, బరిగెల జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, కల్పన సింగ్, కవిత, మురళీధర్ తదితరులు హాజరయ్యారు.

## జన్మాష్టమి రోజున దయాల్‌బాగ్‌లో పవిత్ర భండారా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాధాస్వామి మత ప్రవర్తకులు, తొలి సంత్ సత్‌గురువైన పరమ పురుష్ పూరన్ ధనీ హుజూర్ స్వామీజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని 4న జన్మాష్టమి రోజున ఆగ్రాలోని దయాల్‌బాగ్‌లో పవిత్ర భండారా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హుజూర్ స్వామీజీ మహారాజ్ 1818 ఆగస్టు 24, 25 మధ్య పవిత్ర జన్మాష్టమి రాత్రి ఆగ్రాలోని పన్నీ గలీలో సేఠ్ శివ్ దయాల్ సింగ్‌జీ గా అవతరించారని పేర్కొన్నారు. జీవుల ఉద్ధరణకు ప్రత్యక్ష మార్గమైన సూరత్‌శబ్ద్‌యోగాన్ని ఆయన బోధించారని, 1861 ఫిబ్రవరి 15న వసంత పంచమి రోజున సత్సంగీయుల కోసం రాధాస్వామి సత్సంగ ద్వారాలను తెరిచారని తెలిపారు. 2 నుంచి 6 వరకు భండారా వారం నిర్వహించనున్నారు. 4న దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లోని అనుమతించబడిన శాఖల్లోనూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, తూర్పు రాష్ట్రాలతో పాటు యూరప్ నుంచి సత్సంగీ సోదర సోదరీమణులు దయాల్‌బాగ్‌కు హాజరుకానున్నారు. అత్యంత పూజ్య హుజూర్ ప్రొఫెసర్ ప్రేమ్ సరన్ సత్సంగీ సాహబ్ దయాల్‌బాగ్ ఎనిమిదో, ప్రస్తుత వక్త్ సంత్ సత్‌గురువుగా కొనసాగుతున్నారని నిర్వాహకులు తెలిపారు. 4న ఉదయం పవిత్ర ఆరతి, అనంతరం రెండో సెషన్‌లో పొలాల్లో పవిత్ర భండారా నిర్వహించనున్నారు. స్వామీజీ మహారాజ్ బోధించిన ఆధ్యాత్మికత, సేవ, వ్యవసాయం, సహకార సమాజ జీవన విధానాల సమ్మేళనాన్ని దయాల్‌బాగ్ కొనసాగిస్తోందని తెలిపారు.

## భారతదేశ ఆర్థిక వృద్ధి..
# ప్రపంచ విశ్వాసానికి మూలం

- ప్రధాని మోదీ: బెల్జియం పిఎం బార్ట్ డి వెవర్‌తో విస్తృత చర్చలు



**న్యూఢిల్లీ :** వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, సాంకేతిక రంగాలలో సహకారాన్ని విస్తరించుకోవాలని భారత్, బెల్జియం గురువారం ప్రతిజ్ఞ చేశాయి. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్‌తో న్యూ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో విస్తృత చర్చలు జరిపారు. బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్ మూడు రోజుల పర్యటన కోసం భారత్‌కు వచ్చారు. ఈ నేపథ్యంలో ఇరుదేశాల ప్రధానులు పలు రంగాలలో వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేసే విషయమై విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇక్కడొక మీడియా ప్రకటనను విడుదల చేశారు. గత త్రైమాసికంలో భారతదేశం సాధించిన 7.8శాతం ఆర్థిక వృద్ధిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. దేశం ఎదుగుదల ప్రపంచ విశ్వాసం చూరగొనడానికి, సరికొత్త అవకాశాలకు మూలంగా నిలిచిందన్నారు. భారత్‌-యురోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడాన్ని బెల్జియం ప్రధానమంత్రి బార్ట్ డి వెవర్ ఒక ప్రధాన మైలురాయిగా అభివర్ణించారు. అలాగే, న్యూఢిల్లీ, బ్రసెల్స్ గతంలో కంటే విస్తృతమైన, మరింత వ్యూహాత్మకమైన సంబంధాన్ని నిర్మిస్తున్నాయని పేర్కొన్నారు. నేడు ప్రపంచం గొప్ప సంక్షోభ కాలాన్ని ఎదుర్కొంటున్నదని, ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. ఆహారం, ఇంధనం, సరఫరా గొలుసులు ఇలా ప్రతీరంగం అనిశ్చితితో ప్రభావితమవడం బాధాకరం అన్నారు. ఈ సవాల్‌తో కూడిన వాతావరణంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగించిందని, గత త్రైమాసికంలో భారత్ 7.8శాతం వృద్ధిని నమోదు చేసిందని, నేడు భారతదేశ వృద్ధి గాథ ప్రపంచ విశ్వాసం చూరగొనడానికి, కొత్త అవకాశాలకు మూలంగా మారుతోందని నరేంద్రమోదీ వివరించారు. ఇరుదేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారాన్ని మొత్తం సంబంధానికి 'ఒక కీలక స్తంభం'గా అభివర్ణించారు.'ఈ రోజు, ఇరుదేశాల మధ్య సైనిక మార్పిడులను, శిక్షణ సహకారాన్ని పెంపొందించుకోవడానికి మేం అంగీకరించాం.మా ప్రభుత్వాలు, రక్షణ పరిశ్రమల మధ్య కుదిరిన ఒప్పందాలు రక్షణ సహ-అభివృద్ధి, సహ-ఉత్పత్తికి కొత్త అవకాశాలు తెరుస్తాయి' అని మోదీ తెలిపారు. నేరాల నిర్మూలనలో మన ఏజెన్సీల మధ్య నిఘా భాగస్వామ్యాన్ని, సహకారాన్ని మరింత బలోపేతం చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ప్రజల సంబంధాలే ఈ సంప్రదింపులకు 'అతి పెద్ద బలం' అని ప్రధానమంత్రి అన్నారు. స్టార్టప్‌ల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, సముద్ర రంగంలో సామర్థ్య నిర్మాణాన్ని పెంపొందించడానికి ఇరుదేశాలు అంగీకరించాలని చెప్పారు. 'మేం విశ్వవిద్యాలయ పరిశోధన సహకారాన్ని కూడా బలోపేతం చేస్తాం. అదే సమయంలో ప్రతిభావంతుల బదిలీని సులభతరం చేయడానికి, త్వరలోనే వలస, బదిలీ భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం' అని మోదీ తెలిపారు. ఉక్రెయిన్, పశ్చిమాసియాలోని సంఘర్షణలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాల్సిన ఆవశ్యకతను నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఉన్నత సాంకేతికత, స్వచ్ఛ ఇంధన రంగాలలో సహకారాన్ని విస్తరించుకోవడానికి ఇరుదేశాల ప్రాధాన్యతలను మోదీ నొక్కిచెప్పారు. జులైలో భారతదేశం, బెల్జియం ఒక కొత్త మంత్రివర్గ స్థాయి వ్యూహాత్మక చర్చను ఏర్పాటు చేయడం ద్వారా రాజకీయ సంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నాయి. తొలి బెల్జియం-భారత వ్యూహాత్మక చర్చ జరిగింది. జులై 15న బ్రస్సెల్‌లో జరిగిన ఈ సమావేశానికి విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్, బెల్జియం డిప్యూటీ ప్రధానమంత్రి మాక్సిమ్ ప్రివోట్ సహ-అధ్యక్షత వహించారు. భారతదేశం, బెల్జియం పునరుత్పాదక శక్తి, స్వచ్ఛమైన సాంకేతికతలు, సుస్థిరత రంగాలలో సహకారాన్ని అభివృద్ధి చేసుకున్నాయి. బెల్జియం కంపెనీ జాన్ కాకరిల్, కాకినాడలో 2 గిగా వాట్ల అంచనా సామర్థ్యంతో ఒక ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తోంది. ప్రధాన యురోపియన్ సముద్ర, లాజిస్టిక్ కేంద్రంగా బెల్జియంకు ఉన్న స్థానం ఓడరేవులు, షిప్పింగ్ సరఫరా గొలుసులలో సహకారానికి అవకాశాలను కల్పిస్తున్నది.

## తల పగలగొట్టి..
# అరెస్టు తప్పించుకున్నా

- జంతర్ మంతర్ ప్రదర్శకులపై దాడిచేసిన ఉన్మాది వీరంగం
- ఎందుకు అరెస్టు చెయ్యలేదని నిలదీసిన ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద జులై నెలలో కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆందోళన సందర్భంగా ఒక ప్రదర్శకురాలి తండ్రి తల పగలగొట్టానని, అరెస్టు కాకుండా తప్పించుకున్నానని బాహాటంగా వీడియో ద్వారా ప్రకటించిన ఉన్మాది స్వతంత్ర భరద్వాజ్‌ను పోలీసులు ఎందుకు అరెస్టు చేయకుండా వదిలేశారని ప్రతిపక్షాలు బిజెపిపై విమర్శనాస్త్రాలు సంధించాయి. తక్షణం భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. సెక్షన్ 307 (హత్యాయత్నం కేసు) కింద తనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని, ప్రపంచం ఈ విషయాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందని భరద్వాజ్ స్వయంగా ప్రకటించాడు. ఢిల్లీ మంత్రి కపిల్‌మిశ్రా, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ తదితరుల ఆశీర్వాదాలు తనకు ఉన్నాయని హిందుత్వాన్ని ప్రభావితంచేసే కార్యకర్త భరద్వాజ్ ఒక వీడియో ద్వారా చెప్పడాన్ని ప్రతిపక్షాలు ప్రముఖంగా ప్రజలముందుకు తీసుకువచ్చాయి. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశాయి.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా కపిల్ మిశ్రా, చిరాగ్ పాశ్వాన్ తదితరులను పెద్దన్నయ్యలుగా నేరస్థుడు భరద్వాజ్ పిలుచుకుంటున్నాడని కాక్రోచ్ జనతాపార్టీ, కాంగ్రెస్‌పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీలు తీవ్రంగా స్పందించాయి.

భరద్వాజ్‌గా పిలిపించుకునే స్వతంత్ర భరద్వాజ్‌కు సోషల్ మీడియాలో ఇన్‌స్టాగ్రామ్‌లో 1.84 లక్షలమంది ఫాలోయింగ్ ఉంది. అతగాడు జంతర్ మంతర్ వద్ద ఆందోళనకారులను లక్ష్యంగా చేసుకుని అనేక వీడియోలను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేశాడు. జులై 20వ తేదీన పోలీసులు భారీస్థాయిలో హింసాత్మకంగా విరుచుకుపడిన రోజున ప్రదర్శకులను ఉగ్రవాదులుగా, బొద్దింకలుగా అభివర్ణించాడు. ఒక్కరోజుపాటు తనలాంటి సనాతన యోధులను పోలీసులుగా పనిచేడానికి అనుమతించాలని కూడా సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశాడు. మరో వీడియోలో సివిల్ డ్రస్సుల్లో ఉన్న వ్యక్తులే ప్రదర్శకులపై దాడులు చేశారని, నిజమైన పోలీసులు ఇప్పుడు వచ్చారని పేర్కొన్నాడు. తనను తాను ''స్వతంత్ర సనాతన యోధ''గా ప్రొఫైల్‌లో రాసుకున్నాడు.

కాంగ్రెస్‌పార్టీ సోషల్ మీడియా-డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్ ఛైర్‌పర్సన్ సుప్రియ శ్రీనట్ ఈ వీడియోను షేర్ చేశారు. ''నేను స్వతంత్ర భరద్వాజ్. సిజెపి నిరసన ప్రదర్శకురాలు నిషు అజాద్ తండ్రి సంజయ్‌పై నేను దాడి చేశానని గర్వంగా చెబుతున్నా, అతడి తల బద్దలు కొట్టాను, ఆయన తలకు 60 కుట్లు పడ్డాయి, ఆయన చావు బ్రతుకులమధ్య ఉన్నాడు, ఇది 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు, కానీ నేను జైలుకు వెళ్ళలేదు, దాడి చేసిన తర్వాత ఆ రాత్రి అంతా రోడ్ల మీద స్వేచ్ఛగా తిరిగాను, మంత్రి కపిల్ మిశ్రా నుండి ఫోన్ కాల్ వచ్చిన తర్వాత నాకు ప్రశాంతత లభించింది'' అని స్వతంత్ర భరద్వాజ్ తన వీడియో సందేశంలో చెప్పాడు. కపిల్ మిశ్రా, చిరాగ్ పాశ్వాన్, మోదీజీ... వీళ్ళంతా నాకు పెద్ద అన్నయ్యలాంటివారు, నాకు ప్రతి ఒక్కరి మద్దతూ ఉంది'' అని భరద్వాజ్ పేర్కొన్నాడు. దీనిపై ఆమ్ ఆద్మీపార్టీ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఆయన నిలదీశారు. ''మీరు తప్పనిసరిగా ఈ వీడియోను చివరి వరకూ చూడాలి, మీ రక్తం సలసలా మరిగిపోతుంది, భగత్‌సింగ్ లాంటి గొప్ప నాయకులు ఎందుకు తమ జీవితాలను త్యాగం చేశారు? ఈ విధమైన వాళ్ళని బాహాటంగా రక్షించే ఒక ప్రధానమంత్రి ఈ దేశానికి వస్తారని వారు ఊహించారా?'' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. కాక్రోచ్ జనతాపార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తీవ్రంగా స్పందిస్తూ,''సిజెపి కార్యకర్త నిషు అజాద్ తండ్రి సంజయ్ తల పగిలిపోయింది, ఆయన మెదడుకు పెద్ద గాయమైంది, ఇది హత్యాయత్నం కేసు, కానీ పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేయలేదు, భరద్వాజ్‌ను తక్షణం అరెస్టు చేయాలి, బహిరంగంగా నేరం ఒప్పుకున్నాగానీ అతడిపైన ఎందుకు చర్య తీసుకోలేదు'' అని ప్రశ్నించారు. సంజయ్ తీవ్రమైన తల గాయంతో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. ఐతే డిప్యూటీ పోలీస్ కమిషనర్ సచిన్ శర్మ, అసిస్టెంట్ కమిషనర్ అజయ్ శర్మ మాత్రం భరద్వాజ్‌ను అరెస్టు చేయాలన్న డిమాండ్‌ను తిరస్కరించారు. వెళ్ళి కోర్టు ఆర్డర్ తెచ్చుకోవాలని తమకు ఆదేశించారని సౌరవ్ దాస్ విమర్శించారు. ఈ విధంగా నేర ముఠాలను ప్రోత్సహిస్తున్న మంత్రి కపిల్ మిశ్రా ఎందుకు తన పదవికి రాజీనామా చేయలేదని ఎక్స్ వేదికగా దాస్ ప్రశ్నించారు.

## కమర్షియల్ పైలట్‌గా అభినందన్ వర్ధమాన్..



**న్యూఢిల్లీ :** భారత వాయుసేనలో మాజీ గ్రూప్ కెప్టెన్, వీర చక్ర పురస్కార గ్రహీత అభినందన్ వర్ధమాన్ కొత్త కొలువును ఎంచుకున్నారు. గోవాకు చెందిన ప్రాంతీయ విమానయాన సంస్థ ఎఫ్ఎల్‌వై 91లో కమర్షియల్ పైలట్‌గా ఆయన చేరారు. ఆగస్టులోనే ఆయన ఈ ఉద్యోగంలో చేరినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. ఈ నేపథ్యంలో 22 ఏళ్లుగా వాయుసేనలో వివిధ హోదాల్లో పని చేసిన అభినందన్ వర్ధమాన్.. ముందస్తుగానే ఉద్యోగానికి పదవి విరమణ చేశారు. అయితే కొత్త ఉద్యోగంలో చేరికపై ఇప్పటి వరకు ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు. 2019లో ఫిబ్రవరిలో పుల్వామా వద్ద జరిగిన ఉగ్రదాడిలో 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు మరణించారు. అందుకు ప్రతీకారంగా భారత్.. పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లో జైషే మహమ్మద్ ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడులు చేసింది. ఈ నేపథ్యంలో పాక్ వైమానిక దళానికి ఎఫ్ 16 యుద్ధ విమానం భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. దీనిని తన మిగ్ విమానంతో వింగ్ కమాండర్ అభినందన్ ఆకాశంలోనే ధ్వంసం చేశారు. అదే సమయంలో ఆయన ప్రయాణిస్తున్న ఆ విమానం దెబ్బతింది. ఈ నేపథ్యంలో పారాచూట్ సాయంతో కిందకి దూకారు. దాంతో ఆయన పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగంలో దిగారు. దీంతో అభినందన్‌ను పాక్ సైన్యం చుట్టుముట్టింది. మూడు రోజుల పాటు ఆయనను పాక్ సైన్యం బందీగా ఉంచింది. అభినందన్ వర్ధమాన్‌ను వెంటనే తమకు అప్పగించాలంటూ పాక్‌పై భారత్ తీవ్ర ఒత్తిడి చేసింది. దీంతో ఆయనను భారత్‌కు పాక్ అప్పగించింది. ఈ నేపథ్యంలో అభినందన్ వర్ధమాన్ పేరు దేశవ్యాప్తంగా మారుమ్రోగింది. దేశంలో మూడో అత్యున్నత యుద్ధ పురస్కారం వీరచక్రతో ఆయనను భారత్ ప్రభుత్వం గౌరవించింది.

## మణిపూర్‌లో జాతి ఘర్షణలు...
# 306 మంది మృతి

49 మంది గల్లంతు : అసెంబ్లీలో హోంమంత్రి ప్రకటన

**ఇంఫాల్ :** మూడు సంవత్సరాల క్రితం మణిపూర్‌లో జాతి ఘర్షణలు చెలరేగాయి. 2023 మే నెలలో చెలరేగిన జాతి ఘర్షణల్లో కనీసం 306 మంది మరణించారని, 49 మంది ఇంకా గల్లంతయ్యారని రాష్ట్ర హోం మంత్రి గోవిందాస్ కొంథౌజమ్ గురువారం అసెంబ్లీకి తెలిపారు. షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టి) హోదా కోసం మైతీ వర్గం చేసిన డిమాండ్‌ను నిరసిస్తూ కొండ ప్రాంత జిల్లాల్లో గిరిజన సంఘీభావ ర్యాలీ నిర్వహించిన తర్వాత, 2023 మే 3న మైతీ, కుకీజో వర్గాల మధ్య ఈ హింస మొదలైంది. కాగా, అసెంబ్లీ సమావేశాల రెండో రోజున బిజెపి ఎమ్మెల్యే సపం రంజన్ సింగ్ అడిగిన ప్రశ్నకు కొంథౌజమ్ సమాధానమిచ్చారు. '2023 మే 3న హింస మొదలైనప్పటి నుండి, ఆగస్టు 31, 2026 నాటికి 306 మంది మరణించారు. 49 మంది ఇంకా గల్లంతయ్యారు' అని చెప్పారు. మణిపూర్ జనాభాలో మైతీలు సుమారు 53 శాతం ఉంటారని, వీరు ఎక్కువగా ఇంఫాల్ లోయలో నివసిస్తారన్నారు. మరోవైపు నాగాలు, కుకీలతో కూడిన గిరిజనులు 40 శాతం ఉంటారని, వీరు ప్రధానంగా కొండ ప్రాంత జిల్లాల్లో నివసిస్తారని చెప్పారు. నెలల తరబడి సాగిన జాతి ఘర్షణల నేపథ్యంలో, బీరెన్ సింగ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఫిబ్రవరి 9న రాజీనామా చేసిన తర్వాత, గత ఏడాది ఫిబ్రవరి 13న రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించబడింది. 2027 వరకు పదవీకాలం ఉన్న 60 మంది సభ్యుల అసెంబ్లీ, రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత తాత్కాలికంగా నిలిపివేయబడింది. బిజెపి నాయకుడు వై. ఖేమ్‌చంద్ సింగ్ ముఖ్యమంత్రిగా కొత్త రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడటానికి కొన్ని గంటల ముందు, ఈ ఏడాది ఫిబ్రవరి 4న ఆ రాష్ట్రపతి పాలన ఎత్తివేయబడింది.

## టిఎంసి కార్యాలయం విధ్వంసం

**కోల్‌కతా :** కోల్‌కతా కామాక్ స్ట్రీట్‌లోని టిఎంసి కార్యాలయంపై జరిగిన విధ్వంసాన్ని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం ఖండించారు. ఇలాంటి 'అఘాయిత్యాలు' కొనసాగితే న్యూఢిల్లీలోని బిజెపి నాయకుల నివాసాల బయట తమ పార్టీ ప్రదర్శనలు నిర్వహిస్తుందని ఆమె హెచ్చరించారు. ఫేస్‌బుక్ లైవ్‌లో ఈ విషయంపై మాట్లాడుతూ బిజెపి మద్దతు ఉన్న వ్యక్తులు పత్రాలు, పరికరాలను దోచుకున్నారని బెనర్జీ ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ కార్యాలయంపై జరిగిన దాడి రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిని ప్రతిబింబిస్తోందని ఆమె అన్నారు. 'కోల్‌కతాలో తెల్లవారుజామున మా పార్టీ కార్యాలయంపై జరిగిన విధ్వంసాన్ని ఖండిస్తున్నాము. కోల్‌కతాలోనే శాంతిభద్రతల పరిస్థితి ఇలా ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో ఏం జరుగుతుందో ఊహించండి' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. బిజెపి కార్యకర్తలు టిఎంసి కార్యాలయాన్ని ధ్వంసం చేసి, ఆవరణ నుంచి ముఖ్యమైన పత్రాలు, పరికరాలను తీసుకెళ్లారని బెనర్జీ ఆరోపించారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆమె, పశ్చిమ బెంగాల్‌లో బిజెపి పూర్తి అరాచకానికి పాల్పడుతోందని ఆరోపించారు. లాగే జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయంలో జరిగిన గూండాయిజాన్ని ఖండించారు. తనను స్వేచ్ఛగా తిరగకుండా అడ్డుకునేలా ఒక పరిస్థితిని సృష్టిస్తున్నారని టిఎంసి అధినేత్రి ఆరోపించారు. ఆరోపిత బెదిరింపులు, భయపెట్టడాలను ప్రస్తావిస్తూ, తనను ఇంటి నుంచి బయటకు వెళ్లనివ్వమని ముఖ్యమంత్రి చెబుతున్నారు అని ఆమె అన్నారు. తమ నాయకులు, కార్యాలయాలపై దాడులు కొనసాగితే టిఎంసి మౌనంగా ఉండబోదని బెనర్జీ హెచ్చరించారు. టిఎంసిపై ఈ అఘాయిత్యాలు ఆగకపోతే, న్యూఢిల్లీలోని బిజెపి నాయకుల ఇళ్ల బయట ధర్నాలు చేస్తామని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. గురువారం తెల్లవారుజామున కోల్‌కతాలోని కామాక్ స్ట్రీట్‌లో ఉన్న తమ పార్టీ కార్యాలయాన్ని బిజెపి మద్దతు ఉన్న సాయుధులు ధ్వంసం చేశారని టిఎంసి జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఆరోపించిన తర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మాస్కులు, హెల్మెట్లు ధరించిన వ్యక్తులు టెలివిజన్ సెట్లు, ప్రింటర్‌తో సహా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకుని ఆ ప్రాంగణం నుండి వెళ్తున్నట్లుగా సీసీటీవీ ఫుటేజీని బెనర్జీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ ఫుటేజీలో, కార్యాలయం లోపల ఉన్న ఒక గదిలో ధ్వంసమైన ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా కనిపించాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారని ఒక అధికారి తెలిపారు.

## విద్య అనేది హక్కు

అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు వ్యవస్థ నుండి నిర్లక్ష్యానికి గురికావొద్దు : రాహుల్‌గాంధీ



**నాసిక్ :** విద్య దేశంలోని ప్రతి ఒక్క విద్యార్థి హక్కు, అని అదేమీ ప్రత్యేక హక్కు కాదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు వ్యవస్థ నుండి నిర్లక్ష్యానికి గురికాకూడదన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో బుధవారం పర్యటించిన సందర్భంగా, తమ డిమాండ్ల సాధన కోసం నిరాహార దీక్ష చేస్తున్న వారితో సహా గిరిజన విద్యార్థుల బృందాన్ని ఆయన కలిశారు. గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలల దుస్థితితో సహా పలు సమస్యలపై ఆ విద్యార్థులు నిరసన తెలుపుతున్నారు. తరువాత ఎక్స్ వేదికగా స్పందించారు. 'విద్య అనేది ఒక ప్రత్యేక హక్కు కాదు,, అది భారతదేశంలోని ప్రతి విద్యార్థి హక్కు' అని పేర్కొన్నారు. నాసిక్ పర్యటనలో గిరిజన విద్యార్థుల బృందాన్ని కలిసిన తాను, వారి సమస్యలు, డిమాండ్లను శ్రద్ధగా విన్నానని ఆ కాంగ్రెస్ నేత తెలిపారు. చదువుకోవడానికి గౌరవప్రదమైన, సురక్షితమైన, అనుకూలమైన వాతావరణాన్ని పొందే హక్కు ప్రతి విద్యార్థికీ ఉందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు నొక్కి చెప్పారు. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులు వ్యవస్థ నుండి నిర్లక్ష్యానికి గురికాకూడదని, వారికి వ్యవస్థ మద్దతు, సాధ్యమైనంత అన్ని రకాల సహాయం అవసరం అని ఆయన అన్నారు. నాసిక్ పర్యటనలో భాగంగా, మహారాష్ట్ర కాంగ్రెస్ జిల్లా స్థాయి నాయకులతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని వారికి సూచించారు.


**CHANGE OF NAME**

I, **ALDANDI KANAKAIAH S/O. KASHAIAH,** R/o. 4-104, Ramancha, Chigurumamidi, Karimnagar, TG. hava changed my name as **VELDANDI KANAKAIAH, S/O. KASHAIAH** for all future purpose.

**CHANGE OF NAME**

I, **ALDANDI RUKMINI, W/O. KANAKAIAH,** R/o. 4-104, Ramancha, Chigurumamidi, Karimnagar, TG. have changed my name as **VELDANDI RUKMINI, W/O. KANAKAIAH** for all future purpose.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 156 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Ms. Pasikanti Soumya & Others**

**... Opponents**

2. Mr. Velde Srinivas, S/o. Sarvaiah, Age:41 Yrs, Occ:Superintendent, O/o. Administrative Officer Science College, Khammam, H.No: 2-7-428, Excise Colony, Hanamkonda, Warangal.
3. Mr. Velde Gyaneshwar, S/o, Sarvaiah, Age:50Yrs,Occ:Medical Officer, O/o. Civil Asst.Surgeon, Primary Health Center, Warangal, H.No: 3-9-502, Reddy Colony, Hanamkonda.
4. Mr. Tuduru Dattatreya, S/o, Ramaiah, Age: 54Yrs, Occ: Librarian, O/o.Principal Govt.Degree College, Kaghaznagar, H.No: 1-2-122/1, Near Pottisriramulu Statue, Kaghanagar.
5. Mr. Vanga Satyanarayana, S/o, Narsaiah, Age: 53Yrs, Occ: Conductor, O/o. TSRTC Karimnagar Depot, H.No: 2-10-210, Jyothi Nagar, Karimnagar.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above.Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 158 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mrs. Kandi Swetha & Others**

**... Opponents**

2. Mr. Kanamathareddy Chandra Shekar Reddy, S/o, Ramreddy, Age:41 Yrs, Occ: Private Employee, H.No: 1-4-84, Golden Towers, Flat No-602, Street No-8, Habsiguda, Secundrabad.
4. Mr. Sadula Sai Charan Reddy, S/o. Ravinder Reddy, Age:33 Yrs,Occ: Private Employee, H.No: 4-2-184, Dasariwada, Kothur, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 159 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Mohammad Subhanoddin & Others**

**... Opponents**

5. Mr. Alakaraju. Ravi, S/o, Cheralu, Age:41 Yrs, Occ: Private Employee, H.No: 5-11-503,504/E/F-1,2&3, B-Block, 1stFloor, Kandakatla Gateway, KUC XRoad, Hanamkonda.
6. Mr. Thoutam. Shiva Kumar, S/o, Lingamurthy, Age: 36 Years, Occ: Private Employee, H.No: 5-11-503, 504/E/F-1,2&3, B-Block, 1st Floor, Kandakatla Gateway, KUC XRoad, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 160 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Gopu Pradeep Reddy & Others**

**... Opponents**

1. Mr. Gopu Pradeep Reddy, S/o, Sammireddy, Age: 29 Yrs, Occ: Private Employee, H.No:17-4-488, Thilaknagar,Godavarikhani.
2. Mrs. Gopu Vasantha, W/o, Sammireddy, Age: 50 Yrs,Occ:Private Employee, H.No: 17-4-488, Thilaknagar,Godavarikhani.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 129 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mrs. Syed Asma & Others**

**... Opponents**

1. Mrs. Syed Asma, W/o, Saleem, Age: 37 Years, Occ: Business, H.No: 11-23-288/A, L.B. Nagar, Warangal.
2. Mr. Syed Kaleem, S/o, Yusuf, Age: 57 Years, Occ: Private Employee, H.No: 11-24-324, Pochammaidan, Warangal.
3. Mr. Arutla Sheshachary, S/o, Narayana Chary, Age: 51 Years, Occ: Principal, O/o. Govt.Junior College, Khanapur, H.No: 13-4-155, Gopalswamy Temple, Warangal.
4. Mr. Kogila Vijay Kuamr, S/o, Sambaiah, Age: 46 Years, Occ: Principal, O/o. Govt Jr. College, Wazeedu, H.No: 5-11-113, Naimnagar,Hanamkonda.
5. Mr. Mohammed Sadiq Ali, S/o, Mahabuba Ali, Age: 51 Years, Occ: SA, O/o. ZPSS Parvathagiri, H.No: 11-21-137/1, Madina Street, Thilak Road, Kashibugga, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M**. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 148 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Smt. Vatte Jaya Sree & Others**

**... Opponents**

3. Mr. Bandari Narayana, S/o.Mallaiah, Age:57 Yrs,Occ:Telecom Technician, O/o. BSNLOffice, Warangal, H.No: 6-36/1, Gollapally, Ambala, Kamalapur, Hanamkonda.
1. Mr. Sirivella Rajashekar, S/o, Kashaiah, Age:46 Yrs, Occ: Asst.Telecom Technician, O/o. BSNL Office, Warangal, H.No: 1-18-1212, Vivekananda Colony, Road No-2, Kashibugga, Warangal.
2. Mr. Mohammed Abdul Sattar, S/o, Yakub Ali, Age:60 Years, Occ:Jr. Engineer, O/o. BSNL Office, Warangal, H.No: 3-10-150, Reddy Colony, Hanamkonda, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M**. Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 149 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mrs. Puli Srilatha & Others**

**... Opponents**

2. Mr. Puli Ravinder, S/o, Ramaswamy, Age: 58 Yrs, Occ: MTS, O/o: Hanamkonda Head Post Office, H.No: 7-2-141, Machili Bazar, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on.**11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 151 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Singapuram Prem Kumar & Others**

**... Opponents**

3. Mr. Shilam Rajashekar, S/o, Mallaiah, Age:59 Yrs, Occ: Tech Trade-I, O/o. SCR Secundrabad Division, H.No:4-2-240, Kothur, K.U.Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 152 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Chemmala Anil & Others**

**... Opponents**

2. Mr. Enugala Ajay, S/o, Jampaiah, Age: 29 Yrs, Occ: Private Employee, H.No: 103-291/A, Laxmipuram, Warangal.
4. Mr. Alupula Tharun, S/o, Rajanna, Age: 38 Yrs, Occ: Private Employee, H.No: 1-19, Pegadapally, Hasinparthy, Hanumakonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 153 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Garrepelly Govardhan & Others**

**... Opponents**

3. Mr. Kandkatla Sadanandam, S/o, Komuraiah, Age:58 Yrs,Occ: Business, H.No: 2-558, Indiranagar, Narsampet,Warangal.
4. Mr. Eeka Venkateshwarlu, S/o, Narsaiah, Age:56 Yrs, Occ: Jr.Assistant, O/o.Girijana Co-Operative Corporation Ltd, Eturnagaram, H.No: 3-13/1, Ramaram, apaonugondla, Kothagudem.
6. Mr. Thimmapuram Raju, S/o, Gopal, Age:41 Yrs, Occ: Business, H.No: 1-172, Go palpuram, Duggondi, Warangal.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT WARANGAL**

**ARB.NO. 154 of 2025**

Between:

**KANAKADURGA CHIT FUNDS PRIVATE LIMITED., KU X ROAD Branch**

**... Disputant**

AND

**Mr. Sarvvu Sadanandam & Others**

**... Opponents**

2 Mr. Yedla Murali, S/o, Mogilaiah, Age: 44 Yrs, Occ: Business, H.No: 4-6-137, Reddy Colony, Hanamkonda.

3 Mr. Gurrapu Sridhar, S/o, Venkateshwarlu, Age: 46 Yrs, Occ: Private Employee, H.No: 4-1-154, Kothurjenda, Hanamkonda.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **11-09-2026** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

# ఏ క్షణంలోనైనా ఇరాన్‌పై మళ్ళీ దాడి: ట్రంప్

- హోర్ముజ్ జలసంధికి నాపేరే పెడతా
- జలసంధి మా అధీనంలోనే ఉంది
- ఇరాన్ దాడుల్లో ఇద్దరు సౌదీ నావికులు మృతి
- పౌర ప్రాంతాలపై దాడులకు ఇరాన్ ఖండన

**వాషింగ్టన్:** ఏ క్షణంలోనైనా ఇరాన్‌పై మరోసారి దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా హెచ్చరిక చేశారు.దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్ళీ తీవ్రరూపం దాల్చాయి. మంగళవారం రాత్రి అమెరికా సైన్యాలు ఇరాన్‌పై వైమానిక దాడులు చేశాయి. ఈ దాడుల సమయంలో హోర్ముజ్ జలసంధిలో నౌకలకు సెంట్‌కామ్ దళాలు ఎస్కార్ట్‌గా వెళ్ళాయి. వాటికి పూర్తి భద్రత ఇచ్చాయి. ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేసింది.అమెరికా చేసిన దాడులవల్ల దక్షిణ ఇరాన్‌లోని ఒక వివాహ వేదికకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ దాడులవల్ల వివాహ మండపంలో నలుగురు మరణించారు. పదులసంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. తమ సైనికులను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిందని, అందుకే ఎదురుదాడులు చేశామని సెంట్‌కామ్ అధికారులు ప్రకటించారు. అమెరికా దాడులకు ప్రతీకారంగా బ్రహ్రెయిన్,కువైట్,జోర్డాన్ దేశాలలో అమెరికా స్థావరాలపై ఐఆర్‌జిసి సైన్యాలు దాడులు చేశాయి.ఇరాన్ చేసిన దాడుల్లో ఇద్దరు సౌదీ అరేబియా నావికులు మరణించినట్లు ఆ దేశం ప్రకటించింది.

కాగా హోర్ముజ్ జలసంధి తమ అధీనంలోనే ఉందని ట్రంప్ బుధవారం ప్రకటించారు. జలసంధికి 'ట్రంప్ జలసంధి' అని నామకరణం చేద్దామని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ఆయన ప్రతిపాదన చేశారు. బుధవారం తెల్లవారకముందుగానే ఇరాన్ రాడార్ వ్యవస్థలపై దాడులు చేశామని ట్రంప్ కొత్త సమాచారం చెప్పారు.ఈ దాడులను ''మైనర్ లవ్ టాప్''గా ఆయన అభివర్ణించారు.

### క్రూరమైన యుద్ధనేరం: ఇరాన్

ఇరాన్‌లోని పలు రాష్ట్రాలలోని పౌర ప్రాంతాలు, మౌలిక సదుపాయాలపై అమెరికా సైన్యాలు చేసిన దాడులను ''క్రూరమైన యుద్ధనేరాలు''గా ఇరాన్ పేర్కొంది. సెంట్‌కామ్ చేసిన దాడులను ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఆత్మరక్షణకోసం ప్రతీకార దాడులు చేసే హక్కు ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు ఉందని పునరుద్ఘాటించింది. హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో ఒక వివాహ వేడుకపై అమెరికా దాడులు జరిగాయి. ఈ వేడుకలలో నలుగురు మరణించారు. 70 మంది గాయపడ్డారు. ఏడాదిన్నరకాలంలో మినాబ్, లామెర్డ్‌లలో అమెరికా–ఇజ్రాయెల్ చేసిన దారుణాలను ఈ ఘటన గుర్తుకుతెస్తోందని, తమ పౌరులకు నష్టం జరిగిందని, అందుకే ప్రతీకార దాడులు చేశామని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. ఖుజెస్థాన్, సిస్థాన్, బలూచిస్థాన్, హోర్ముజ్‌గాన్, కెర్మాన్ రాష్ట్రాలలో పౌర ప్రాంతాలపై అమెరికా దాడులు చేసింది. ఈ దాడుల ద్వారా ఇరాన్ సార్వభౌమాధికారాన్ని,ప్రాదేశిక సమగ్రతను మరోసారి ట్రంప్ యంత్రాంగం ఉల్లంఘించిందని ఇరాన్ మండిపడింది.ఇలాంటి ఘోర నేరాలను అరికట్టేందుకు ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌కు, భద్రతామండలికి ఉన్న అధికారాలను గుర్తుచేసింది.

# వరద భయం వేళ...టిబెట్‌లో భూకంపం

- నేపాల్–చైనాలో ఇంకా జాడలేని 4,700 మంది
- ఇప్పటివరకూ 1,252 మృతదేహాలు స్వాధీనం
- 12 వేలమందిని కాపాడిన సహాయబృందాలు
- జెసిబిలతో బండరాళ్ళు, శిథిలాల తొలగింపు
- బిదూర్ స్కూలు పునర్నిర్మాణానికి భారత్ హామీ



**కాఠ్మండు:** నేపాల్–చైనా సరిహద్దుల్లో మళ్ళీ వరదలు వస్తాయన్న భయాలమధ్య టిబెట్‌లో గురువారం భూకంపం సంభవించింది. రిచ్‌టర్ స్కేలుపై ఈ భూకంపం తీవ్రత 5.1గా నమోదైనట్లు జర్మనీ రీసెర్చ్ సెంటర్ ప్రకటించింది. ఒక వైపు సహాయ చర్యలు కొనసాగుతున్న సమయంలో పది కి.మీ లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు రీసెర్చ్ సెంటర్ పేర్కొంది.


ఇదిలాఉండగా, తొమ్మిదిరోజులక్రితం (ఆగస్టు 26) జరిగిన హిమాలయన్ సునామీ ఘటనలో ఇరుదేశాల సరిహద్దుల్లో ఇంకా 4,700 మంది జాడ తెలియరాలేదు. సునామీలో గల్లంతైనవారి సంఖ్య టిబెట్ వైపు కంటే నేపాల్‌లోనే ఎక్కువగా ఉంది.ఒక్క నేపాల్‌లోనే ఇంకా జాడ తెలియని ప్రజలసంఖ్య 4,216 గా తేలిందని ఎన్‌డిఆర్‌ఆర్ఎంఎ (జాతీయ ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ అథారిటీ) అధికారులు చెప్పారు. ఇప్పటివరకూ 1252 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క చిత్వాన్‌లోనే అత్యధికంగా 348 మృతదేహాలను బురదమట్టిలోంచి వెలికితీశారు. ఈ వరదల్లో 583 మంది విదేశీయులు, 86మంది ప్రభుత్వసిబ్బంది,భద్రతా సిబ్బంది,164 మంది నేపాలీ పర్యాటకులు ఈ వరదల్లో మరణించారు. వారంతా సునామీలో కొట్టుకుపోయారు. ఇప్పటికీ 4,216 మృతదేహాలు కనిపించడంలేదు. వాటి కోసం తీవ్ర గాలింపు చేస్తున్నారు. కాగా సహాయ చర్యలు చేపట్టిన సైనికులు,ఇతర పౌర సహాయ బృందాలు భోటేకోశీ నది వరదల్లో చిక్కుకున్న 11,993 మందిని గడచిన తొమ్మిది రోజులుగా బురదమట్టిలోంచి వెలికితీసుకుచ్చి ప్రాణాలు కాపాడినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సహాయచర్యల్లో 21,314 మంది పాల్గొటున్నారు. వీరిలో 9.199 మంది సైనికులు, 7,912 మంది పోలీసులు,4,203 మంది సాయుధ పోలీసులు ఉన్నారు.నేపాల్ సైనికులు గడచిన తొమ్మిదిరోజుగా 690 సార్లు గగనతలంలో తిరిగి గాలింపులు కొనసాగించారు. కృష్ణభీర్ వద్ద పృథ్వీ జాతీయ రహదారిపై కొండచరియలు కుప్పకూలి మార్గం మూసుకుపోవడంతో కాఠ్మండు నగరానికి ఎల్‌పిజి వంటగ్యాస్ సరఫరాలు నిలిచిపోయాయి.16 పరిశ్రమలు గ్యాస్ సరఫరాకు కసరత్తు చేస్తున్నాయి. ఇదిలా ఉండగా గురువారంనాడు కూడా భోటేకోశీ నదికి వరద నీటి ప్రవాహం ఇంకా పెరుగుతూనే ఉంది. దీనివల్ల త్రిశూలీ నదిలో కూడా నీటిమట్టం గణనీయంగా పెరిగేఅవకాశం ఉంది. ఈ నది రసువా,నువాకోట్ జిల్లాలమీదుగా ప్రవహిస్తుంది. ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు వెళ్ళాయి.

నేపాల్‌లో నిర్మిస్తున్న వివిధ జలవిద్యుత్ ప్రాజెక్టులలో సొరంగాలలో పనిచేస్తున్న దాదాపు 900 మంది కార్మికులు గల్లంతయ్యారు. మరోవైపు నేపాల్‌లో పునర్నిర్మాణ చర్యలు,శిథిలాలను తొలగించే చర్యలను వేగవంతం చేశారు.టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థలను పునరుద్ధరించే చర్యలు ముమ్మరం చేశారు. వీధుల్లో,నదుల్లో భారీ మందాన పేరుకుపోయిన బండరాళ్ళు,శిథిలాలు,మట్టిని తొలగించేందుకు పెద్ద సంఖ్యలో జెసిబి యంత్రాలతో పనులు చేస్తున్నారు. కొన్ని చోట్ల 60 మీటర్ల మేరకు మట్టి,బండరాళ్ళు పేరుకుపోయాయి.మంచుఖండం విరిగి నదుల్లో పడటంతో 180 కి.మీ వేగంతో దారితప్పి గ్రామాల్లోకి దూసుకువచ్చిన జలప్రవాహం కారణంగా గ్రామాలు కొట్టుకుపోయాయి. ఇప్పుడు కొంత పరిస్థితి మెరుగుపడటంతో గ్రామీణ ప్రజలు తమ తమ సామాన్లకోసం వెదకులాట ప్రారంభించారు. 20,000 ఇళ్ళను దెబ్బతిన్న ఏడు జిల్లాల్లోని తీర ప్రాంతాల గ్రామాలలో,పట్టణాలలో పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని నేపాల్ ప్రభుత్వం ప్రకటించింది.అదేవిధంగా బిదూర్‌లో ఉన్న త్రిభువన్ త్రిశూలీ సెకండరీ స్కూలును పూర్తిగా పునరుద్ధరించి ఇస్తామని భారత ప్రభుత్వం నేపాల్‌కు హామీ ఇచ్చింది. ఆ స్కూలుపై సునామీ విరుచుకుపడక ముందు అత్యవసర ఆదేశాలతో అప్పటికప్పుడు 900 మంది విద్యార్థులు చివరిక్షణంలో ప్రాణాలు కాపాడుకున్నారు. వారంతా హుటాహుటిన ఆ స్కూలు క్యాంపస్‌ను ఖాళీ చేసి వెళ్ళిపోయాక ఆ స్కూలు సునామీలో కొట్టుకుపోయింది. కాగా గిరాంగ్‌వైపు వెళ్ళే సరిహద్దు రహదారిని పునరుద్ధరించినట్లు చైనా ప్రభుత్వం గురువారం ఒక ప్రకటన చేసింది.

త్రిశూలీలో జెసిబిలను ఉపయోగించి ముమ్మరంగా శిథిలాలను తొలగిస్తున్నారు.అనేక ప్రాంతాలలో టెలికామ్ వ్యవస్థలను పునరుద్ధరించేందుకు మరమ్మతులు, లైన్ల నిర్మాణ కార్యక్రమాలు కూడా వేగంగా జరుగుతున్నాయి.ఇంకోవైపు మరణించిన తమ కుటుంబీకులకు బాధితులు సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించి సంతాపాలు ప్రకటించడానికి కూడా వారికి తగిన స్థలం లభించడంలేదు. కుటుంబీకులు మృతుల చిత్రపట్టాలు, లేదా మట్టితో చేసిన నమూనా బొమ్మలను ఎదురుగా పెట్టుకుని నివాళులు అర్పిస్తున్నారు.భోట్‌కోశి వరదల్లో మరణించిన తమ బంధువులకు పశుపతి ఆర్యఘాట్‌లో వందలమంది గడ్డితో బొమ్మలు తయారుచేసి వాటికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.వందలమంది బాధితుల ఇళ్ళుకూడా కొట్టుకుపోవడంతో వారికి నిలువ నీడ కూడా లేదు.

# బర్త్ టూరిజంపై ట్రంప్‌నకు మళ్ళీ కోర్టు షాక్!

### నిషేధ ఉత్తర్వుకు అడ్డుకట్ట




**మేరీల్యాండ్:** బర్త్ టూరిజంను నిషేధిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను మేరీల్యాండ్‌కు చెందిన జిల్లా న్యాయస్థానం అడ్డుకుంది. దీంతో ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గర్భం దాల్చిన మహిళలు అమెరికా వచ్చి అక్కడే ప్రసవాలు చేయడం ద్వారా తమ బిడ్డలకు అమెరికా పౌరసత్వం సంపాదించుకుంటున్నారని,ఈ విధమైన కుట్రలను అడ్డుకుంటామని వాదిస్తూ ''బర్త్ టూరిజం''ను నిషేధిస్తూ ట్రంప్ గతనెల ఆరో తేదీన (2026,ఆగస్టు 6) కొత్త ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వును నిలిపివేస్తూ మేరీల్యాండ్‌లోని అమెరికా జిల్లా కోర్టు న్యాయమూర్తి డెబొరాహ్ బోర్డ్‌మన్ తాత్కాలిక ఉత్తర్వు జారీ చేశారు.వలస కుటుంబాలు,అడ్వకసీ గ్రూపులు ఒక పరిష్కారం కోరుతూ మేరీల్యాండ్ జిల్లా కోర్టును ఆశ్రయించాయి. ఈ కేసు పూర్తిగా పరిష్కారమయ్యేవరకూ ఈ ఉత్తర్వు అమలులో ఉంటుంది. న్యాయమూర్తి బోర్డ్‌మన్‌ను డెమోక్రటిక్‌పార్టీకి చెందిన అధ్యక్షుడు జో బైడెన్ నియమించారు. పుట్టుకతో పిల్లలకు అమెరికా పౌరసత్వం ఉంటుందని ఆమె తన ఉత్తర్వులో ఉద్ఘాటించారు. 1868లో 14వ రాజ్యాంగ సవరణ ద్వారా అమెరికా కాంగ్రెస్ ఈ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. అప్పటినుండి ఇది ఒక సంప్రదాయబద్ధమైన హక్కుగా చెలామణీ అవుతోంది. వలస ప్రజలను అడ్డుకునేందుకు ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా బర్త్ టూరిజంను ఆయన అడ్డుకున్నారు.కానీ ట్రంప్ ఉత్తర్వుకు అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేదని సుప్రీంకోర్టు గడచిన జూన్ నెలలో తీర్పు చెప్పింది.ఇప్పుడు మేరీల్యాండ్ కోర్టు కూడా అదే బాటలో ట్రంప్ ఉత్తర్వును అడ్డుకుంది. అమెరికా విదేశీ రాయబార కార్యాలయాలలో పనిచేసే సిబ్బంది,సంబంధిత సంస్థలకు చెందిన కుటుంబాలకు, అమెరికా శత్రువులుగా ప్రకటించిన విదేశీయులకు బర్త్ టూరిజం నిషేధాన్ని ట్రంప్ వర్తింపజేశారు.అమెరికా గడ్డపై బిడ్డకు జన్మనివ్వాలనే ఉద్దేశంతో నాన్–ఇమ్మిగ్రెంట్ వీసాపై అమెరికాకు వచ్చే గర్భిణులను బర్త్ టూరిస్టులుగా అభివర్ణిస్తూ ట్రంప్ యంత్రాంగం ఈ ఉత్తర్వు తెచ్చింది.

# ఎన్నికలకు వెనిజులా సిద్ధంగా లేదు: ట్రంప్



**వాషింగ్టన్ :** ఎన్నికలకు వెనిజులాదేశం ఇంకా సిద్ధంగా లేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి ఇంకా చాలా సమయం అవసరం అవుతుందని చెప్పారు. వెనిజులా ఎన్నికలకు ఒక ఖచ్చితమైన తేదీని ప్రకటించాలని ఎందుకు అడగడంలేదని పాత్రికేయులు ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్‌ను ప్రశ్నించినప్పుడు, ''మీకు తెలుసుకదా, వారికి ఇంకా సమయం అవసరం, ఇది చాలా కొత్త విషయం'' అన్నారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో వెనిజులా అధ్యక్ష భవనంపై అమెరికా ప్రత్యేక దళాలు దాడిచేసి ఆపరేషన్ నిర్వహించాయి. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్‌లను కిడ్నాప్‌చేసి అమెరికాలో ఒక జైలులో బంధించారు. ట్రంప్ అనుకూల ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను తాత్కాలిక అధ్యక్షురాలుగా నియమించారు. వెనిజులా ప్రభుత్వం తమ కనుసన్నల్లోనే పనిచేస్తుందని ఆనాడు ట్రంప్ ప్రకటించారు. ''మేం వెనిజులాను నియంతృత్వం నుండి విముక్తిచేశాం, ప్రజాస్వా మ్యం వైపు నడిపిస్తున్నాం, వారికి కొంత సమయం కావాలి, వారు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారని నేను అనుకోవడంలేదు,మేం ఆ ప్రభుత్వంతో చాలా బాగా కలిసిపోతున్నాం'' అన్నారు. అదేవిధంగా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై ప్రశంసలు కురిపించా రు. ఆమె బాగా పనిచేస్తున్నారని, అత్యంత గౌరవనీయురాలని అ న్నారు. ఆమెకు ఎన్నికలు కావాలి, కానీ ఇంకా సమయం అవసరం అన్నారు.





## ఒరిజినల్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

చార్మినార్ వద్ద షాపింగ్‌కు వస్తారని గుర్తు చేశారు. పాత బస్తీలోని ప్రతి గల్లీ, అణువణువు తనకు తెలుసునని స్పష్టం చేశారు. చంచల్‌గూడ జైలు నుంచి సంతోష్ నగర్‌లోని యాదగిరి థియేటర్ వరకు 3.32 కిలోమీటర్ల పొడవుతో రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన నాలుగు లేన్‌ల సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహ్మద్ అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్, ఎంపిలు అసదుద్దీన్ ఓవైసీ, అనిల్ కుమార్ యాదవ్, రఘువీర్‌రెడ్డితో ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంతరావు, వేం నరేందర్ రెడ్డి, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బాలాల, నవీన్ యాదవ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ఫ్లైఓవర్‌కు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సిఎం, పరిశీలించి, జిహెచ్‌ఎంసి అధికారుల నుంచి ప్రాజెక్టు వివరాలు సిఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం వంతెనకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకుందే తప్ప నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని తీవ్రంగా విమర్శించారు. 'ఎంపి అసదుద్దీన్ ఒవైసీ కోరిన అభివృద్ధి పనులన్నింటినీ మంజూరు చేయాలని వేదికపై నుంచే అధికారులను ఆదేశిస్తున్నాను. ఎమ్మెల్యే అహ్మద్ బలాలా కళాశాల అభివృద్ధికి రూ. 20 కోట్లు అడిగితే, రూ. 25 కోట్లు మంజూరు చేస్తున్నాం' అని సిఎం ప్రకటించారు. మీరాలం చెరువుపై 3 కిలోమీటర్ల మేర కేబుల్ బ్రిడ్జి నిర్మాణం వేగంగా జరుగుతోందని, నాగోల్ నుంచి ఎల్.బి.నగర్, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్ మీదు గా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను విస్తరిస్తున్నామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు మార్గాన్ని పూర్తి చేసి, అదే మెట్రోలో వచ్చి ఓట్లు అడుగుతామని చెప్పారు.

### నిధులు మంజూరు చేసిన సిఎంకు ధన్యవాదాలు: ఎంపి అసదుద్దీన్ ఒవైసి

హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బ్రిడ్జికి శంకుస్థాపన చేసినా నిధులు కేటాయించలేదని విమర్శించారు. కాంట్రాక్టర్‌కు పని ఆపేయమని కూడా చెప్పిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సిఎం కాగానే నిధులు మంజూరు చేసి, ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తెచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పాతబస్తీలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, చార్మినార్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ స్థలాన్ని కేటాయించి, పాతబస్తీలో వారానికి ఒకరోజు నైట్ మార్కెట్‌కు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నగరంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేక 'యాంటీ మర్డర్ సాక్వాడ్' ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణలో మతపరమైన విభేదాలు పెరగకూడదని, రాష్ట్ర శాంతి, అభివృద్ధి కోసమే తమ మద్దతు కొనసాగుతుందని అసదుద్దీన్ ఓవైసీ స్పష్టం చేశారు.

మూసీ రివర్ ఫ్రంట్ను అభివృద్ధి చేసి రాత్రివేళ ఆర్థిక కార్యకలాపాలను (నైట్ ఎకానమీ) ప్రోత్సహిస్తామని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి ద్వారా నైట్ ఎకానమీ ప్రోత్సాహం, పేద ముస్లింలకు ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. గంగా, యమునా రివర్ ఫ్రంట్లకు మద్దతు తెలిపిన బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు మూసీ రివర్ ఫ్రంట్ విషయంలో మాత్రం విమర్శలు చేస్తున్నాయని సిఎం ఆరోపించారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. హిందూముస్లింలు కలిసి నడిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, పాతబస్తీలో సోదరీమణులు ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు కావాలని ఆకాంక్షించారు.

## విస్తరణ?

(మొదటి పేజీ తరువాయి)

అమలులోకి వస్తుందని గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వెంటనే సచివాలయంలోని 4వ అంతస్తులోని మంత్రి కొండా సురేఖ ఛాంబర్‌ను ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా కొండా సురేఖ మంత్రి పదవి ఖాళీ కావడంతో బిసి సామాజికవర్గం నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న నేతలు, అదే విధంగా మంత్రివర్గంలో మరో ముగ్గురికి అవకాశం ఉన్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వివిధ సామాజికవర్గ నేతలలో కూడా మంత్రి పదవులపై ఆశలు చిగురించాయి.

### ఆ ముగ్గురికి మంత్రి పదవి?

మంత్రి వర్గ విస్తరణలో భాగంగా బిసి సామాజికవర్గం నుంచి టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌగ్‌కు, ఎస్‌సి సామాజికవర్గం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, రెడ్డి సామాజిక వర్గం నుంచి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవులు దక్కే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాగా ఈ నెల 7వ తేదీ నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో వెంటనే మంత్రివర్గ విస్తరణ చేపడుతున్నట్లు తెలిసింది. ఆ ముగ్గురికి మంత్రివర్గంలో చోటు కల్పించి శాఖలు కేటాయిస్తే అసెంబ్లీలో ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం బలంగా ఇవ్వొచ్చనే అభిప్రాయంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా మంత్రిపదవులు దక్కుతాయని ప్రచారం జరుగుతున్న ఈ ముగ్గురు నేతలు కూడా మంత్రి పదవి కోసం హస్తినలో గత కొద్దిరోజుల నుంచి అధిష్టానం వద్ద పైరవీ చేసుకుంటున్నట్లు కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

### ఇంకా ఒక కేబినెట్ బెర్త్ ఖాళీ

ప్రస్తుతం సిఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో మొత్తం 14 మంది మంత్రులుగా కొనసాగుతున్నారు. సిఎంతో కలిసి ఆ సంఖ్య 15 అవుతుంది. తాజాగా కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడంతో ఆ సంఖ్య 14కు చేరింది. ఒక వేళ గడ్డం ప్రసాద్, మహేశ్ కుమార్ గౌడ్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేస్తే మంత్రుల సంఖ్య 17కు చేరుతుంది. ఇంకా ఒక కేబినెట్ పోస్టు మిగిలి ఉంటుంది. ఆ మిగిలిన ఒక మంత్రి పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

## ప్రమాదంలోకి ప్రపంచ దేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థికవ్యవస్థలను,సమాజాలను పెద్ద దెబ్బతీయగల సామర్థ్యం ఈ ఎల్‌నినోకు ఉందని డబ్ల్యుఎంఓ సెక్రటరీ జనరల్ సెలెస్ట్ సౌలో చెప్పారు. వర్షపాతంలో తీవ్రమైన మార్పులు వస్తాయని చెప్పారు.ఆగ్నేయ ఆసియా,మధ్య అమెరికా,దక్షిణ అమెరికాలోని ఉత్తర ప్రాంతాలలో చాలా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. దీంతో గురువారం నుండి పనామా కాలువ ద్వారా ప్రయాణం చేసే నౌకల సంఖ్యను పదీశాతం మేరకు తగ్గించారు. ఈ కృత్రిమ కాలువ ద్వారా ప్రతి ఏటా 14,000 నౌకలు ప్రయాణం చేస్తాయి. ప్రపంచదేశాలకు ఈ జలమార్గం ఎంతో కీలకమైనది. కాగా బోట్స్‌వానా వంటి దక్షిణాఫ్రికాదేశాలు తీవ్ర కరువు ఎదుర్కొంటున్నాయి.పసిఫిక్ జలాలలకు వేల మైళ్ళ దూరం లో ఉన్న చైనా దేశానికి ఒక్క ఏడాదిలోనే ఏడు తుఫానుల ప్రమాదం ఉందని నిపుణులు అంచనావేస్తున్నారు.ఈ ఏడాది జులై నెలలోనే చైనా బావి–నౌల్–మైసాక్ అనే పేరుగల మూడు తుఫానులను ఎదుర్కొంది. తీవ్రనష్టాలకు గురైంది.ఆగస్టునెలలో డాల్ఫిన్ తుఫాను వల్ల 10 లక్షలమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చైనా ప్రభుత్వం తరలించాల్సి వచ్చింది. అనేక యూరప్‌దేశాలలో దావానలాగ్ని బీభత్సం సృ ష్టించింది. అదేవిధంగా తూర్పు ఆఫ్రికా, దక్షిణ బ్రెజిల్, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాం తాలలో వరద ప్రమాదాలు పెరుగుతాయి.

ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ప్రకృతి వైపరీత్యం. దీని ప్రభావంవల్ల లోలోతుల్లో ఉన్న నీరు కూడా గతంలో లేనివిధంగా వేడెక్కుతోంది. సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల ఎల్‌నినో ప్రమాదానికి సంకేతం.శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉన్న పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో జలాలు రెండు డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా వేడెక్కాయి. 1950వ దశకంనాటికంటే ఇది తీవ్రమైనది. ఈ ఉష్ణోగ్రతలు నాలుగు డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశాలున్నాయి. హిందూమహాసముద్రం, ఆస్ట్రేలియా తీరప్రాంతం, ఉష్ణ మండల అట్లాంటిక్‌లలో ఈ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియా తీర ప్రాంతాలలోని సముద్ర జలాల్లో జీవజాలం ఎంతో సమృద్ధిగా ఉంది. ఐతే ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల ఈ తీర ప్రాంతానికి ప్రమాదకరంగా మారింది.

## బర్తరఫ్ ఖండిస్తున్నా...

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ సిఎం రేవంత్ రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్ మెయిల్ చేశారు. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సిఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్‌డి సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపి వేం నరేందర్ రెడ్డి, సిఎం సోదరులు కొండల్ రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''రాజీనామా చేయాలని నన్నెవరూ అడగలేదు. నేనేం తప్పుచేయలేదు. నాకు పశ్చాత్తాపం లేదు. సిఎం రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించాను. భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదు. సిఎం రేవంత్ రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరైంది కాదు. నావైపు ఒక వేలు చూపితే రేవంత్ వైపు నాలుగువేళ్లు చూపుతాయి. ప్లాన్‌బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు'' అని కొండా సురేఖ అన్నారు. '''బర్తరఫ్ నిర్ణయానికి ముందు నా వివరణ తీసుకోవాల్సింది. నా కుమార్తె స్వతంత్ర మహిళ. ఆమె వ్యాఖ్యలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు? నా కుమార్తె వ్యాఖ్యలను నేను ఖండించాల్సిన అవసరం లేదు. ఆమె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుబట్టే అధికారం నాకు లేదు. కాంగ్రెస్ అధిష్టానానికి నేను ఇచ్చిన లేఖను మీడియాకు విడుదల చేస్తున్నా. టిపిసిసి నేత జగ్గారెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారు? నాపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నా'' అని సురేఖ అన్నారు. నా వల్ల ముగ్గురు బిసి మహిళలకు పదవులు రావడం సంతోషకరమన్నారు. నాకోసం చిన్నారెడ్డిపై వేటు వేయడం సరైంది కాదన్నారు.

### నేను తప్పు చేయలేదు

అవమానంగా భావించను నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారేనని, గతంలో రోశయ్య, జైపాల్ రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారని సురేఖ అన్నారు. 'మంత్రి పదవి నుంచి తనను తొలగించినందుకు నేనేమీ బాధపడడంలేదు. నేను తప్పుచేయలేదు. బర్తరఫ్‌ను అవమానంగా భావించడంలేదు. మేం ప్రజాబలం ఉన్న నాయకులం. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ, మీరు సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది'' అని సురేఖ అన్నారు.

### హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని, క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిదని కొండా సురేఖ సూచించారు. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలని, పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉందన్నారు. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పబోనని, పార్టీ తీరు మారాల్సిన అవసరముందన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలన్నారు.

### మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారు

''రాష్ట్ర మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారన్నారు. తన ప్రమేయం లేకుండానే తన శాఖల్లో నిర్ణయాలు తీసుకున్నారు. తన ఓఎస్‌డి సుమంత్‌ను సైతం తనకు తెలియకుండానే తప్పించారు'' అని సురేఖ తెలిపారు. ఈ మేరకు ఎఐసిసి అధ్యక్షులు, మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు రాసిన లేఖలను ఆమె మీడియాకు విడుదల చేశారు.

అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని, తన శాఖలోని అంశాలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని ఆమె లేఖలో ఆరోపించారు. అధికారులతో ఆయన సమీక్షలు నిర్వహించారని, అయినా తన బాధ్యతల నుంచి తప్పించుకోలేదని, ప్రజలకు, తన శాఖలోని ఉద్యోగులకు అందుబాటులో ఉన్నానని మె తెలిపారు. ఇటీవల జరిగిన పరిణామాలు, తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేసిన తీరు తీవ్రంగా బాధించిందన్నారు. దీని వల్ల కలిగిన పరిణామాలు, రాజకీయ ఒత్తిడి తనను తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని కొండా సురేఖ పేర్కొన్నారు.

# రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు



వచ్చే వన్డే ప్రపంచకప్ 2027 ఆడాలనుకుంటున్న రోహిత్ శర్మ భవితవ్యంపై ఊగిసలాట కొనసాగుతోంది. ఇంగ్లండ్ పర్యటనలో విఫలమైన అతడిని తప్పించి యశస్వీ జైస్వాల్‌కు అవకాశమిస్తారనే వార్తలు వినిపిస్తున్న వేళ.. ఇప్పటికిప్పుడు ఆ ముప్పేమి లేదనిపిస్తోంది. గురువారం బిసిసిఐ సమీక్షా సమావేశం అనంతరం సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ హిట్‌మ్యాన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మీరు చూసే ఉంటారు. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు అని సైకియా కామెంట్ చేశాడు. దాంతో.. ప్రస్తుతానికి వన్డే జట్టులో రోహిత్‌కు అవకాశముందనే విషయాన్ని చెప్పకనే చెప్పాడు బిసిసిఐ కార్యదర్శి. ఫామ్ పరంగా విమర్శలు ఎదుర్కొటున్న రోహిత్ శర్మకు మరో అవకాశం ఇవ్వాలని బిసిసిఐ భావిస్తోంది. వన్డేల్లో విధ్వంసక ఓపెనరైన హిట్‌మ్యాన్ ప్రపంచ కప్ సన్నాహక సిరీస్‌లో ఆడించాలని భారత బోర్డు అనుకుంటోంది. అనభవజ్ఞుడైన రోహిత్‌ను వెస్టిండీస్ పర్యటనలో ఆడించాలని వినతులు వస్తున్న వేళ.. బిసిసిఐ అందుకు సానుకూలంగా ఉందనిపిస్తోంది. తాజాగా సమీక్ష సమావేశం అనంతరం సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. 'మీరూ చూసే ఉంటారు. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు. మీకు ఇంతకంటే ఏం కావాలి. చివరి మ్యాచ్‌లో రోహిత్ శతకం సాధించాడు. అలాంటప్పుడు ఎందుకీ ఊహాగానాలు. మీరు అడిగే అనవసర ప్రశ్నలకు నేను బదులివ్వను' అని మీడియాతో అన్నాడు. అతడి మాటలను బట్టి.. స్వదేశంలో విండీస్తో వన్డే సిరీస్ స్క్వాడ్‌లో రోహిత్ ఉండడం ఖాయమనిపిస్తోంది.

వన్డే ప్రపంచకప్‌లో యశస్వీ జైస్వాల్‌కు అవకాశం ఇవ్వాలని చీఫ్ సెలెక్టర్ అగార్కర్, కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్మన్ గిల్ అభిప్రాయం వ్యక్తం చేయగా.. తాత్కాలిక కోచ్ వివిఎస్ లక్ష్మ ణ్, టి–20 సారథి శ్రేయాస్ అయ్యర్లు మాత్రం రోహిత్ ఉండాల్సిందేనని పట్టుపట్టారని సమాచారం. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో సిరీస్ మొదలవ్వనుంది. ఆపై టీమిండియాతో ఐదు టి–20 సిరీస్ ఆడనుంది కరీబియన్ టీమ్.



ఆసియా కప్‌లో మహిళా క్రికెట్‌లో

## భారీ విజయంతో సెమీస్‌లో భారత్

మహిళల ఆసియా కప్‌లో వరసగా రెండో విజయంతో భారత జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఓపెనర్ స్మృతి మంధాన(124) రికార్డు శతకం బాదేయగా.. దీప్తి శర్మ(3–9), శ్రీ చరణి(2–16)లు తిప్పేయగా హాంకాంగ్ చైనాను చిత్తు చేసింది టీమిండియా. హర్మన్‌ప్రీత్ సేన నిర్దేశించిన 194 పరుగుల ఛేదనలో ఆది నుంచి తడబడిన.. హాంకాంగ్ చైనా.. చివరకు 56 రన్స్‌కే కుప్పకూలింది. 137 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ సెమీస్ బెర్తును పట్టేసింది. ఆసియా కప్‌లో జోరు మీదున్న భారత జట్టు వరసగా రెండో విజయంతో గర్జించింది. తడబడినట్టు అనిపించినా ఈసారి టాప్ షోతో హాంకాంగ్ చైనాను బెంబేలెత్తించింది టీమిండియా. ఆకాశమే హద్దుగా చెలరేగిన ఓపెనర్ స్మృతి మంధాన (124: 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లు) రికార్డు శతకంతో బౌలర్లను హడలెత్తించింది. ఆపై స్పిన్ ద్వయం దీప్తి శర్మ(3–9), శ్రీ చరణి(2–16)లు తిప్పేశారు. వీరి స్పిన్ ధాటికి ప్రత్యర్థి బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఫలితంగా హాంకాంగ్ చైనా 56 పరుగులకే ఆలౌటైంది. అనుకున్నట్టే భారీ విజయంతో సెమీస్‌కు అర్హత సాధించింది టీమిండియా. నాకౌట్‌కు దూసుకెళ్లిన మొదటి జట్టు భారతే కావడం విశేషం. టాస్ ఓడిన భారత జట్టుకు షఫాలీ వర్మ(28)తో కలిసి శుభారంభమిచ్చింది స్మృతి మంధాన(124 64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లు). వీరిద్దరూ ఎడాపెడా బౌండరీలు బాదగా.. స్కోర్ బోర్డు పరుగులు తీసింది. దంచేస్తున్న షఫాలీని ఔట్ చేయగా.. 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 85 పరుగులు చేసింది టీమిండియా. దాంతో.. రెండొందలకుపైగా స్కోర్ ఖాయమనుకున్న వేళ ప్రతీకా రావల్(10), రీచా ఘోష్ (11), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(10)లు.. మరోసారి నిరాశపరిచారు.

## తుది పోరుకు తిలక్ సేన

ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో హైదరాబాదీ తిలక్ వర్మ కెప్టెన్సీలోని సౌత్ జోన్ ఫైనల్ చేరింది. బుధవారం ముగిసిన రెండో సెమీస్‌లో 7 వికెట్ల తేడాతో నార్త్ జోన్‌ను ఓడించింది. ప్రత్యర్థి నిర్దేశించిన 182 పరుగుల లక్ష్య ఛేదనను ఆ జట్టు 43.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగిన కెప్టెన్ తిలక్ (79 బంతుల్లో 8 ఫోర్లతో 51 నాటౌట్) అర్ధశతకానికి తోడు జగదీశన్ (43), రిక్కీ భుయ్ (42), స్మరణ్ (32 నాటౌట్) రాణించారు. చూడచక్కని షాట్లు ఆడిన తిలక్ స్పిన్నర్ల బౌలింగ్‌లో రివర్స్ స్వీప్, ప్యాడిల్ స్వీప్ షాట్లతో అలరించాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు చేరడం సౌత్‌జోన్‌కు ఇది 24వ సారి కావడం గమనార్హం. ఈనెల 6 నుంచి చెన్నై వేదికగా జరిగే ఫైనల్లో సౌత్ జోన్.. ఈస్ట్ జోన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

**టెస్టులే ఇష్టం: తిలక్...** భారత టి20 వైస్ కెప్టెన్‌గా ఉన్న తిలక్ వర్మ.. పరిమిత ఓవర్ల ఫార్మాట్లలోనే జాతీయ జట్టుకు ఆడుతున్నా తనకు టెస్టులంటేనే మక్కువ ఎక్కువన్నాడు. దులీప్ ట్రోఫీ సెమీస్ మ్యాచ్ ముగిశాక అతడు మాట్లాడుతూ.. 'నేను భారత జట్టుకు పరిమిత ఓవర్లలో ఆడతానని ఎప్పుడూ ఊహించలేదు. కానీ నాకు రెడ్ బాల్ క్రికెట్ ఆడటమంటేనే ఇష్టం. నా బలం ఎప్పుడూ టెస్టులే. ఐపీఎల్లో మెరుగైన ప్రదర్శన చేసి టీమిండియాలో టీ20 జట్టులోకి వచ్చా. కానీ అంతకంటే ముందు చాలా రోజులు నేను దేశవాళీలో రెడ్‌బాల్ క్రికెట్ ఆడా. టెస్టుల్లో జాతీయ జట్టుకు ఆడాలని ఉందని ఈ సందర్భంగా తిలక్ ఆశాభావం వ్యక్తం చేశాడు.



పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## దేశంలో తొలి రైల్వే మండలం

- ఫిన్లాండ దేశ రాజధాని:
  ది హేగ్
- 'యంగ్ ఇటలీ' స్థాపకుడు:
  మాజిని
- మహానది డెల్టా ఈ రాష్ట్రంలో ఉంది ?
  పశ్చిమ్ బంగల
- దేశంలోనే తొలి రైల్వే మండలంగా వాసికెక్కింది ఏది ?
  దక్షిణ రైల్వే
- అమ్మకపు పన్ను?
  పరోక్ష పన్ను
- కిందివాటిలో ఏది నీటిలో మునుగుతుంది?
  గాజు గోళీ
- స్త్రీ విద్యను ప్రోత్సహించినది?
  డల్హౌసీ
- రైలుమార్గాల నిడివి ఎక్కువగా ఉన్న రైల్వే జోన్ ఏది?
  ఉత్తర రైల్వే
- ఆర్యసమాజ స్థాపకుడు
  స్వామి దయానంద సరస్వతి
- తాన్ సేన్ ఈ చక్రవర్తి యొక్క ఆస్థాన గాయకుడు
  అక్బర్
- నీటిగడియారాన్ని కనిపెట్టింది:
  చైనీయులు
- వెల్లస్లీ ఇచట ఒక కాలేజీని స్థాపించాడు?
  కలకత్తా
- మురికివాడల సంఖ్య నానాటికి పెరిగిపోవుటకు కారణము?
  పట్టణీకరణ
- ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి రైలుమార్గం
  పుత్తూరు –రేణిగుంట
- సైన్యసహకార పద్ధతికి అంగీకరించిన పీష్వా
  రెండవ బాజీరావు
- రోమ్ నగరం ఈ నదీతీరాన నిర్మించబడింది:
  టైబర్
- రష్యా జపాన్ యుద్ధం:
  1905
- బ్లాక్ ఫారెస్టు పర్వతాలు గల దేశం
  జర్మనీ
- సర్ జాన్ షోర్ తర్వాత గవర్నర్ జనరల్‌గా వచ్చినవాడు?
  వెల్లస్లీ
- థగ్గులనే దారిదోపిడిగాంధ్రననణచినవాడు?
  బెంటింక్
- మహారాష్ట్ర కూటమిని ఏర్పాటు గావించినది?
  నానా ఫడ్నవీస్
- పీష్వా అనగా?
  మహారాష్ట్ర ప్రధానమంత్రి
- 'మహల్' అని పిలువబడే వ్యవస్థ ఇందులకు చెందినది?
  భూమిశిస్తు
- బాక్సైట్ నుండి తయారుచేయబడుతున్న లోహం:
  అల్యూమినియం
- రక్తనాళాలు గడ్డకట్టడాన్ని ఏమని పిలుస్తారు?
  త్రాంబోసిస్
- ఈ సముద్రంలో అత్యధిక లవణీయత గుర్తింపబడింది:



  మృత సముద్రం
- ప్రజాస్వామ్య ప్రభుత్వాలను ఎన్ని రకాలుగా విభజించవచ్చును:
  రెండు
- బ్రూనై దేశపు ప్రధాన ఆర్థిక వనరు:
  పెట్రోలియం
- ముస్లింలు తప్పనిసరిగా సామూహిక ప్రార్థనలు చేయవలసిన వారము ఏది?
  శుక్రవారం
- ప్రపంచంలో 'వరి' ఉత్పత్తిలో భారతదేశ స్థానం
  2వ స్థానం
- ప్రకృతి శక్తి కానిది ఏది?
  ప్రాజెక్టు
- ఆరోగ్యశ్రీ పథకం ఎప్పుడు ప్రారంభించబడింది?
  2004 మే 15
- పెన్సిళ్ళ ముళ్ళు తయారీలో ఉపయోగించే లోహం:
  గ్రాఫైట్
- ద్వీపకల్పంలో రెండో పెద్ద నది :
  కృష్ణా
- ప్రపంచపు కార్మాగారంగా పేర్గాంచింది:
  ఇంగ్లాండ్
- నాజీపార్టీ స్థాపకుడు:
  హిట్లర్
- యూదుల పవిత్ర నగరం :
  జెరూసలెం
- థేమ్స్ నది గల దేశం:
  ఇంగ్లాండ్
- ఉన్నినిచ్చే మెరినో జాతి గొర్రెలు గల దేశం:
  స్పెయిన్
- రైత్వారీ విధానాన్ని ఆంగ్లేయులు ఈ రాష్ట్రాలలో అమలుపరచారు?
  మద్రాసు, బొంబాయి
- సిపాయిల తిరుగుబాటు జరిగిన సంవత్సరం?
  క్రీ.శ. 1857
- అందరికన్న ముందుగా సైన్యసహకార పద్ధతికి అంగీకరించినది?
  హైద్రాబాద్ నిజాం
- సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టినది?
  వెల్లస్లీ
- కారన్ వాలీస్చే ఏర్పాటు చేయబడ్డ సంచార న్యాయస్థానాలు?
  నాలుగు
- న్యూ డీల్ విధానాన్ని ప్రవేశ పెట్టిన అమెరికా అధ్యక్షుడు:
  రూజ్వెల్ట్
- డానెద్రో ఈ దేశానికి స్వాతంత్ర్యం సంపాదించిపెట్టారు:
  బ్రెజిల్
- సూయజ్ కాలువను జాతీయం చేసినవాడు:
  నాజర్
- తక్కువ కెలోరిఫిక్ విలువ గల పదార్థం
  ఆవుపాలు
- శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతిని ప్రవేశపెట్టినది?
  కారన్ వాలిస్

## కార్మిక చట్టాల రక్షణకు పోరాటాలు




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు కరీంనగర్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో జరుగుతున్నాయని దీనికి సంబంధించిన పోస్టర్ గురువారం ఎన్‌టిపిసి గేట్ ఎదుట ఎఐటియుసి డిస్టిక్ జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కడారి సునీల్ మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కుల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు నాంసాని శంకర్, జిల్లా కోశాధికారి రెడ్డపాక లక్ష్మ ణ్, రామగుండం నగర అధ్యక్షులు అబ్దుల్ కరీం, కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు



**ప్రజాపక్షం /ఎల్కతుర్తి :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎఐటియుసి రాష్ట్ర మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఎఐటియుసి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్యంగా ఉద్యమాలు మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి గడ్డం రాజనర్సు, నాయకులు వేముల కృష్ణకర్, రామ్ ఎల్ల ప్రకాష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పల్లగుట్టను పరిరక్షించాలి : సిపిఐ




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ముస్తాబాద్ మండల గూడూరు నామాపూర్ మధ్య గల పల్లగుట్టను పరిరక్షించాలని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. గురువారం సిపిఐ కార్మిక భవనంలో పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు సోమ నాగరాజుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మైనింగ్ లీజుకు తీసుకునే ప్రయత్నం, తవ్వకాలను పలు గ్రామాల ప్రజలు ప్రజాపోరాటాల ద్వారా నిలిపివేయడం జరిగిందన్నారు. ఈ గుట్ట గూడూరు గ్రామానికి సహజ రక్షణగా స్థానిక పర్యావరణానికి ఆధారంగా ఉందని, గుట్టను పూర్తిగా తొలగిస్తే భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు పల్లె జీవజాలం వన్యప్రాణులు వృక్ష సంపదకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి అనుమతులను పరిశీలించి పల్లగుట్టను కాపాడాలని వారు కోరారు.

# కరీంనగర్‌లో కార్మికుల భారీ ప్రదర్శన

ఎర్రజెండాలు, ఎర్రచొక్కాలు, ఎర్రచీరలతో తరలిరావాలి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 6న కరీంనగర్‌లో నిర్వహించనున్న కార్మికుల భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ పిలుపునిచ్చారు. కార్మికులు ఎర్రజెండాలు, ఎర్రచొక్కాలతో, మహిళలు ఎర్రచీరలతో పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శన సర్కస్ గ్రౌండ్ వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభకు ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, జాతీయ కార్యదర్శి సి.శ్రీకుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తారని వెల్లడించారు. మహాసభల సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని అన్నిజిల్లాల నుంచి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు నిర్ణీత సమయానికి




కరీంనగర్ చేరుకుని భారీ ప్రదర్శనలో పాల్గొనాలని వారు కోరారు. కార్మికుల సమస్యలు, హక్కులపై నినదిస్తూ నిర్వహించే ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని యూసుఫ్, బాలరాజ్ పిలుపునిచ్చారు.

## 12 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అమానుషం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

**ప్రజాపక్షం/మావల :** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేస్తున్న కార్మికులకు 12 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం అమానుషమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చిలుకూరి లక్ష్మి గార్డెన్‌లో ఎఐటియుసి ప్రతినిధి బృందం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ కార్మికులకు తక్షణమే కనీసం 6 నెలల జీతాలు మార్కెట్ కమిటీ ద్వారా చెల్లించాలని విజ్ఞప్తి చేయగా, మార్కెట్ కమిటీ చైర్మన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్, ఉప ప్రధాన కార్యదర్శి గజేంగుల రాజు పాల్గొన్నారు.



## ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో శ్రీచైతన్య హైస్కూల్ వద్దు... జవహర్ నవోదయ విద్యాలయం ముద్దు అనే నినాదంతో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో అంబేద్కర్ సర్కిల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ జిల్లాకు ఒక్క జవహర్ నవోదయ విద్యాలయం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీ ఇంతవరకు నెరవేరలేదని విమర్శించారు. జవహర్ నవోదయ విద్యాలయానికి సరిపడు క్యాంపస్ ఆర్‌ఎఫ్‌సిఎల్‌లో ఉన్నందున, విద్యా వ్యాపారం చేసే పాఠశాలను తొలగించి, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అందుబాటులో ఉండే జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌టిపిసిలో సెయింటు క్లియర్ పాఠశాలకు అన్ని రకాలైన సౌకర్యాలను, వసతులను యాజమాన్యం కల్పిస్తుండగా, అక్కడ పదవ తరగతి చదివే విద్యార్థులకు ఆ పాఠశాల ఎన్‌టిపిసి విద్యార్థులకు రూ.25,263, నాన్ ఎన్‌టిపిసి విద్యార్థులకు రూ.38,340 ఫీజు వసూలు చేయడం జరుగుతుందని, ఆర్‌ఎఫ్‌సిఎల్ యాజమాన్యం శ్రీ చైతన్య పాఠశాలకు అన్ని రకాలైన సౌకర్యాలు, వసతులు కల్పిస్తే పదవ తరగతి విద్యార్థులకు రూ.70800, సెంట్రల్ టెక్నో ఆర్‌ఎఫ్‌సిఎల్ విద్యార్థులకు రూ.51300 ఫీజులను వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. అన్ని వసతులు కల్పించిన ఆర్‌ఎఫ్‌సిఎల్ యాజమాన్యం ఫీజుల విషయంలో స్పందించకపోవడం సరైన చర్య కాదన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు తడిగొప్పుల అనూప్ సాయి, గొడిసెల ప్రణీత్, అభిషేక్, శ్రావణ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీ పోస్టులు భర్తీచేయాలి

సిపిఐ ధర్నాలో మహ్మద్ సలాం డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని. ఆస్పత్రిలో వివిధ విభాగాలలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సిపిఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాతా శిశు కేంద్రంలో మందులు లేక పాత ఆసుపత్రికి వచ్చి గర్భిణీలు, బాలింతలు గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ల్యాబ్ టెక్నిషియన్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతులు కల్పించడంతో ఖాళీ పోస్టులను



వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె సైదా, నామా విజయ్‌కుమార్, ఎస్‌కె చానా, డి.శేఖర్ నాయక్, చిర్రా వెంకన్న, సిహెచ్ దుర్గానాథ్, భద్రం, ఎండి మజీద్, యాకూబ్, రెహ్మాన్, కరీం, పాండు, రాజు, శ్రీను, అక్బర్, రమణ తదితరులు పాల్గొన్నారు.



## డి.రాజాను కలిసిన సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా బృందం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1న నిర్వహించిన చలో ఢిల్లీ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వెళ్లిన సిపిఐ బృందం, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాను కలిసింది. ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో డి.రాజాను జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, రైల్వే లైన్, ఇండస్ట్రీయల్ కారిడార్ తదితర అంశాలపై డి.రాజా ఆరా తీసినట్లు సిపిఐ నాయకులు తెలిపారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎం.బాలనర్సింహ్మా, జిల్లా కార్యదర్శి ఎస్‌ఎన్‌డి ఫయాజ్, వి.రవీందర్, బి.శ్రీనివాసులు, పి.మల్లేష్, పి.కిరణ్‌కుమార్, బి. ప్రేమ్‌కుమార్, బండి వెంకటమ్మ, ఆంజనేయులు, పి.పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

## డిక్రీల అమలుకు పోలీసు రక్షణపై ఎస్‌ఒపి

### డిజిపికి హైకోర్టు సూచన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కింది కోర్టులు ఆదేశించినా డిక్రీల అమలుకు పోలీసు రక్షణ అందక కక్షిదారులు తిరిగి హైకోర్టును ఆశ్రయించడంపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంటే న్యాయపరిపాలనపై ప్రభావం పడుతుందని పేర్కొంది. డిక్రీల అమలుకు పోలీసు రక్షణ కల్పించే విషయంలో ఎస్‌ఒపి లేకపోతే రూపొందించే అంశాన్ని పరిశీలించాలని డిజిపికి సూచించింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం కొరటికల్‌కు చెందిన నల్లా వెంకటరెడ్డి సివిల్ కోర్టు డిక్రీ అమలుకు పోలీసు రక్షణ కోరగా, గత ఆదేశాలు అమలు కాలేదంటూ హైకోర్టును ఆశ్రయించారు. భూమికి కంచె వేసుకునే సమయంలో పోలీసు రక్షణ కల్పించాలని సింగిల్ జడ్జి ఆదేశించడాన్ని సవాల్ చేస్తూ పీసారి గోపయ్య అప్పీల్ దాఖలు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారించింది. కింది కోర్టు ఆదేశాల అమలుకు పోలీసులు సహకరించాలని, వారి పాత్ర ఆ ఆదేశాలకే పరిమితం కావాలని స్పష్టం చేసింది. ఎస్‌ఒపి రూపొందించే అంశాన్ని డిజిపి పరిశీలించాలని, వివరాలు సమర్పించాలని హోంశాఖ న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేసింది.

## రోడ్ల మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలి

### ఆర్అండ్‌బి అధికారుల సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా రోడ్ల మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రి గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న రోడ్లు, భవనాల పనుల పురోగతి, పెండింగ్ ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టాల్సిన పనులు, పనుల నాణ్యత, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సిన అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్అండ్‌బి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌తో పాటు సిఇలు బివి.రావు, ధర్మారెడ్డి, రాజేందర్, నర్సింగారావు, రాజేశ్వర్‌రెడ్డి, వనజ తదితర అధికారులు పాల్గొన్నారు.

## విద్యాశాఖలో 123 మంది ఉపాధ్యాయులకు 'పురస్కారాలు'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాశాఖలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం 'స్టేట్ టీచర్ అవార్డ్స్ 2026'ను గురువారం ప్రకటించింది.'సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం' సందర్భంగా విద్యాశాఖలోని వివిధ విభాగాల నుంచి ఎంపికైన మొత్తం 123 మంది ఉత్తమ అధ్యాపకులకు ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖలో 52 మంది, ఇంటర్మీడియట్ బోర్డులో 11 మంది, సాంకేతిక విద్యాశాఖ/ పాలిటెక్నిక్‌లో ముగ్గురు, విశ్వవిద్యాలయాలలో 28 మంది , అనుబంధ కళాశాలలు 29 మంది (ఒక ఫిజికల్ డైరెక్టర్, ఒక లైబ్రేరియన్ కూడా ఉన్నారు) అవార్డులను ప్రకటించారు. రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

## ముగ్గురు ఉన్నతాధికారులకు పురస్కారాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యా శాఖలో విశేషమైన సేవలందించిన ముగ్గురు ఉన్నతాధికారులకు రాష్ట్ర ప్రభుత్వం 'ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషనల్ అడ్మినిస్ట్రేషన్ 2026' పురస్కారాలను ప్రకటించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సాంకేతిక, కళాశాల విద్యా విభాగాల్లో అందించిన అసాధారణ సేవలకుగానూ రాష్ట్ర సాంకేతిక,కళాశాల విద్య కమిషనర్ ఎ. శ్రీదేవసేన, ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక విద్యార్థుల నమోదు సాధించినందుకుగాను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పాఠశాల విద్య,అకాడమిక్ లీడర్‌షిప్ సేవలకు ఎస్‌సిఇఆర్‌టి డైరక్టర్ జి.రమేష్‌కు పురస్కారాలను ప్రధానం చేయనున్నారు. రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

## తెలంగాణ క్రికెట్‌లో కీలక మలుపు.. అంబుడ్స్‌మన్ విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ క్రికెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బిసిసిఐ అంబుడ్స్‌మన్ రిటైర్డ్ జస్టిస్ అరుణ్ మిశ్రా ముందు వివాద పరిష్కార ప్రక్రియకు హైకోర్టు డివిజన్ బెంచ్ మార్గం సుగమం చేసింది. ఆగస్టు 14న సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. బిసిసిఐ రాజ్యాంగంలోని రూల్స్ 40, 41 ప్రకారం విచారణ కొనసాగించేందుకు అనుమతించింది. చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొయినుద్దీన్‌తో కూడిన బెంచ్ ఈ వ్యవహారాన్ని విచారించింది. తెలంగాణ క్రికెట్ పరిపాలనలో లోపాలపై క్రికెటర్లు గౌరవ్ శర్మ, నవరసన్ చేసిన ఫిర్యాదుల విచారణకు తాజా తీర్పుతో మార్గం ఏర్పడింది. తమది వ్యక్తిగత విజయం కోసం చేసిన పోరాటం కాదని, సమస్యలను సమర్థవంతమైన వేదికపై వినిపించాలన్నదే లక్ష్యమని గౌరవ్ శర్మ తెలిపారు. తెలంగాణ క్రికెట్‌కు పారదర్శకమైన, స్వచ్ఛమైన వ్యవస్థ అవసరమని నవరసన్ పేర్కొన్నారు. హైకోర్టు తీర్పుతో సంస్థాగత జవాబుదారీతనానికి బలం చేకూరిందని టిసిఎ జనరల్ సెక్రటరీ ధర్మ గురువారెడ్డి అన్నారు. ''ద్యూ ప్రాసెస్ గెలిస్తే.. క్రికెట్ గెలుస్తుంది'' అని వ్యాఖ్యానించారు. కీలక కంప్లయన్స్ అంశాలను అంబుడ్స్‌మన్ నిష్పక్షపాతంగా పరిశీలిస్తారని తెలిపారు. తాజా పరిణామంతో అంబుడ్స్‌మన్ తుది నిర్ణయంపై తెలంగాణ క్రికెట్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## నాగం వర్షిత్ రెడ్డి తల్లికి డి.కె. అరుణ పరామర్శ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి తల్లి శ్రీదేవిని మహబూబ్‌నగర్ ఎంపి డి.కె. అరుణ గురువారం సికింద్రాబాద్ యశోధ ఆస్పత్రిలో పరామర్శించారు. ఇటీవల నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై జరిగిన దాడి ఘటన అనంతరం గుండెపోటుకు గురైన ఆమె చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న అరుణ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని నాగం వర్షిత్ రెడ్డికి భరోసా ఇచ్చారు.

# రైతు సంఘాలతోనే రైతులకు అధిక లాభాలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతులు సమిష్టిగా సంఘటితమై రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పిఒలు)గా ఏర్పడితే అధిక లాభాలు పొందవచ్చాని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎఫ్‌పిఒల బలోపేతానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. గురువారం రైతు ఉత్పత్తిదారుల సంస్థల సదస్సు హైదరాబాద్‌లో జరిగింది.ఈ సదస్సును ఉద్దేశించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ముల్కనూరు సహకార సంఘం రైతుల సంఘటిత శక్తి ఇందుకు మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులే అధికంగా ఉన్నందున పంట ఉత్పత్తితో పాటు దానికి గిట్టుబాటు ధర లభించడం కూడా ముఖ్యమన్నారు. ఎఫ్‌పిఓల ద్వారా ఉత్పత్తులను సమిష్టిగా మార్కెటింగ్ చేయడం, సరైన సమయంలో విక్రయించడం, విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. రసాయనిక వ్యవసాయానికి బదులుగా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని మంత్రి సూచించారు. అధికంగా యూరియా వినియోగించడం వల్ల చీడపీడలు పెరగడంతోపాటు పురుగుమందుల అవశేషాల కారణంగా ఎగుమతుల్లో పంట ఉత్పత్తులు తిరస్కరణకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రియ పంటలకు బోనస్, సేంద్రియ ఎరువులకు అధిక సబ్సిడీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు.పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాముల నిర్మాణానికి కేంద్ర సహకారం కోరినట్లు మంత్రి చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ కె. సురేంద్ర మోహన్ మాట్లాడుతూ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖలను సమన్వయం చేసి ఎఫ్‌పిఓలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా నేడు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు శిక్షణ సదస్సు నిర్వహించినట్లు, దీనిని వ్యాపార అవకాశంగా మలచుకుని రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ ఎఫ్‌పీఓలు, ప్రాథమిక సహకార సంఘాలు, మహిళా సంఘాలకు కేంద్ర, రాష్ట్ర పథకాల అమలులో ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పంటల ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుకు సాంకేతిక శిక్షణ, చిన్న పరిశ్రమలకు నాబార్డు, బ్యాంకుల సహకారం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ ఎండి రాహుల్ రా జ్, నాబార్డు సిజిఎం ఉదయ భాస్కర్, తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ ఎండి అన్నపూర్ణ, ముల్కనూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండున్నరేళ్లలో సంక్షేమం–అభివృద్ధికి సమప్రాధాన్యం

### శ్యామ్ మోహన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో సంక్షే మం, ఉపాధి, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధికి సమ ప్రాధా న్యం ఇస్తోందని టిపిసిసి మేధో విభాగం చైర్మన్ ఎ.శ్యామ్ మో హన్ తెలిపారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైస్ చైర్మన్లు ఉన్నం సుబ్బారావు, ఎ.గౌతమ్, ఆర్.జనార్ధన్‌రెడ్డి, అజయ్, సభ్యుడు సలీంతో ఆయన కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా శ్యామ్ మోహన్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచి త బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.దీర్ఘకాలిక అభివృద్ధిలో భాగంగా తెలంగాణ రైజింగ్–2047, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఎఐ, హెల్త్, ఎడ్యుకేషన్, లైఫ్ సైన్సెస్ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. మూసీ పునరుజ్జీవనంలో మురుగునీటి శుద్ధి, కాలుష్య నియంత్రణ, వరదల నివారణ, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలని, పేద కుటుంబాలకు న్యాయబద్ధమైన పునరావాసం కల్పించాలని సూచించారు. మెట్రో, ఎంఎంటిఎస్, ఆర్‌టిసిని అనుసంధానించి సమగ్ర ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చే యాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు తక్షణ భరోసా కల్పిస్తే.. అభివృద్ధి భవిష్యత్ తరాలకు ఉపాధి, మౌలిక వసతులు, ఆర్థిక అవకాశాలను అందిస్తుందని ఆయనపేర్కొన్నారు. భారీ ప్రాజెక్టులపై నిపుణులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు, పౌర సమాజం భాగస్వామ్యంతో నిర్మాణాత్మక చర్చలు జరగాలన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాల్సిందే

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో గురువారం సచివాలయానికి చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకుని ఆయనతో పాటు పలువురు నాయకులను అరెస్ట్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మంది విద్యార్థుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేసేందుకు అపాయింట్‌మెంట్ కోరినా స్పందన రాలేదని రాంచందర్ రావు విమర్శించారు. సచివాలయం వద్ద బైఠాయించిన అనంతరం రాంచందర్ రావు, బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డితో పాటు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతం రావు, ఇతర నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, చిక్కడపల్లి, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని రాంచందర్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన బిజెపి నాయకులను అరెస్ట్ చేయడాన్ని శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఖండించారు. విద్యార్థుల సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. పోలీసుల నిర్బంధాలకు భయపడేది లేదని, రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలయ్యే వరకు బిజెపి ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.






## బిసి మంత్రిని బర్తరఫ్ చేయడం అన్యాయం

### కొండా సురేఖ బర్తరఫ్‌ను ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి మహిళా మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయడం అన్యాయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరిని విడనాడి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖ బర్తరఫ్‌ను వెంటనే ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా బిసిలతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ దళిత సామాజిక వర్గానికి చెందిన రాజయ్యను, బిసి సామాజిక వర్గానికి చెందిన ఈటల రాజేందర్‌ను మంత్రి పదవుల నుంచి తొలగించారని గుర్తుచేశారు. ఇలాంటి నిర్ణయాల వల్లే బిఆర్‌ఎస్ పార్టీ ప్రజల ఆగ్రహానికి గురై ప్రతిపక్షానికి పరిమితమైందని పేర్కొన్నారు. అదే తరహాలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బిసి మహిళా మంత్రిని బర్తరఫ్ చేయడం బాధాకరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశంపై పునరాలోచించి బర్తరఫ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. బిసిల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే, బిసిలను గౌరవించే సంప్రదాయాన్ని కొనసాగించాలని సూచించారు. కొండా సురేఖ విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బిసి మంత్రికి జరిగిన అన్యాయంపై రాష్ట్రవ్యాప్తంగా బిసిలు ఐక్యంగా ఉద్యమిస్తారని తెలిపారు.

## మహిళా కండక్టర్‌పై అసభ్యకర వార్త రాసిన విలేఖరిపై చర్యలు తీసుకోవాలి

### టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గద్వాల డిపోకు చెందిన మహిళా కండక్టర్‌పై అసభ్యకరమైన పదజాలంతో వార్త రాసిన విలేఖరిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆర్‌టిసి కండక్టర్లు ఎంతో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని విజయవంతం చేయడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి సిబ్బందిని కించపరిచేలా, ముఖ్యంగా మహిళా కండక్టర్‌ను అసభ్య పదజాలంతో విమర్శిస్తూ వార్త రాయడం సరికాదన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో కండక్టర్లు, డ్రైవర్లు, వికలాంగులు, వృద్ధులు, మహిళలు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సీట్లు కేటాయించడం సంస్థ నిబంధనల్లో భాగమని తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకోకుండా కండక్టర్ సీటుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం విలేఖరి అవగాహన లేమికి నిదర్శనమన్నారు. వాస్తవాలను తెలుసుకోకుండా సిబ్బందిపై బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలు చేయడం జర్నలిజం విలువలకు విరుద్ధమన్నారు. మహిళా కండక్టర్‌తో పాటు యావత్ ఆర్‌టిసి కండక్టర్ల ఆత్మగౌరవా న్ని దెబ్బతీసేలా వార్త రాసిన విలేఖరిపై పోలీసు కేసు నమోదు చేసి కఠిన చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా ఆర్‌టిసి యాజమాన్యం సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కొండా సురేఖ బర్తరఫ్ స్వయంకృతాపరాధమే : ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మంత్రి పదవి నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడం ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నా రు. పార్టీ, ప్రభుత్వం ఆమెకు అనేక అవకాశాలు ఇచ్చినా వాటిని సద్వినియోగం చేసుకోలేదని, కుటుంబ సభ్యులను అదుపులో పెట్టుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై పదే పదే విమర్శలు చేస్తూ పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపర్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. సిఎల్‌పి కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కొండా సురేఖ వ్యవహారశైలిపై సోనియా గాంధీ, రాహుల్ గాం ధీ, మల్లికార్జున ఖర్గే, కె.సి.వేణుగోపాల్ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే క్రమశిక్షణారాహిత్యాన్ని సహించకూడదనే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అధిష్టానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారంటూ కొండా సురేఖ చేస్తున్న ఆ రోపణలు అవాస్తవమని, రేవంత్‌రెడ్డికి అలాంటి అవసరం ఏముందని ప్రశ్నించారు. కొండా సురేఖతో పాటు సీనియర్ నేత చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తప్పించారని ఆది శ్రీనివాస్ తెలిపారు. చిన్నారెడ్డి ముఖ్యమంత్రికి అత్యం త ఇష్టమైన నాయకుడైనా, పార్టీకి నష్టం కలిగించే చర్యల విషయంలో ఎవరినీ ఉపేక్షించకూడదన్నదే రేవంత్‌రెడ్డి వైఖరి అన్నారు. పార్టీ, ప్రభుత్వాన్ని బలహీనపరిచే చర్యలను సహించవద్దని అధిష్టానం స్పష్టం చేసిందని చెప్పారు.

## సుబేదార్‌గంంజ్ యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పండుగలు, సెలవుల నేపథ్యంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సుబేదార్‌గంజ్–యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లతో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల మధ్య ప్రయాణించే వారికి అదనపు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. ప్రత్యేక రైలు నంబర్ 04135 సెప్టెంబర్ 11 నుంచి డిసెంబర్ 4 వరకు ప్రతి శుక్రవారం సుబేదార్‌గంజ్ నుంచి యశ్వంత్‌పూర్‌కు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక రైలు నంబర్ 04136 సెప్టెంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు ప్రతి సోమవారం యశ్వంత్‌పూర్ నుంచి సుబేదార్ గంజ్‌కు బయలుదేరుతుంది.

# 14 లోగా నీటి షెడ్యూల్ ఇవ్వకపోతే పాదయాత్ర

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వినాయక చవితి నాటికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వ నుంచి సాగునీటి షెడ్యూల్ విడుదల చేయకపోతే కోదాడ నుంచి హాలియా వరకు మరోసారి రైతాంగం కోసం పాదయాత్ర చేపడతానని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రభుత్వాని హెచ్చరించారు. గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని సుదీర్ఘంగా మాట్లాడారు. కెసిఆర్ పదేళ్ల పరిపాలనను, ప్రస్తుత వెయ్యి రోజుల దుష్ట పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ నీటి షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తే ప్రభుత్వానికి భయం పట్టుకుని ధర్నాను అడ్డుకోవాలని కుట్రలు చేశారని, కానీ అన్నింటినీ పటాపంచలు చేస్తూ వేలాది మంది రైతులు ఈ సభకు తరలివచ్చారని కొనియాడారు. కెసిఆర్ పరిపాలనలో తెలంగా ణ రాష్ట్రం దేశానికే అన్నపూర్ణగా, ధాన్య భాండాగారం గా ఆవిర్భవించిందన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాను తెలంగాణలోనే వరి పండించే విషయంలో ప్రథమ స్థా నంలో నిలిపిన ఘనత కెసిఆర్‌దేనని గుర్తుచేశారు. రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణగా పేరుగాంచిన పచ్చని మాగాణి మిర్యాలగూడలో నేడు రైతులు రోడ్డెక్కి ధర్నా చేయాల్సిన దుస్థితి రావడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. నీరు ఇస్తా రో ఇవ్వరో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొందని, మళ్లీ కెసిఆర్ గర్జిస్తేనే ప్రభుత్వం దిగివస్తుందనే నమ్మకం తో రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారని వ్యాఖ్యానించారు. గతంలో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ పేరిట ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, రూ.12 వేల రైతు భరోసా ఇస్తామని, మూడు పంటలకు నీరందిస్తామని, కౌలు రైతులకు రూ.12వేల రైతుబంధు ఇస్తామని, ప్రతి పంటకు వరి, మొక్కజొన్న, పత్తికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన మాటలను ఈ సందర్భంగా డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించి చూపించారు. గతంలో కెసిఆర్ చెప్పినట్లుగానే నేడు రైతులు యూరియా కోసం చెప్పులు లైన్లలో పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాంరాం అవుతుందని, దళితబంధు పోతుందని రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను కూడా ఈ సందర్భంగా స్క్రీన్‌పై ప్రదర్శించారు. రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు మూడు సార్లు రైతుబంధును ఎందుకు అడ్డుకున్నారో, బోనస్ ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశమంతా వదిలించుకున్న దరిద్ర పరిస్థితిని రాష్ట్రంలో తెచ్చి పెట్టుకున్నామని వ్యాఖ్యానించారు. నీళ్లు ఇవ్వమని డిమాండ్ చేస్తే సిఎం రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ నాయకుల రక్తాన్ని పంట పొలాల్లో చల్లుతానని అనడం దారుణమన్నారు. గ్యారంటీల పేరుతో గారడీ చేశారని, నల్గొండ జిల్లా నాయకుల ట్రాప్‌లో పడి రైతులు చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ప్రాజెక్టులో నీరు సరిపడా ఉన్నా సాగునీరు అందించడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. జిల్లాలోని మంత్రులకు బాధ్యత లేకుండా పోయిందని, నీళ్ల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కన్నీళ్ల మంత్రిగా మారారని ఎద్దేవా చేశారు. ఎస్ఎల్‌బిసి సొరంగం ఎందుకు కూలిపోయిందో చెప్పలేక నీళ్లలో వాటర్ కలిసిందని వెంకట్‌రెడ్డి విచిత్ర సమాధానాలు ఇస్తున్నారని విమర్శించారు. గతంలో ఎంతటి కరువు పరిస్థితులు వచ్చినా వానాకాలం, వేసవి కాలంలో సాగు నీటిని అందించామని, నేడు ప్రాజెక్టుల్లో నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు వదలడం లేదని మండిపడ్డారు. నాటి పోరాటాల తరహాలోనే నేడు ఎడమకాల్వకు వినాయక చవితిలోపు నీరు వదలకపోతే కోదాడ నుంచి హాలియా వరకు తానే స్వయంగా పాదయాత్ర చేపడతానని స్పష్టం చేశారు. నీటి షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేసి ఎన్ని తడులకు నీరు అందిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీటి విడుదల గురించి అడిగితే ఆరు తడి పంటలు వేసుకోవాలని చెప్పడం బాధ్యతారాహిత్యమన్నారు. కొమటిరెడ్డికి నీరు ఇచ్చే ఆలోచన లేదని, రేవంత్ రెడ్డి గురుదక్షిణ కింద కుడి కాలువ ద్వారా ఆంధ్రకు నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యేలను గెలిపించడం వల్ల జిల్లా ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబును గట్టిగా ప్రశ్నిస్తే ఓటుకు నోటు కేసు బయటకు వస్తుందనే భయంతో రేవంత్ రెడ్డి మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండకు నీళ్లు వెళ్తున్నా ఎడమ కాల్వకు నీటిని వదలకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. మిర్యాలగూడ వేదికగా పది రోజుల్లో నీటి షెడ్యూల్ విడుదల చేయాలని, ఎన్ని తడులు ఇస్తారో స్పష్టంగా చెప్పాలని, లేనిపక్షంలో పాదయాత్రతో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. మాటలు నమ్మి ఓటు వేసిన ప్రజలను, రైతాంగాన్ని నిలువునా మోసం చేశారని, రూ.2 లక్షల రుణమాఫీ సగం మందికి కూడా కాలేదని, కనీసం యూరియా కూడా దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, అండగా కెసిఆర్ ఉన్నారని ధైర్యం చెప్పారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో సాగునీటి అంశంపై ప్రభుత్వం మెడలు వంచి పోరాటం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు, నియోజకవర్గ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నల్లగొండ జిల్లాకు తీరని అన్యాయం

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విమర్శ

కాంగ్రెస్ శ్రేణులతో భారీ నిరసన ర్యాలీ, ధర్నా

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో గురువారం తీవ్ర రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. బిఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన రైతు సభ, మహాధర్నా కార్యక్రమాలకు పోటీగా కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ప్రదర్శనకు శ్రీకారం చుట్టింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. స్థానిక శాసన సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కేటీఆర్ పర్యటనను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ తీరుపై కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఎదుట శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలసి భారీ ధర్నా చేపట్టారు. కేటీఆర్ గో బ్యాక్ అంటూ ప్లకార్డులు చేతబూని కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నల్గొండ జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆ పార్టీ సంపూర్ణంగా విఫలమైందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహ్మద్ బందగీ మృతి తీరని లోటు

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/డిండి:** రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ కుమారుడు బందగీ అకాల మరణం తీరని లోటు అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం కందుకూరు గ్రామంలో బందగీ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మైనోద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈసందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతు సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్ పెద్ద కుమారుడు బందగి అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని, తీవ్ర విచారాన్ని కలిగించిందని అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు బందగి చిన్న వయస్సులోనే మరణించడం ఎంతో బాధాకరం అని నిరంతరం ప్రజా పోరాటాలలో, రైతు సమస్యల పరిష్కారంలో నిమగ్నమైయ్యే రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్ కుటుంబానికి ఈ ఘటన తీరని లోటును మిగిల్చిందని అన్నారు. అమరుడు బందగి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, పుత్రశోకంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, రామచంద్రం, కనకాచారి, విజేందర్‌రెడ్డి, శైలేష్, జయరాములు, సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నకిరేకల్** : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 5న నకిరేకల్ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం నకిరేకల్‌లో పర్యటించిన ఆయన సీఎం ప్రారంభించనున్న ప్రాంతీయ వైద్యశాల, బహిరంగ సభ వేదిక, హెలి ప్యాడ్ ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.నూతనంగా నిర్మించిన ప్రాంతీయ వైద్యశాలను సిఎం ప్రారంభించనున్నందున ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన సూచించారు.భవనాన్ని విద్యుత్ దీపాలు,లైటింగ్, పూల అలంకరణతో ముస్తాబు చేయాలని ఆదేశించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు.డబుల్ బ్యారికేడింగ్,లైటింగ్,గ్రీన్‌రూమ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు.ఈకార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి,ఆర్అండ్‌బీ ఎస్ఈ పున్నమోహన్,ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సతీష్,తహసీల్దార్ యశ్వంత్ పాల్గొన్నారు.

## ఎవరికి ఏం పదవులు ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుంది

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వాఖ్యలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గ్రామంలో రోడ్ల శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గురించే నా ఆలోచన అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. పది సంవత్సరాలపాటు బిఆర్ఎస్ పైన పోరాటం చేసిన నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగాలని నా ఉద్దేశమని తెలిపారు. నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరుగొద్దనేది ఎవరికి ఏం పదవులు ఇవ్వాలనేది అధిష్టానం చూసుకుంటుందని మా నాయకుడు రాహుల్ గాంధీపై నమ్మకం ఉందని ఆయన ఏ నిర్ణయం తీసుకున్న నేను దానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. కొండ సురేఖ అంశం అధిష్టానం దగ్గర ఉందని అధిష్టాన నిర్ణయమే ఫైనలని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ,ఆర్ అండ్ బి రోడ్ల శాఖ మాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో రోడ్ల అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు ఎక్కువ నష్టపరిహారం చెల్లించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి

*గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి విజయ పాల డైరీ కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ వీరేశం*




**ప్రజాపక్షం/చిట్యాల:** వ్యవసాయం చేసుకుంటూనే పాడిని అభివృద్ధి చేసుకోవల్సిన అవసరం రైతులకు ఉందని రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో 5వేల లీటర్ల నిల్వ సామర్థ్యం గల విజయ పాల డైరీ కేంద్రాన్ని బుధవారం విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు ఆర్థిక చేయూతను అందించడంలో పశు సంపద ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో అవసరానికనుగుణంగా పాల ఉత్పత్తి జరకపోవడం కారణంగా ఇతర రాష్ట్రాల నుండి పాలను దిగుమతి చేసుకోవల్సి వస్తుందన్నారు. వ్యవసాయ రంగంతో పాటుగా పాడి పరిశ్రాభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారనడానికి నష్టాలలో ఉన్న విజయ డైరీకి రూ. 100 కోట్ల నిధులను మంజూరు చేయడమే ఒక ఉదాహరణ అని అన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో బంగారు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల చేశారని, 1000 రోజులుగా దానిని ముఖ్యమంత్రి చక్కదిద్దుతూ వస్తున్నారన్నారు. గుత్తా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచడానికి నాలుగు విజయ డైరీలను నూతనంగా ప్రారంభించనున్నామన్నారు. వ్యవసాయానికి సమాంతరంగా రైతులు పాడిని అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తిని ప్రజలకు సరఫరా చేస్తూ వారి మన్ననలను విజయ డైరీ పొందుతుందన్నారు. అర్హత కలిగిన రైతులు పాడి అభివృద్ధి చేసుకోవడానికి బ్యాంకుల నుండి రుణాలను ఇప్పించడం జరుగుతుందని, అందులో భాగంగా ఈ రోజు రూ. 20 లక్షల రుణాలను యూనియన్ బ్యాంకు వారు అందిచడం జరిగిందన్నారు. పాడి రైతుల సంక్షేమం కోసం విజయ డైరీ పాటు పడుతుందని అమిత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పందిరి గీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మి సైదులు, కనకదుర్గ ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు నర్రా మోహన్‌రెడ్డి,పోకల దేవదాసు, జడల చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఆసుపత్రిలో ఇకపై వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఆయన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పురుషుల, మహిళల ఓపి రూమ్‌లను సందర్శించి ఔట్‌పేషంట్ రిజిస్టర్‌లు పరిశీలించి, ఎంతమంది అవుట్ పేషంట్స్ ఈరోజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఏఎంసి వార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్యూటి డాక్టర్లను ఈరోజు పేషెంట్లకు వైద్య సేవ అందించు రౌండ్స్ పూర్తయ్యా అని అడిగి తెలుసుకున్నారు. పిఎంజెవై, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పేషంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను, డ్రగ్స్ స్టోర్ రూమ్‌ను, జనరల్ మెడిసిన్ డాక్టర్ రూమ్‌ను తనిఖీ చేశారు. డయాగ్నస్టిక్ రూమ్, బ్లడ్ శాంపిల్ కౌంటర్‌ను తనిఖీ చేసి ఈ రోజు పేషెంట్లకు ఏమేమి పరీక్ష నిర్వహించారు, రిపోర్టు ఎలా ఉన్నవి అని రిపోర్ట్స్ పరిశీలించారు. డయాగ్నస్టిక్ కెమికల్స్ వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తదుపరి జనరల్ వార్డును తనిఖీ చేసి పేషంట్ల వివరాలను డ్యూటీ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అక్కడే మెడిసిన్ రియాక్షన్ వలన చికిత్స పొందుతున్న తిరుమలగిరికి చెందిన రహీమా బేగంను పరామర్శించి రియాక్షన్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆర్ఎంను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఫీవర్ కేసులు, అడ్మిషన్లు, డిశ్చార్జ్ వివరాలను అప్‌డేట్ చేయాలని చెప్పారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలని, ఐడి కార్డులు ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాణి, జనార్ధన్, అనిత, శ్రీలత, ఉపేందర్, యశ్వంత్, వినయ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్య ఉద్యమం




10న చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలి

ఎస్‌టియు-టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** తెలంగాణ ఉద్యోగ,ఉపాధ్యాయ,కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ ఉద్యోగుల హక్కుల సాధన సభను విజయవంతం చేయాలని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ పిలుపునిచ్చారు.సభను విజయవంతం చేసేందుకు నల్లగొండ,సూర్యాపేట జిల్లాల ఉద్యోగ సంఘాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికిముఖ్య ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు.ఉద్యోగులు,ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సభకు రెండు జిల్లాల నుంచి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు. మెరుగైన వేతన నిర్ణయంతో రెండో వేతన సవరణ సంఘం సిఫారసులను తక్షణమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని,దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు.ఈ సమావేశంలో అఖిల భారత పాఠశాల ఉపాధ్యాయ సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యులు కొనకంచి వీర రాఘువులు,రాష్ట్ర కార్యదర్శి కందిమల్ల నరేందర్,కార్యదర్శి మురారి శెట్టి రమేష్,సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్తూరి అంజయ్య,నల్లగొండ జిల్లా ఆర్థిక కార్యదర్శి కొనకంచి వెంకటేశ్వర్లు,జిల్లా నాయకులు కె.దత్తేశ్వర్,రమావత్ రామ్‌సింగ్,ఆంగోతు తావూరియా,ఎం. వెంకటేశ్వర్లు, అంబటి వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## అన్ని వర్గాల సంక్షేమానికి కోసం కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలు, రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రజాపాలనపై బిఆర్ఎస్ నిరసనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని, ప్రభుత్వం దిగిపోవాలని బిఆర్ఎస్ నాయకులు నిరసనలు చేయడం వెనుక కారణమేమిటని ప్రశ్నించారు. 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసినందుకు ప్రజా ప్రభుత్వం దిగిపోవాలా అని నిలదీశారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించేం దుకు రూ.1.72లక్షల కోట్లు ఖర్చు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వా నిదేనన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ ఇప్పటి వరకు సుమారు రూ.12,167 కోట్ల మేర ప్రయాణ ఖర్చు ఆదా చేసినట్లు తెలిపారు.

## తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

జల్సాల కోసం దొంగతనాలు.. ముగ్గురు సభ్యుల ముఠా అరెస్ట్

రూ.14,500 నగదు,30 తులాల వెండి,గ్యాస్ సిలిండర్లు, బ్యాటరీలు,సెల్‌ఫోన్లు స్వాధీనం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల నుంచి భారీగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం నల్లగొండ పట్టణంలోని ఓల్డ్‌సిటీ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన నదీమ్ (25),షేక్ రిజ్వాన్ (26),మహమ్మద్ అబ్దుల్ సమీర్ (23) ముఠాగా ఏర్పడ్డారు.గత రెండు నెలలుగా నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి,తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్నారు.నమ్మదగిన సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా ఐదు దొంగతనం కేసులకు పాల్పడినట్లు అంగీకరించినట్లు సీఐ తెలిపారు.నిందితుల నుంచి 30 తులాల వెండి ఆభరణాలు, నాలుగు గ్యాస్ సిలిండర్లు, మూడు బ్యాటరీలు,నాలుగు సెల్‌ఫోన్లు, రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితులు గతంలోనూ నేరాలకు పాల్పడి జైలుకు వెళ్లిన చరిత్ర ఉన్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి వెల్లడించారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.సమావేశంలో ఎస్ఐలు సైదులు, వెంకట్ నారాయణతో పాటు సిబ్బంది రబ్బానీ,సాగర్ల శంకర్, అంజద్, కిరణ్,అంజయ్యలు ఉన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



**ప్రజాపక్షం/ చౌటుప్పల్** : అక్రమంగా తరలిస్తున్న పశువులను చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు.సిఐ జి.మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట పశువుల సంత నుండి 16 ఆవులను,10ఎద్దులను కొనుగోలు చేసి హైద్రాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా మండలంలోని ధర్మోజిగూడెం గ్రామ స్టేజి వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు తెలిపారు.పశువులను తరలిస్తున్న వావానాన్ని సీజ్ చేసి,హైద్రాబాద్ దమ్మాయిగూడకు చెందిన ఎస్‌కే.ఇస్మాయిల్,ఆంధ్రలోని కోనసీమ రామచంద్రాపురంకు చెందిన వెంకన్నబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.పట్టుకున్న ఆవులను గోశాలకు తరలించారు.

# మాజీల పోరులో ఆలేరు బిఆర్ఎస్‌కు డ్యామేజీ!

ఆధిపత్య పోరుతో గులాబీ శ్రేణుల్లో అయోమయం..

పుంజుకుంటున్న కాంగ్రెస్

సునీత, భిక్షమయ్య వర్గాలుగా కార్యకర్తల విభజన..

అధిష్టానం జోక్యంపై ఎదురుచూపులు




**ప్రజాపక్షం/యాదాద్రి** : ఒకప్పుడు బిఆర్ఎస్‌కు బలమైన రాజకీయ కంచుకోటగా నిలిచిన ఆలేరు నియోజకవర్గంలో ప్రస్తుతం అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ మధ్య కొనసాగుతున్న రాజకీయ ఆధిపత్య పోరు పార్టీపై ప్రభావం చూపుతోందన్న చర్చ గులాబీ శ్రేణుల్లో జోరందుకుంది. రాబోయే ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ ఇరువురు నేతలు ఆశలు పెట్టుకోవడంతో నియోజకవర్గంలో వారి వర్గాల మధ్య పోటీ మరింత స్పష్టంగా కనిపిస్తోందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**ఎవరి దారి వారిదే..**

నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసుకునే విషయంలో ఇరువర్గాల మధ్య ఏకాభిప్రాయం కొరవడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ ప్రతిపక్ష నేతగా రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం జిల్లా కేంద్రమైన భువనగిరిలో గొంగిడి సునీత మీడియా సమావేశం నిర్వహించగా, ఇదే అంశంపై నియోజకవర్గం కేంద్రమైన ఆలేరులో బూడిద బిక్షమయ్యగౌడ్ మీడియా సమావేశం నిర్వహించడం వర్గ విభేదాలు మరోసారి బయటపడ్డాయి. దీంతో ఒకే పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటున్న పరిస్థితి నెలకొంటోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా మండలాల వారీగా పార్టీ శ్రేణులు ఎవరి వెంట నడవాలనే విషయంలో స్పష్టత లేకుండా పోతోందన్న చర్చ సాగుతోంది.

**నిరసనలకూ వర్గపోరు ఛాయలు?**

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, వైఫల్యాలపై బీఆర్ఎస్ చేపట్టే నిరసన కార్యక్రమాలు సైతం ఆలేరులో వర్గాల బలప్రదర్శనకు వేదికలుగా మారుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమం కంటే ఎవరి ఆధిపత్యం ఎంత అన్నదే ప్రాధాన్యంగా మారితే అది చివరకు పార్టీకి నష్టం కలిగించే అవకాశముందని సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజా సమస్యలపై అధికార పార్టీని నిలదీయాల్సిన సమయంలోనే అంతర్గత విభేదాలు తెరపైకి రావడం బీఆర్ఎస్ శ్రేణుల ను ఆందోళనకు గురిచేస్తోంది. నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగకపోతే క్షేత్ర స్థాయిలో పార్టీ క్యాడర్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**కాంగ్రెస్‌కు కలిసొస్తున్న పరిణామాలు..**

బీఆర్ఎస్‌లో నెలకొన్న అంతర్గత విభేదాలు కాంగ్రెస్‌కు రాజకీయంగా అనుకూలంగా మారుతున్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్ ఉన్న ప్రాంతాల్లో ప్రస్తుతం కాంగ్రెస్ తన కార్యకలాపాలను విస్తరిస్తూ ముందుకు సాగుతోందని స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రధానంగా బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో ఏర్పడుతున్న అయోమయాన్ని కాంగ్రెస్ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసుకునే దిశగా కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తుండటం బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారుతోందని పరిశీలకులు అంటున్నారు.

ఆలేరులో పార్టీని తిరిగి బలోపేతం చేయాలంటే ముందుగా అంతర్గత విభేదాలకు తెరదించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం బీఆర్ఎస్ శ్రేణు ల్లో వ్యక్తమవుతోంది. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కుదిర్చి, పార్టీ కార్యక్రమాలకు ఒకే దిశానిర్దేశం ఉండేలా అధిష్టానం చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు కోరుతున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే నాయకత్వం మధ్య ఆధిపత్య పోరు ముదిరితే దాని ప్రభావం ఎన్నికల సమయంలో తీవ్రం గా ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తు కంటే పార్టీ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చి నేతలు కలిసి పనిచేస్తారా? లేక వర్గపోరు మరింత ముదిరి గులా బీ కంచుకోటను బలహీనపరుస్తుందా? అన్నది ఇప్పుడు ఆలేరు రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

మొత్తంగా.. ఆలేరు బీఆర్ఎస్‌లో నెలకొన్న పరిణామాలు పార్టీ భవిష్యత్ రాజకీయ వ్యూహానికి కీలక పరీక్షగా మారాయి. ఆధిపత్య పోరుకు త్వరగా తెరదించి క్యాడర్ను ఏకతాటిపైకి తీసుకురాగలిగితేనే నియోజకవర్గంలో పాత రాజకీయ బలాన్ని నిలబెట్టుకునే అవకాశం ఉంటుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. లేకుంటే ప్రత్యర్థి కాంగ్రెస్కు మరింత రాజకీయ స్థలం కల్పించినట్టవుతుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## మత్స్య సహకార సంఘం నిధుల అక్రమాలపై విచారణ

**ప్రజాపక్షం/అనంతగిరి** : వాయిలసింగవరం మత్స్య సహకార సంఘంలో నిధుల దుర్వినియోగంపై గురువారం మత్స్య సహకార సంఘం ఆఫీసు నందు మత్స్యశాఖ డిప్యూటి డైరెక్టర్ సుజాత ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కంటు నాగార్జున లోగడ రెండుసార్లు విచారణకి హాజరు కాలేదు. అధ్యక్షుడు కంటు నాగార్జున హాజరు కాగా ఆయన ముందే అక్రమ లావాదేవీలపై విచారణ చేశారు. విచారణలో నేను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని కొంతమంది కావాలని నాపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. విచారణ అధికారుల ఎదుట తాను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని విచారణ అధికారులకు లేఖ ద్వారా తెలిపారు. అక్రమ లావాదేవీలపై సంఘమునకు సంబంధించిన రికార్డులను పరిశీలించి విచారించి తెలంగాణ హైకోర్టు పరిధిలో ఉన్నందున విచారణ రిపోర్టును హైకోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. సంఘంలో ఉన్న బైలా సభ్యులు 86 మంది కాగా కేవలం 17 మంది మాత్రమే హాజరయ్యారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అనంతగిరి ఎస్ఐ ఏడుకొండల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డిఎఫ్ఓ మారయ్య, ఫీల్డ్ మెన్ ఉపేందర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
హైదరాబాద్
శుక్రవారం
04-09-2026
www.prajapaksham.in

ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో చిత్రంతో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టింది. ఇ.ఎం.ఐ టైటిల్‌తో న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఒ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తోంది.

రీల్



## ‘జయహో రామానుజ’ పాట ఆవిష్కరణ

లయన్ డా. సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా ‘జయహో రామానుజ.’ ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా..సుమన్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అక్టోబర్ 25న ‘జయహో రామానుజ‘ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో రిలీజ్‌కు రాబోతోంది. ఈ చిత్ర సాంగ్ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌పిసి ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ రామానుజాచార్యుల వారి ఘనతను ఈ తరానికి తెలియజేయడంలో చినజీయర్ స్వామితో పాటు మా సాయి వెంకట్ కూడా అభినందనలు అందుకుంటున్నారు. ఆయన కావాలనుకుంటే ఏదైనా కమర్షియల్ సినిమా చేసి డబ్బులు సంపాదించుకోవచ్చు. కానీ మనుషులంతా ఒక్కటేననే సందేశాన్ని చాటిన మహనీయుడు రామానుజాచార్యుల వారి జీవిత కథను ఈ తరం వారికి చూపించే ప్రయత్నం చేయడం ప్రశంసనీయం అన్నారు. నటుడు, దర్శకుడు లయన్ సాయి వెంకట్ మాట్లాడుతూ కులం లేదు మతం లేదు మనుషులంతా ఒక్కటే, సమానమే అని చెప్పిన గొప్ప మహనీయుడు రామానుజాచార్యులు. ఈ సినిమా రూపొందిస్తున్న సమయంలో ఎన్నో అద్భుతాలు నా జీవితంలో జరిగాయి. టిటిడికి 20 లక్షల రూపాయలు విరాళం ఇవ్వగలిగాను అంటే అది రామానుజాచార్యుల వారి మహిమే. ఈ సినిమాను భారీ ప్రచారం చేసి ఘనంగా రిలీజ్ చేయాలని నిర్ణయించుకున్నాం. పోస్ట్ ప్రొడక్షన్ లో హై క్వాలిటీ తీసుకు వచ్చే ప్రయత్నంలో రిలీజ్ కాస్త ఆలస్యమైంది. అప్పట్లో బ్రాహ్మణులకు మాత్రమే దేవాలయాలకు ప్రవేశం ఉండేది. అలాంటి టైమ్‌లో ఒక ఆధ్యాత్మిక విప్లవం తీసుకొచ్చారు రామానుజాచార్యులు. మనుషులంతా ఒక్కటే కదా అలాంటప్పుడు మిగతా వారికి ఆలయ ప్రవేశం ఎందుకు లేదు అని ప్రశ్నించాడు, అందరిలో చైతన్యం తీసుకొచ్చాడు. అందరికీ ఓం నమో నారాయణ మంత్రాన్ని నేర్పించి, ఇక నుంచీ ప్రతి ఒక్కరు బ్రాహ్మణులే వైష్ణవులే అని చాటాడు. మా సినిమాను అక్టోబర్ 25న గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరుతున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత, నటి ప్రవల్లిక డైరెక్టర్ సముద్ర, ప్రొడ్యూసర్ రామసత్యనారాయణ, ప్రొడ్యూసర్ మోహన్ గౌడ్, యాదగిరిగుట్ట బోర్డ్ మెంబర్ డా లక్ష్మి నారాయణ, ఒబిసి కన్వీనర్ మల్లేష్, అన్నపూర్ణ, ప్రొఫెసర్ కిరణ్, శ్రీనివాస్, నిర్మాత మోహన్ గౌడ్, నటుడు రాంకీ, సత్యనారాయణ, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ అంతా కలిసి ఎంజాయ్ చేసే మూవీ



‘రంభ ఊర్వశి మేనక’ హీరో అల్లరి నరేష్

అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ ఎంటర్‌టైనర్ ‘రంభ ఊర్వశి మేనక’తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. రంభ మేనకా ఊర్వశి లాంటి సోషియో ఫాంటసీ కథల్లో మానవులు ఇంద్రలోకం, యముడి వద్దకు వెళ్తుంటారు. కానీ ఇందులో ‘రంభ ఊర్వశి మేనక’ స్వర్గం నుంచి కిందకు వస్తారు. ఇందులో కథానాయకుడికి చిన్నప్పటి నుంచి ఒక డ్రామా కంపెనీ ఉంటుంది.‘రంభ ఊర్వశి మేనక’ను దేవతల్లా పూజిస్తుంటాడు. తనది కష్టపడకుండా హీరో అయిపోవాలనే క్యారెక్టర్. దేవతలు దీవిస్తే నెక్ట్స్ రాజమౌళి సినిమాలో తనే హీరో అనుకునే నమ్మకం ఉంటుంది. తన కుటుంబానికి ముత్తాతల నుంచి వస్తున్న ఒక పుస్తకం ఉంటుంది. అందులో ఒక ప్యాటన్ గీస్తే దేవతలు వచ్చి కోరికలు తీరుస్తారని నమ్మకం ఉంటుంది. హీరో ఆ ప్యాటన్ ఎలా గీశాడు? రంభ ఊర్వశి మేనక వచ్చిన తర్వాత ఎలాంటి సంఘటనలు జరిగాయనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. చాలా రోజుల తర్వాత మంచి కామెడీ ఎంటర్‌టైనర్ విన్నట్టుగా అనిపించింది. ప్రేక్షకులు కూడా నా నుంచి ‘కితకితలు’, ‘బెండు అప్పారావు’ లాంటి కామెడీ సినిమాలు మిస్ అవుతున్నారు. అలాంటి కథ గురించి చూస్తున్నప్పుడు దర్శకుడు చంద్ర మోహన్ చెప్పాడు. సీజీ వర్క్ పరంగా ఎక్కువ బడ్జెట్ అవుతుందని తెలిసినా మంచి సినిమా అవుతుందని మొదలుపెట్టాం. చంద్ర మోహన్ చాలా మంచి రైటర్ కూడా. ఈ కథని ఆయన చక్కగా రాసుకొని వచ్చారు. అలాగే నందు మంచి డైలాగ్స్ ఇచ్చారు. నాది చాలా ఎంటర్‌టైనర్‌గా ఉండే క్యారెక్టర్. అందరి దగ్గర అప్పులు చేసి ఉంటాడు. తనని ఎవరు ఊర్లో నమ్మరు. నా బడీ లాంగ్వేజ్ సరిపడే కామెడీని డైరెక్టర్ డిజైన్ చేశారు. అలాగే స్వర్గం, నరకం, ఇంద్రలోకం ఇలాంటి కథలు చూసి చాలా కాలం అయింది. కచ్చితంగా ఆడియన్స్, అలాగే చిన్నపిల్లలు చాలా ఎక్సైట్ అవుతారు. చాలా క్లీన్ కామెడీ ఇందులో ఉంటుంది. ఫ్యామిలీ అందరూ కలిసి చూసేలా ఈ సినిమా వుంటుంది. కామెడీ కూడా చాలా ఆర్గానిక్‌గా ఉంటుంది.ఆయన వాడే భాష చాలా సినిమాటిక్‌గా ఉంటుంది. సినిమాలో అందరూ మంచి కామెడీ టైమింగ్ ఉన్న యాక్టర్స్‌నే ఉన్నారు. ఫన్ అద్భుతంగా వచ్చింది. ప్రస్తుతానికి నా దృష్టి మొత్తం నటనపైనే ఉంది. నటుడిగా మంచి విజయవంతమైన చిత్రాలు చేయడం పైన నా దృష్టి ఉంది. మొన్నటి వరకు సీరియస్ ఫిలిమ్స్ చేశాను. ఇది మాత్రం చాలా మంచి కామెడీ ఎంటర్‌టైనర్. ఇది చాలా లైట్ హార్టెడ్ ఫిలిం. రెండున్నర గంటలు హాయిగా నవ్వుకుంటూ వెళ్ళండి.

## కొత్త నటీనటులతో ‘ఇఎంఐ’



ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’ చిత్రంతో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకున్న 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ మరో కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టింది. ‘ఇ.ఎం.ఐ’ టైటిల్‌తో న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూ నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులతో ఒ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తోంది. ఈ చిత్రానికి నిఖిల్ కువ్వరపు దర్శకత్వం వహిస్తున్నారు. లాల్ సలామ్, హాస్టల్ డేస్ వంటి పలు వెబ్ సిరీస్ లతో పేరు తెచ్చుకున్న దరహాస్ ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. లిటిల్ హార్ట్స్ సినిమాలో ఒ కీలక పాత్ర పోషించి ఫేమ్ అయిన శైలజ ఈ చిత్రంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోంది. పూజా కార్యక్రమాలతో ‘ఇ.ఎం.ఐ‘ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి హీరో ఆది సాయికుమార్ క్లాప్ ఇవ్వగా, డైరెక్టర్ సాయి మార్తాండ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో సినిమా దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ స్క్రిప్ట్ అందజేశారు.బైక్, కారు, మంచి ఫోన్..ఇలా ఏ వస్తువు కొన్నా ఇ.ఎం.ఐ కట్టాల్సిందే. దాదాపు ప్రతి మధ్య తరగతి ఇంటిలో ఇ.ఎం.ఐ కష్టాలు తప్పవని అనుకోవచ్చు. ఇలా ఇ.ఎం.ఐ మీద వస్తువులు తీసుకున్న యువత ఆ ఇ.ఎం.ఐలు కట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు అనే కాన్సెప్ట్‌తో హార్ట్ టచింగ్ ఎమోషన్స్‌తో పాటు కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాలోని ప్రతి సీన్ యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ కనెక్ట్ అయ్యేలా ఉండబోతోంది. ఈ చిత్రాన్ని పక్కా ప్లానింగ్‌తో నిర్మించి భారీ స్థాయిలో పబ్లిసిటీకి కూడా మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ సినిమాతో పాటు 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో దర్శకుడు రాహుల్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఒక భారీ చిత్రాన్ని నిర్మించబోతోంది. ఈ సినిమాకు సంబంధించిన కాస్ట్ అండ్ క్రూ వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. ఇకపై మంచి కాన్సెపట్స్‌తో బ్యాక్‌టు బ్యాక్ మూవీస్ చేసేందుకు 7 పి.ఎం. ప్రొడక్షన్స్ సంస్థ ప్లాన్స్ చేస్తోంది.

## ‘డియర్ హార్ట్’ పోస్టర్ విడుదల



వారాహి ఆర్ట్స్ బ్యానర్ మీద బొబ్బాస్ సమర్పణలో రావి సౌజన్య నిర్మాణంలో లక్ష్మ ణ్ , రాధికా జోషి , సుప్రియా చవాన్ ప్రధాన పాత్రలుగా జిడి నరసింహ తెరకెక్కిస్తున్న చిత్రం ‘డియర్ హార్ట్’. ఈ సినిమాలో సురేష్ గురు , పృధ్వీ రాజ్ , సత్య ప్రకాష్ , జబర్దస్త్ నూకరాజు , జగదీశ్వరి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను సాయి రాజేష్ రిలీజ్ చేశారు.‘కొన్ని ప్రేమ కథలు కొన్ని రోజులు మాత్రమే గుర్తుంటాయి.. కానీ కొన్ని కథలు కాలం ఉన్నంత వరకూ గుర్తుంటాయి.. నువ్వు నాకు ఎదురైన ప్రతీసారి కాలం కూడా ఒక్క క్షణం ఆగిపోయి చూసేది.. నా చివరి శ్వాస వరకు.. నా గుండె కొట్టుకున్న ప్రతీసారి ఆ చప్పుడు చెప్పే ఒకే ఒక్క పేరు.. నీదే.. బతికుంటే నీ ప్రేమతో.. ఊపిరి ఆగితే నీ జ్ఞాపకాలతో.. ప్రతీ ప్రేమ కథ ముగింపు వరకు వెళ్లలేకపోవచ్చు.. కానీ నిజమైన ఎ ప్రేమ అయినా చరిత్రలో అలా గుర్తుండిపోవాల్సిందే.. మన ప్రేమలా’ అంటూ సాగిన ఈ మూవీ మోషన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. యూత్ ఫుల్ ఫీల్ గుడ్ లవ్ స్టోరీగా రానున్న ఈ చిత్రానికి సాయి రాజేష్ ఆల్ ది బెస్ట్ తెలిపారు. ఈ సినిమాకి అరవింద్. బి కెమెరా మెన్‌గా, ఎస్. సుహాస్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. త్వరలోనే మూవీకి సంబంధించిన ఇతర అప్డేట్లను ప్రకటించనున్నారు.

## అక్టోబర్ 2న ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’



వైవిధ్యమైన పాత్రల్లో నటించి విలక్షణ నటుడిగా పేరు పొందిన స్టార్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్, ఇండస్ట్రీ హిట్ బాహుబలి మూవీని నిర్మించిన మేకర్స్‌తో పాటు సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతోన్న చిత్రం ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’. షోయింగ్ బిజినెస్ బ్యానర్‌పై తొలిసారి డిస్ట్రిబ్యూట్ చేసిన ప్రేమలు చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ఎస్.ఎస్. కార్తికేయ..ఇప్పుడీ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను ఇండియన్ సినిమాకు గర్వకారణంగా నిలిచిన బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాతలైన ఆర్కా మీడియాతో కలిసి రూపొందిస్తున్నారు. ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ చిత్రానికి శశాంక్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాసిల్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ కలసి ఈ ఆసక్తికరమైన, కంటెంట్‌రిచ్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే వినోదాన్ని పంచుతూ ఆసక్తిని రేకెత్తించిన టీజర్ తర్వాత మేకర్స్ ‘కేకు వాకు’ అనే వీడియో సాంగ్‌కు ఆడియెన్స్ నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమాను వరల్ వైడ్‌గా అక్టోబర్ 2న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. డబ్బు వర్షంలా కురుస్తుంది. దాన్ని చూసిన ఫహాద్ ఆనందంతో ఆశ్చర్యపోతున్నారు. ఈ చిత్రం అక్టోబర్2న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

## బొగ్గు ఉత్పత్తి కంటే కార్మికుల భద్రతే ప్రధానం

సింగరేణి సిఎండి బుద్ద ప్రకాశ్ జ్యోతి




ప్రజాపక్షం/హైదరాబాద్ : బొగ్గు ఉత్పత్తి కంటే కార్మికుల భద్రతకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ప్రమాదరహిత సింగరేణి కోసం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం జరిగిన 50వ త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.డిజిఎంఎస్ అధికారులు, సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో గనుల భద్రతపై చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఈ సందర్భంగా సిఎండి సూచించారు. కార్మిక సంఘాలు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రాణాపాయ ప్రమాదాలు తగ్గడం అభినందనీయమని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ డాక్టర్ సగేష్ కుమార్ అన్నారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు ఒకే బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని సూచించారు. సిబ్బంది కొరత, భద్రతా శిక్షణ, వైద్య సేవలు, నాణ్యమైన బూట్లు, స్పేర్ పార్ట్స్ అందుబాటుపై కార్మిక సంఘాలు చేసిన సూచనలను అమలు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చారు. ముందుగా ఇటీవలి ప్రమాదాలలో మృతి చెందిన కార్మికులకు సమావేశం సంతాపం తెలిపింది. అనంతరం గత ఏడాది త్రైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాల సమగ్రంగా చర్చించారు.ఈ సమావేశంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్య నారాయణ, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్, ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎమ్. తిరుమల రావు, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ ,మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, ఏరియాజనరల్ మేనేజర్లు, కార్పోరేట్ జనరల్ మేనేజర్లు, డిజిఎంఎస్ నుంచి డాక్టర్ ఐ. సత్యనారాయణ, రాజ్ కుమార్, కె మహేశ్వరరెడ్డి, పంకజ్ కుమార్ జైన్, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

(మొదటి పేజీ తరువాయి)

మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి ని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షురాలుగా నియమితులవ్వడంతో ఆమె మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసింది. దీంతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరేళ్ల శారదను నియమించారు.

## బర్తరఫ్

(మొదటి పేజీ తరువాయి)

సిఎస్ ద్వారా అధికారికంగా సిఫారసు లేఖను పంపించారు. కొండా సురేఖ కుమార్తె సిఎంపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆ తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ సిఫారసులకు, చివరికి బర్తరఫ్‌కు దారితీశాయి. కాగా, కొండాను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు సిఎం చేసిన సిఫారసుకు ఆమోదం లభించింది. గురువారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో లోక్‌భవన్‌లో భేటీ అయ్యారు. అనంతరం కొండా బర్తరఫ్‌ను ఆమోదిస్తున్నట్లు లేఖ వెలువడింది. మరోవైపు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న మాజీ మంత్రి డాక్టర్ జి.చిన్నారెడ్డిని ఆ పదవి నుంచి ముఖ్యమంత్రి తొలగించారు.

**వివాదానికి దారితీసిన అంశాలు**

ఇటీవల పరకాల నియోజకవర్గం పరిధిలోని గీసుకొండలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కించపరిచేలా ఆమె వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై వివరణ ఇవ్వాలని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. సురేఖ తన వివరణలో కుమార్తె చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని, వాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయవద్దని ఆమె పార్టీ క్రమశిక్షణ కమిటీని కోరారు. అయితే ఈ వివరణపై పార్టీ నాయకత్వం సంతృప్తి చెందలేదన్న అభిప్రాయం వ్యక్తమైంది.

**చిన్నారెడ్డి వ్యవహారంపైనా చర్య**

మాజీ మంత్రి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి వ్యవహారం కూడా అధిష్టానం దృష్టికి వెళ్లింది. వనపర్తి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే మేఘారెడ్డిపై చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. దీనిపై కూడా టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరింది.

సురేఖ, చిన్నారెడ్డి ఇద్దరూ తమ వివరణలను సమర్పించగా, టిపిసిసి వాటిని విశ్లేషించి అధిష్టానానికి నివేదిక పంపించింది. ఈ వ్యవహారంపై గత రెండు రోజులుగా సిఎం రేవంత్రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు పార్టీ అధిష్టానంతో చర్చలు జరిపినట్లు సమాచారం. టిపిసిసి నాయకత్వం, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కూడా క్రమశిక్షణ చర్యలకు అనుకూలంగా ఉండటంతో అధిష్టానం తుది నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

**అధిష్టానం కఠిన వైఖరి**

2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న కొండా సురేఖ వ్యవహారం గతంలోనూ పలు సందర్భాల్లో వివాదాస్పదమైంది. అయితే తాజా పరిణామాల్లో పార్టీ రాష్ట్ర నాయకత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. పార్టీ నాయకత్వంపై బహిరంగంగా లేదా పరోక్షంగా వ్యాఖ్యలు చేయడం, అంతర్గత విభేదాలు బహిర్గతం కావడం వంటి అంశాలకు అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతోనే అధిష్టానం చర్యలు చేపట్టినట్లు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అంటున్నారు.

## ఇడి పంజా

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దృష్టి సారించింది. గురువారం ఉదయం ఆమె నివాసంతో పాటు సంబంధిత వ్యక్తులు, అనుబంధ స్థావరాలు కలిపి మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఈడి అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. నీతూబాయి, ఆమె అనుచరులపై గతంలో ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసులను ఆధారంగా చేసుకుని ఈడి మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. గంజాయి అక్రమ విక్రయాల ద్వారా సమకూరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డబ్బు ఎక్కడికి మళ్లింది? ఎలాంటి ఆస్తులు కొనుగోలు చేశారు? ఇతర వ్యక్తులు లేదా సంస్థల ఖాతాల ద్వారా లావాదేవీలు జరిగాయా? అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. గంజాయి దందా ద్వారా వచ్చిన అక్రమ సొమ్ములో కొంత మొత్తాన్ని హవాలా మార్గంలో తరలించినట్లు ప్రాథమిక దర్యాప్తులో అనుమానాలు ఉన్నాయని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక పత్రాలు, ఆస్తుల డాక్యుమెంట్లు, ఇతర రికార్డులను ఈడి అధికారులు పరిశీలించినట్లు సమాచారం. అక్రమంగా సంపాదించినట్లు అనుమానిస్తున్న సొమ్మును స్థిరాస్తులు, ఇతర ఆస్తుల్లో పెట్టుబడిగా మార్చారా? కుటుంబ సభ్యులు లేదా అనుచరుల పేర్లపై ఆస్తులు కొనుగోలు చేశారా? అనే కోణంలోనూ ఈడి దర్యాప్తు సాగుతున్నట్లు తెలుస్తోంది. సోదాల్లో లభించిన పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలుస్తోంది.

## ముడిపడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

అని సెప్టెంబర్ 2 నాటి లేఖలో ఖర్గే పేర్కొన్నారు. ‘నా ప్రస్తావనకు స్పందిస్తూ మీరు సభలో లేచి ఇలా అన్నారు: ‘ఖర్గేజీ చెప్పిన విషయం నిజంగా చాలా బాధాకరమైనది. ఇది కాంగ్రెస్ పార్టీకే కాదు, మనందరికీ బాధాకరమైన విషయం. జరిగిన దానిపై కచ్చితంగా విచారణ జరుగుతుంది. భారతీయ జనతా పార్టీ ఇలాంటి చర్యలను ఎప్పుడూ సమర్థించదని నేను చెప్పదలుచుకున్నాను. నేను దీనిని ఖండిస్తున్నాను, మా జాతీయ అధ్యక్షుడు కూడా దీనిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. మీ మనోభావాలకు కలిగిన బాధ మా అందరికీ విచారకరం’ అని ఖర్గే గుర్తు చేశారు. విచారణ తర్వాత దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నడ్డా చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ కూడా ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేసినట్లు ఖర్గే పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి 24 రోజులు గడిచినప్పటికీ, హల్ద్వానిలో జరిగిన ఈ దుర్మార్గపు చర్యలో పాల్గొన్న సంస్థలు, వ్యక్తులపై కనీసం ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం ఆశ్చర్యకరమని ఖర్గే అన్నారు. ఈ ఘటనలో అత్యంత అభ్యంతరకరమైన విషయం ఏమిటంటే తాను ప్రసంగించిన రామ్‌లీలా మైదాన్ స్థలంలో భారత రాజ్యాంగ స్ఫూర్తికి, మానవ విలువలకు విరుద్ధంగా ‘శుద్ధి’ కార్యక్రమం నిర్వహించారని, ఈ శుద్ధి ప్రక్రియ నేరుగా అంటరానితనంతో ముడిపడి ఉందని సాధారణంగా భావిస్తారు అని నడ్డాకు రాసిన హిందీ లేఖలో ఖర్గే పేర్కొన్నారు. ‘ఈ సమస్య నా వ్యక్తిగత విషయానికో లేదా కాంగ్రెస్ అధ్యక్ష పదవికో పరిమితమైనది కాదని నేను స్పష్టంగా చెప్పదలుచుకున్నాను; ఇది ప్రతిరోజూ ఈ కఠిన వాస్తవికతను ఎదుర్కొంటున్న కోట్ల మంది ప్రజల మనోభావాలతో ముడిపడి ఉంది. ఇలాంటి తప్పులు చేసేవారికి తగిన గుణపాఠం చెప్పడం చాలా అవసరం’ అని కాంగ్రెస్ అధినేత అన్నారు. కాబట్టి, ఈ ఆగ్రహం కేవలం తనది మాత్రమే కాదు, ఆ కోట్ల మంది ప్రజల భావనలకు ప్రతిరూపమని, ఇది సమాజంలోని ఒక నిర్దిష్ట వర్గాన్ని నేరుగా ప్రభావితం చేసే మనస్తత్వానికి సంబంధించిన విషయం అని ఆయన పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడిన ఖర్గే, గత నెలలో హల్ద్వానిలో తన ర్యాలీ జరిగిన ప్రదేశంలో నిర్వహించిన ‘శుద్ధి’ కార్యక్రమం అంటరానితనం చర్య అని పేర్కొన్నారు. ఈ విషయంపై తమ పార్టీ రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్‌ను ఆశ్రయిస్తుందని చెప్పారు. ఈ విషయంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా మౌనం వహించడంపై ఖర్గే ప్రశ్నించారు, ఏదైనా చెడు జరిగినప్పుడు వారు మౌనంగా ఉంటారని ఎద్దేవా చేశారు. ఇటువంటి ‘శుద్ధి’ చర్యలకు వ్యతిరేకంగా గళమెత్తాలని, శాంతియుతంగా ఉద్యమాలు చేపట్టాలని ఖర్గే ప్రజలకు పిలుపునిచ్చారు.దళితులు, మహిళలు, విద్యార్థుల తరఫున గళమెత్తినందుకు గాంధీని ప్రశంసిస్తూనే, ఉత్తరాఖండ్‌లో ఆయనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినందుకు బిజెపి ఖర్గే తీవ్రంగా విమర్శించారు.

## ఆ అధికారం మీకెక్కడిది?

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్న నిర్ణయంపై ప్రధాన న్యాయమూర్తులు సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆగ్రహం వ్యక్తంచేస్తూ, ఈ ఉత్తర్వును జారీ చేసింది. ‘మా అభిప్రాయం కింద, ఏ అడ్వకేట్స్ చట్టం, 1961 కింద అయితే బిసిఐ చట్టబద్ధంగా సృష్టించబడిందో, ఆ చట్టం న్యాయశాస్త్ర విద్యార్థులపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారం బిసిఐకి గానీ, ఏదైనా రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు గానీ స్పష్టంగా లేదా పరోక్షంగా ఏమాత్రం లేదని మేం భావిస్తున్నాం. సదరు చట్టం కింద న్యాయశాస్త్ర పట్టభద్రుడిని న్యాయవాదిగా నమోదు చేసిన తర్వాతే అటువంటి అధికారం లభిస్తుంది. విద్యార్థుల విషయానికి వస్తే వారి మాతృ సంస్థ లేదా అటువంటి సంస్థ నిబంధనలు ఉప నిబంధనల కింద నిర్దేశించబడిన అధికార సంస్థ మాత్రమే క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు అర్హతను కలిగి ఉంటాయి’అని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. విస్తృత విమర్శల నేపథ్యంలో ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటల్లో ఆ రెండు నోటిఫికేషన్లను బిసిఐ ఉపసంహరించుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. నల్సార్ వివాదానికి సంబంధించి బిసిఐ జారీ చేసిన రెండు నోటిఫికేషన్లను బెంచ్ పక్కన బెట్టింది. ఆగస్టు 13నాటి అన్ని కమ్యూనికేషన్లు లేదా సవరించిన కమ్యూనికేషన్లు చట్ట బద్ధమైన అధికారం లేకుండా ఉన్నాయని మేం ప్రకటిస్తున్నాం. మధ్యంతర ఆదేశాలను ఖరారు చేస్తున్నాం’ అని పూర్వ విద్యార్థులు మిహిషా సూర్, అభిషేక్ తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతానికి, నల్సార్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోకూడదని, ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరపాలని, ఆగస్టు 13న బిసిఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా జారీ చేసిన ఆదేశాలను వారు సవాల్ చేశారు.అయితే, ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ ఆ ప్రకటన జారీ చేసిన కొన్నిగంటల్లోనే దానిని ఉపసంహరించుకున్నారు. విచారణ సందర్భంగా, న్యాయ విద్యార్థుల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ తన వాదన వినిపిస్తూ బిసిఐ చైర్మన్ తన ఆదేశాలను ఉపసంహరించుకున్నప్పటికీ, వాటిని జారీ చేసిన విధానంపై విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇది విశ్వవిద్యాలయంలో వాక్ స్వాతంత్ర్యానికి, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన ప్రశ్న అని, ఇది కేవలం ఒక విద్యార్థికి సంబంధించిన విషయం మాత్రమే కానేకాదని, ఇది మొత్తం విశ్వవిద్యాలయం వ్యాప్తంగా వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను నిషేధించడానికి సంబంధించినదని పరమేశ్వర్ వాదించారు. సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) చైర్‌పర్సన్ మిశ్రా మాట్లాడుతూ ఆ ఆదేశాల లేఖలను జారీ చేసిన గంటలోపే వాటిని ఉపసంహరించుకున్నామని, ఇప్పుడు ఈ విషయాన్ని ముగించాలని ధర్మాసనాన్ని కోరారు.

## రూ.3.54 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఉండే అవకాశం ఉందని ఏసిబి పేర్కొంది. సోదాల్లో రూ.4,63,990 నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13లక్షల నిల్వలు గుర్తించారు. అదేవిధంగా 709 గ్రాముల బంగారం ఆభరణాలు, 1750 గ్రాముల వెండి ఆభరణాలు లభించాయి. వీటి విలువ సుమారు రూ.20లక్షలుగా అంచనా వేశారు. సోమయ్యకు చెందిన రెండు 4 చక్రాల వాహనాలు, 3 ద్విచక్ర వాహనాలు ఉండగా వీటి విలువ సుమారు రూ.25.20 లక్షలుగా అధికారులు పేర్కొన్నారు. ఇంట్లోని గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల విలువ సుమారు రూ.11లక్షలుగా అంచనా వేశారు. 66.9 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రూ. 49 లక్షల బంగారు రుణం పొందారు. మరిన్ని ఆస్తుల వివరాలపై విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రూ. 3.54 కోట్లుగా ఆస్తులు అంచనా ఇప్పటి వరకు గుర్తించిన ఆస్తులు, నగదు, బంగారం, వాహనాలు తదితరాలను కలిపి సోమయ్యకు సంబంధించిన ఆస్తుల మొత్తం విలువను రూ.3,54,36,490గా ఏసిబి ప్రాథమికంగా అంచనా వేశారు. ఆదాయ వనరులతో ఆస్తుల విలువపై ఏసిబి అధికారులు మరింత ధర్యాప్తు చేస్తున్నారు. అనంతరం సోమయ్యను హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసిబి కోర్టు ఎదుట హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించినున్నట్లు ఏసిబి వెల్లడించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com